
అక్టోబర్ 2012
సంపుటి 6
సంచిక 6



ఎడిటర్ & పబ్లిషర్
సందిరెడ్డి కొండలరావు
కాకానిపాలెం, అద్దంకి.

Edited & Published and owned by
S. Kondala Rao
Akhil Publications
Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
Saswitha Graphics
Addanki

Layout & Design
Real image
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

## సామాజిక రాజకీయ మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | గుండ్లకమ్మ కథ | 6 |
| 2. | సింగరకొండ చరిత్ర | 9 |
| 3. | ఒంగోలు జాతి పశువులు ప్రపంచానికే గర్వకారణం | 14 |
| 4. | నటనారంగంలో కలికితురాయి – బండారు | 17 |
| 5. | గగనమెక్కిన రంగస్థల నట మాణిక్యం | 19 |
| 6. | పండరంగని అద్దంకి పద్యశాసనం | 21 |
| 7. | ఆశుకవి చక్రవర్తులు కొప్పరపు సోదర కవులు | 24 |
| 8. | ప్రముఖ వాగ్గేయకారులు శివనారాయణ తీర్థులు | 27 |
| 9. | మహాకవి ఎఱ్ఱన | 32 |
| 10. | ఒక్కసారి మోగిస్తే 108 సార్లు ఓంకారనాథం | 39 |
| 11. | అద్దంకిసీమ సాంస్కృతిక వికాసం | 41 |
| 12. | అద్దంకి చరిత్ర | 44 |
| 13. | అద్దంకి మండలంలో జానపద కళలు | 46 |
| 14. | ధృవతార ప్రకాశం | 48 |
| 15. | విదేశీ పక్షులకు ఆశ్రయమిస్తున్న వెలమవారిపాలెం | 50 |
| 16. | పాండిత్యంలో ప్రసిద్దులు అద్దంకి వంశస్తులు | 51 |
| 17. | ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చీమకుర్తి గ్రానైట్ | 52 |
| 18. | ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ప్రకాశం పొగాకు | 53 |
| 19. | సినివికాసంలో జిల్లావాసులు | 55 |
| 20. | ప్రకృతి ప్రసాదితమైన నల్లమల | 58 |
| 21. | సమైఖ్యత, సంఘీభావానికి ప్రతీకలు ప్రభలు | 60 |
| 22. | ప్రకాశం జిల్లా – పర్యాటక రంగం | 61 |
| 23. | అక్షరమై ప్రవహిస్తున్న గుండ్లకమ్మ | 65 |
| 24. | తెలుగు వెలుగు – ఘనాపాటి తుర్లపాటి | 69 |


www.gundlakamma.com

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

# ధన్యవాదములు

"గుండ్లకమ్మ" పత్రికను మీ చేతుల్లోకి తీసుకొన్నందుకు ధన్యవాదములు. తెలుగులో మంచి పత్రిక తేవాలన్న నా సంకల్పానికి చేయూతనిస్తున్నందుకు వెలుగులు పంచే ఈ దీపానికి ఏగాలి సోకకుండా అరచేయి అడ్డుపెడుతున్నందుకు, "గుండ్లకమ్మ" మాసపత్రికను పది సంవత్సరాల పాటు ఆదరించి, ఆర్థికంగానూ, హార్దికంగానూ పోషిస్తున్నందుకు మరోసారి ధన్యవాదములు.

నాటి సత్యదూత, వర్తమాన తరంగిణి, తత్వబోధిని, వివేకవర్ధిని మొదలు నేడు మనం చూస్తున్న సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పత్రికల వరకూ మాస, పక్ష, వార, దినపత్రికలలో ఏదైనా సరే పల్లె ప్రాంతాల నుండి వచ్చే పత్రిక కనిపించడం లేదు. ఆ నేపథ్యంలో పేరులోనూ, ప్రాధాన్యతలోనూ, పల్లె పట్టుకు ప్రధానస్థానం ఇస్తూ గ్రామీణ ప్రాంతం నుండి ప్రారంభమయ్యే పత్రిక "గుండ్లకమ్మ"

రాజకీయ, సాంస్కృతిక, వైజ్ఞానిక, కళాత్మక చైతన్యాన్ని కాడిపట్టిన ఇంట ప్రతిష్టించడమే లక్ష్యంగా "గుండ్లకమ్మ" అడుగులు వేస్తుంది. గుండ్లబ్రహ్మేశ్వరం నుండి గుండాయపాలెం వరకూ లక్షలాది ప్రజానీకం అవసరాలను తీరుస్తూ పవిత్ర నదిగా పేరుపొందిన "గుండ్లకమ్మ" పేరుతో ఈ పత్రికను తీసుకొన్నందుకు సంతోషంగా ఉంది.

ఈ పత్రిక విజయవంతం కావడమంటే మంచివిషయాలను అందించడమే కాదు, పది కాలాలు మనుగడ సాగించడం కూడా...

పత్రిక నిర్వహణ తలకుమించిన భారమైనప్పటికీ, పత్రికారంగంలో నాకున్న రెండు దశాబ్దాల అనుభవాన్ని, పెద్దలు నాకిస్తున్న ప్రోత్సాహాన్ని, సంస్థలు ఇస్తున్న ఆదరణ వెచ్చించి అవిశ్రాంతంగా కష్టపడి పత్రికను నిరాఘాటంగా తెచ్చేందుకు కృషిచేస్తున్నాను.

చారిత్రక రాజధాని అద్దంకి నుండి వెలువడే "గుండ్లకమ్మ" ను ఈనాడు పోటాపోటీగా వస్తున్న సామాజిక, రాజకీయ సాంస్కృతిక పత్రికల కంటే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ఆదరించే నా ప్రాంత ప్రజానీకానికి నేనెపుడూ రుణపడి వుంటాను.

గత పది సంవత్సరాలుగా "గుండ్లకమ్మ" పత్రిక స్థానిక, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ వార్తలు కవితలు, కథానికలు, మానవీయ కథనాలు ఇంకా... ఇంకా అనేక రూపాల్లో మీ ముందు ఆవిష్కరించబడింది. రసజ్ఞులైన పెద్దలు ఆనందించి అభినందించారు. రచయితలు సహకరించారు. చేయూతనిచ్చారు.

"గుండ్లకమ్మ"లో అందంగా ముద్రించబడుతున్న ప్రకటనలకు వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు, దేవాలయ ధర్మకర్తలు చారిటబుల్ అధినేతలు కళాశాలల అధినేతలు ఇంకా ఎందరెందరో వదాన్యులు ముచ్చటపడ్డారు. మళ్ళీ మళ్ళీ ప్రకటనలు ఇచ్చారు కొండంత ఊపిరిపోశారు.

సర్క్యులేషన్ పెరిగింది. సహృదయుల వెన్నుతట్టుపెరిగింది. అంతో ఇంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. అన్నీ ఇలాగే వుంటే మీ అందరూ ఆశీర్వదిస్తే పత్రిక ఇంకా అందంగా రూపుదిద్దుకొని మీ చేతుల్లో చిరకాలం నిలుస్తుంది.

పాఠకులు, ప్రకటనకర్తలు నా శ్రమని గుర్తించి పత్రికను ఆదరించడమే కాకుండా ఎప్పటికప్పుడు అభిప్రాయాలను అందజేస్తూ, 'గుండ్లకమ్మ' ను అందంగా, ఆకర్షణీయంగా, విలువైన సమాచారంతో అవిరామంగా ముందుకు సాగటానికి సహకరించి ఆశీర్వదించవలసినదిగా కోరుకుంటూ...

మీ....

**సందిరెడ్డి కొండలరావు,**

ఎడిటర్



डी. पुरंदेश्वरी
D. PURANDESWARI

सत्यमेव जयते

राज्य मंत्री
मानव संसाधन विकास
भारत सरकार
नई दिल्ली-110 115
MINISTER OF STATE FOR
HUMAN RESOURCE DEVELOPMENT
GOVERNMENT OF INDIA
NEW DELHI-110 115

# సందేశం

గుండ్లకమ్మకు అప్పుడే పదేళ్ళు నిండాయి. బాలారిష్ట దోషాలను త్వరలోనే అధిగమించి, మంచి ఆరోగ్యంతో అలరారుతూంది. వయస్సుకు మించిన ఎదుగుదల కన్పిస్తూంది. గ్రామీణ ప్రాంతం నుంచి వెలువడుతున్న పత్రిక పది సంవత్సరాల ప్రస్థానం వాస్తవంగా సాహసోపేతమైన ప్రయాణం. పత్రికా నిర్వహణ, ప్రచురణ యజ్ఞనిర్వహణ వంటి బృహత్తర కార్యం. అందులోనూ ప్రతినెలా యజ్ఞనిర్వహణం అంటే సామాన్యమైన విషయం కాదు. ఆ బాధ్యతానిర్వహణలో శ్రీ సందిరెడ్డి కొండలరావు కృతకృత్యులయ్యారనే చెప్పాలి. ఒక్కచేతి మీదుగా సమాచారసేకరణతో బాటు, పత్రికా లక్ష్యమైన రాజకీయ, సామాజిక సంబంధమైన విశ్లేషణలను, వ్యాసాలను రచయితల నుంచి సమకూర్చుకోవడం, పత్రికను అందంగా వెలువరించడం కష్టసాధ్యమైన పని. పది వసంతాల బాటు ఈ కార్యన్ని నిర్విఘ్నంగా కొనసాగించిన సంపాదకుడికి అభినందనలు. సాంస్కృతికాంశాలను కూడా పత్రికలో స్పృశిస్తూ ఉండడం ముదావహం. పత్రిక సంపూర్ణ ఆరోగ్యంతో రజతోత్సవాభిముఖంగా తన ప్రస్థానాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను. దశమ వార్షికోత్సవ సందర్భంగా నా హృదయపూర్వక శుభాభినందనలు.

(దగ్గుబాటి పురంధ్రీశ్వరి)



**GOTTIPATI RAVIKUMAR (BUJJI)**
M.L.A.,
***224-ADDANKI Assembly Constituency***
**Prakasam Dt.**

Phone : 08647 253443
Fax : 08647 254049
Cell : 98481 25717

Date : ..............................

# సందేశం

గుండ్లకమ్మ మాసపత్రిక పది సంవత్సరాల బాటు నిరాటంకంగా వెలువడుతూ ప్రజల మన్ననలను పొందడం గర్వించదగిన విషయం. రాజకీయ సామాజిక మాసపత్రిక అనే లక్ష్యాన్ని విస్మరించవచకుండా, ఎన్నో వివరణాత్మక వ్యాసాలను ప్రచురించి, ప్రజలకు అవగాహన కల్పించడంలో పత్రిక తన వంతు పాత్రను సమర్ధవంతంగా నిర్వహించింది. దశమవార్షికోత్సవం జరుపుకుంటున్న పత్రికను, సంపాదకులకు, పాతకులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేసుకుంటున్నాను.

(గొట్టిపాటి రవికుమార్)



Dr. DAGGUBATI VENKATESWARA RAO
M.L.A
PARCHURU, PRAKASAM DIST

Plot No.65, Road No. 13,
8-2-674 2/B/4/29, Banjara Hills,
Hyderabad - 500 034 (AP),
✆ : 040-23398204, 08594-242434
Fax : 040-23394959

# సందేశం

పెద్ద పత్రికల మనుగడే కష్టతరమౌతున్న ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతం నుండి పత్రికను ప్రారంభించడమే కాకుండా పది సంవత్సరాల పాటు నిరాటంకంగా కొనసాగించి ఈ రోజు దశమ వార్షికోత్సవం జరుపుకోవడం నిజంగా ఆనందదాయకం. కృషి, కార్యదీక్ష, పట్టుదల, నిజాయితీ, వృత్తి పట్ల అంకితభావం కల్గిన ఎడిటర్ కొండలరావు పత్రిక నాణ్యత విషయంలో కానీ, వార్తల విషయంలో కాని ఎలాంటి రాజీలేకుండా జాతీయ మాసపత్రికల స్థాయిలో పత్రికను తీసుకురావడం హర్షించదగ్గ విషయం. పత్రికా నిర్వహణలో కొండలరావు కృషిని అభినందిస్తూ వృత్తి పరంగా మరింత పురోభివృద్ధి చెందాలని మనసారా కోరుకుంటూ....

దగ్గుబాటి వెంకటేశ్వరరావు

# గుండ్లకమ్మ కథ



ప్రకాశం జిల్లాలో ఈ నది ప్రవహించడం మన భాగ్యం. ఈ నది నల్లమల అడవులలో 'గుండ్ల బ్రహ్మేశ్వరం' వద్ద పుట్టింది. అక్కడే బ్రహ్మేశ్వర ఆలయం ఉంది. చెంచు ప్రజలు మాత్రం నివసిస్తుంటారు. అక్కడ చిరుతలు, ఎలుగుబంట్లు తిరుగుతుంటాయి. మహాశివరాత్రికి ఉత్సవాలు చేస్తారు. గిద్దలూరు– నంద్యాల మధ్య ఊరు 'దిగువమెట్ట' నుండి వెళ్ళగలం. కమ్మ అంటే నది అని అర్థం. గుండ్ల బ్రహ్మేశ్వరం నుండి ప్రవహిస్తుంది. కనుక 'గుండ్లకమ్మ' అంటారు. అక్కడ నుండే ఇంకొక పాయగా 'జంపలేరు' పారుతుంది. ఈ నది 220 కిలోమీటర్లు పొడవున విస్తరించి ఉంది.

అక్కడి నుండి నది చిన్నకాలువగా ప్రవహిస్తోంది. గోదావరి నది, షిరిడీ వద్ద పిల్ల కాలువ. కాని రాజమండ్రి వద్ద పెద్ద వెడల్పాటి నది. అలాగే పిల్ల కాలవగా ప్రవహిస్తూ నెమలిగుండం వద్ద రెండు కొండల మధ్య నుండి దూకుతున్న గుండ్లకమ్మ జలపాతం చూడదగింది. ఇది సరస్సుగా మారుతుంది. అదే నెమలిగుండం. ఇక్కడికి పుల్లల చెరువు గ్రామం నుండి వెళ్ళవచ్చు. మయూర మహర్షి ఇచట తపస్సు చేశాడు. అందుచే నెమలి గుండం అనే పేరు వచ్చింది. పక్కనే కొండపై రంగస్వామి ఆలయం ఉంది.

కుడి నుండి లోతువాగు, ఎడమ నుండి ఎర్రవాగు వచ్చి నదిలో కలుస్తాయి. ఈ సంగమ ప్రదేశాన్ని ''సురభేశ్వర కోన'' అంటారు. ఇది ముఖ్య పుణ్యస్థలం. ఇచట జమదగ్ని ఆశ్రమం ఉంది. ఈ నది తురిమెళ్ళకు దగ్గరగా ప్రవహిస్తుంది. ఇక్కడ చెక్ డ్యాములు నిర్మిస్తున్నారు. నల్లవాగు, ఈదులవాగువచ్చి నదిలో కలుస్తాయి.

గుండ్లకమ్మ, జంపలేరు కలిసి కంభం చెరువులో కలుస్తాయి.



**చందవరం బౌద్ధస్థూపం ప్రక్కగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ**

నక్కలగండి నుంచి అలుగు ప్రవాహంగా గుండ్లకమ్మ ప్రయాణిస్తుంది. ఉప్పువాగు, ఏమిలేరును కలుపుకొని చింతలపాలెం మీదుగా రావిపాడు దగ్గరగా ప్రవహిస్తుంది. రావిపాడులో చెక్క రధాలు, దేవాలయాలు ఉన్నాయి.

గుండ్లకమ్మ నదికి గుండి, గుండినీ, గుండికా, బ్రహ్మగుండీ అనే పేర్లున్నాయి. రాళ్ళవాగును కలుపుకొని తర్లుపాడు వస్తుంది. పులివాగు, ఎర్రవాగు, మేకలేరును కలుపుకొని మార్కాపురం దగ్గరగా ప్రవహిస్తుంది. గుండ్లకమ్మ నదికి మార్కాపురం దగ్గర సమ్మర్ స్టోరేజి టాంకు కట్టారు. నది నీరు పంపింగ్ చేసి ప్రజలకు తాగునీటినిస్తున్నారు.

ఉప్పువాగును కలుపుకొని దూపాగు వచ్చిన నది వద్ద రిజర్వాయరు నిర్మిస్తున్నారు. నిర్మాణ పని 2000 మార్చిలో ఆగిపోయింది. తరువాత నది తీగలేరు, దువ్వలేరును కలుపుకొని 'చందవరం' దగ్గరగా ప్రవహిస్తుంది. గొప్ప బౌద్ధారామంగా పేరుగాంచిన గ్రామం 'చందవరం'. ఆరు అరుదైన శిలాఫలకాలు, 3 బంగారు పుష్పాలు, 100 చిన్న, 15 పెద్ద స్థూపాలు 1965లో బయల్పడ్డాయి. బుద్ధుని పాలరాతి శిల్పం ఉంది. ఇది క్రీ.శ.1వ శతాబ్దం నాటిది.

నది కాశీపురం, సోంపల్లి మీదుగా ప్రవహిస్తుంది. తరువాత మిరియంపల్లి, మిగతా గ్రామాల్లో రాక్షసరాళ్ళు (రాకాసి రాళ్ళు) ఉన్నాయి. ఇవి ప్రాచీన సమాధులు. దయ్యపువాగు, పసుపుతేరు, కందుర్లవాగు వచ్చి నదిలో కలుస్తాయి. తరువాత తంగిరాల, కురిచేడు మీదుగా ప్రవహిస్తుంది. ఇచట రాతిగుట్టలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 'అనేశ్వరం మెట్ట' అంటారు. ఇచట పూజలు చేస్తే యువతులు త్వరగా రజస్వల అవుతారట. నదీదేవత వారి వివాహం జరిపిస్తుందట. కల్లేరువాగును కలుపుకొని వినుకొండ వస్తుంది. అన్నిచోట్ల ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

ఇక్కడ వరకు (ఉత్తరం - తూర్పు) ఈశాన్యంగా ప్రవహించిన నది, ఇచట దక్షిణం-తూర్పు నుండి ఆగ్నేయదిశగా ప్రవహిస్తుంది. ఈ వంపు దాదాపు 20 కిలోమీటర్లు. తెల్లబాడు మీదుగా గన్నేరువాగు, జముకు వాగును కలుపుకొని గోకనకొండ, ఉప్పలపాడు మీదుగా ప్రవహిస్తూ భవనాసిని కలుపుకొని అద్దంకి వస్తుంది. 'భవనాసి'కి ఆనకట్ట వేసి 910 ఎకరాల భవనాసి చెరువుగా మార్చారు. దీనిని ఆనుకొని సింగరకొండ ఉంది. కొండ మీద లక్ష్మీనరసింహస్వామి ఆలయం గొప్ప పుణ్యక్షేత్రం. కొండ క్రింద ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఉంది. ఈయన మహిమగల దేవుడు. భవనాసి, గుండ్లకమ్మ కలిసే స్థానంలో సంగమేశ్వర ఆలయం ఉంది.

నదికి ఇరువైపుల గల దేశాన్ని 'పులగినాడు' అంటారు. దీనికి అద్దంకి రాజధాని. అద్దంకి వ్యవసాయ ఆధార జీవన ప్రాంతం. అద్దంకి దర్శిరోడ్డులో నదిపై ఒంతెన నిర్మించినారు. ఎత్తిపోతల పథకాలు నదీపరివాహక ప్రాంతం అంతటా ఉన్నాయి. ఒక్కొక్కదానికి ఒక్కో నాయకుల పేర్లు పెట్టారు. కొన్ని గ్రామాలలకు నాబార్డు ద్వారా లిఫ్ట్‌ఇరిగేషన్‌లు ఉన్నాయి.

నది మణికేశ్వరం దగ్గరగా ప్రవహిస్తోంది. నది రెండు కొండలకు మధ్యగా పారుతోంది. అదే ధేనువుకొండ. తరువాత గుండిక చిన్నమల్లవరం దగ్గరగా ప్రవహిస్తుంది. 6వేల క్యూసెక్కుల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంది. గుండ్లకమ్మ నదిపై మల్లవరం వద్ద 600 కోట్ల వ్యయంతో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు.

వెల్లంపల్లి నదిమీద పెద్ద ఒంతెన ఉంది. నది నిడమానూరు, చదలవాడలకు దగ్గరగా ప్రవహిస్తోంది. ఇచ్చట ఆవాలతోటలు, జొన్న, జామ విరివిగా ఉన్నాయి. చదలవాడలో రఘునాయక స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిచెందింది. ఇచట నుండి కరువది, ఉలిచి మీదుగా నది ప్రవహిస్తుంది. సుబాబుల్, చౌక్ తోటలు విరివిగా ఉన్నాయి. ఉలిచి దగ్గర ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. నదికి ఒక వైపు గుండాయపాలెం అవతలవైపు చింతాయిగారి పాలెం. ఇచట నది బంగాళాఖాతంలో కలుస్తున్నది. ఇచట రొయ్యల పెంపకం ఎక్కువ. తియ్యటి నీరున్న నది, గుండ్లబ్రహ్మేశ్వరంలో పుట్టిన తీపి ఊట, ఇక్కడ ఉప్పు(పోటు) నీటితో కలిసింది. నల్లమల కొండలలోని గాంభీర్యం, నెమలిగుండంలోని జలపాతపు హోరు ఈ కడలి (సముద్రంలో) లో కనిపిస్తుంది. ఇంత చరిత్ర కలిగిన ఈ నది జిల్లాకు మంచిపేరు తెచ్చినది అని అందరూ అన్నారు.

# గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు



జిల్లాలోనే పెద్ద ప్రవాహినిగా ఉన్న గుండ్లకమ్మ జన్మస్థానం నల్లమలలోని గుండ్ల బ్రహ్మేశ్వరం. అక్కడ నుంచి పలు గ్రామాలు, మండలాలను పలకరిస్తూ ముందుకురికే గుండ్లకమ్మ అద్దంకి పట్టణాన్ని ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది. ఇక్కడి నుంచి అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాలను చుట్టి కదలికేగుతుంది. గుండ్లకమ్మతో అద్దంకి ప్రాంతీయుల అనుబంధం శతాబ్దాల నాటిదైనప్పటికీ గుండ్లకమ్మ జలాలను ఉపయోగించుకోవడం లో ఈ ప్రాంతీయులు వెనుకబడే ఉన్నారు. సాగర్ కాలువల నీరు కూడా కలసి సాగునీటి పథకాలు, తాగునీటి పథకాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ అనాదిగా ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించిన పాలకుల మందకొడితనం ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అది సాధ్యపడలేదు.

ఈ నేపథ్యంలో 80వ దశకంలో గుండ్లకమ్మ పై రిజర్వాయర్ నిర్మించి అప్పటికే కరువు కోరల్లో ఉన్న ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని ఉద్యమాలు జరిగాయి. 1987లో అప్పటి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ హైదరాబాద్ వారు సర్వే జరిపి గుండ్లకమ్మపై రిజర్వాయర్ నిర్మాణం గురించి సెంట్రల్ వాటర్ కమీషన్ (సి.డబ్ల్యు.సి) కి నివేదిక పంపారు. ఈ నివేదికలో రిజర్వాయర్ వల్ల ముంపుకు గురయ్యే గ్రామాలు, సాగయ్యే ఆయకట్టు వివరాలు పొందుపరిచారు. 1992లో మద్దిపాడు మండలం, చినమల్లవరం, కొరిశపాడు మండలం తమ్మవరం వద్ద రిజర్వాయర్ నిర్మించే సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి హైదరాబాద్ నుంచి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ వచ్చారు. ఆయన తన నివేదికలో చినమల్లవరం వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అనుకూలంగానే ఉందని పేర్కొన్నారు. ఇక్కడయితే ముంపు గ్రామాలు, పొలాలు తక్కువని, ఫీజిబులిటీ ఉంటుందని నివేదిక ఇచ్చారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఆర్థికశాఖామంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా భూమి పూజ జరిగిన నాటి నుండే ప్రాజెక్ట పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అనుకున్న సమయానికంటే ముందుగానే పూర్తిచేశారు. అందుకు అనుగుణంగానే నిధుల మంజూరు, భూసేకరణ, పునరావాసం, ప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇరిగేషన్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ బాబు ఆధ్వర్యంలో అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేసుకొని రాష్ట్రంలో ప్రప్రథమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా గుండ్లకమ్మ ప్రాజెక్టును ప్రారంభించి డా॥ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మాటలు కాదని చెప్పిన పనిచేసి చూపిస్తుందని నిరూపించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు సెంట్రల్ వాటర్ కమీషన్ అనుమతి, పర్యావరణ, అటవీశాఖ అనుమతులు అన్నీ వచ్చాయి.

**ప్రాజెక్టుల వలన ప్రయోజనాలు :**

ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన 43 గ్రామాల లోని 80 వేల ఎకరాలకు సాగునీరు, 2.56 లక్షల మంది ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కలుగుతుంది. (ఒంగోలు పట్టణంతో సహా) రైతులకు వివిధ పంటల ఉత్పత్తుల ద్వారా ఏడాదికి 152 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. వ్యవసాయ అనుబంధాలైన గడ్డి పెంపకం, పశుపోషణ ద్వారా రైతులకు ఏటా 43 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఈ పరిసర గ్రామాలలో గ్రౌండ్ వాటర్ పెరిగి వ్యవసాయ బావులు, బోర్లులో నీటి మట్టం పెరిగి నీటిలో ఫ్లోరిన్ శాతం తగ్గిపోతుంది. రైతుల పంటల ఉత్పత్తి నాణ్యతా, పరిమాణం పెరుగుతుంది. ఏడాది పొడవునా రైతు కూలీలకు ఉపాధి కలుగుతుంది. ప్రభుత్వం ప్రాజెక్టుపై చేసిన ఖర్చుతో ప్రతి రూపాయికి 6 రూపాయల ప్రయోజనం కలుగుతుంది. ఇంత ఎక్కువ ప్రయోజనం రాష్ట్రంలో మరే ఇతరప్రాజెక్టుకు లేదు.

❄ ❄ ❄ ❄ ❄

# సింగరకొండ
# శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి చరిత్ర



ఆంధ్ర దేశాన గల ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా అద్దంకి మండలం శింగరకొండలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దివ్యక్షేత్రం విరాజిల్లుతున్నది. భక్తులపాలిట కొంగుబంగారంగా పిలిచిన పలికెడి దైవంగా మహర్షుల తపస్సు శక్తులతో స్వామియే స్వయంగా ఆవిర్భవించి క్షేత్ర మహిమలు కలిగిన దివ్యక్షేత్రం సింగరకొండ. కొండకోనలతో ప్రకృతి రమణీయతకు దర్పణం పడుతూ స్వామి వారి పాదచెంతన వున్న పవిత్ర భవనాశీ తటాకం చూసేవారికి చూడ ముచ్చట కలుగుతుంది.

ఈ దేవస్థానానికి సంబంధించిన చారిత్రక ఆధారాలు అంతగా లభించక పోయినప్పటికీ ఆలయ గరుడ స్తంభంపై క్రీ.శ. 1443 చెక్కబడిన శిలాశాసనం ను బట్టి ఈ ప్రాంతమంతయూ దేవరాయలనే ప్రభువు పరిపాలించినట్లు తెలున్తుంది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి నెలవై ఉభయ దేవతా క్షేత్రమైన శింగరకొండ క్షేత్రంలో నరసింహుడే ప్రధాన దైవమని తెలుస్తున్నది. పేరు వినగానే నరసింహ క్షేత్రంగా భావన కలిగే ఈ క్షేత్రం శాసన, సాహిత్యాలలో ఎక్కడైనా సింహగిరి గా చెప్పబడిందో లేదో తెలియదు కానీ మొదట "సింగనకొండ" గా పిలువబడే ఈ క్షేత్రం కాలక్రమంలో "సింగరకొండ" గా మారి ఉండవచ్చు. ప్రధానంగా నరశింహ క్షేత్రమైనప్పటికీ కొన్ని శతాబ్దాలుగా నెలకొని భక్తుల అభీష్టాలను తీరుస్తున్న హనుమంతుడు కొలువుతీరి వున్న ఈ క్షేత్రం గొప్ప హనుమక్షేత్రంగా పేరుగాంచింది. ప్రజలలో సాటిలేని భక్తిని ఆధ్యాత్మిక ప్రవృత్తిని పెంపొందించే పవిత్రక్షేత్రంగా విరాజిల్లుతుంది.

ఆంధ్రదేశంలోనే దక్షిణ ముఖంగా వుండే ప్రసన్నాంజనేయ దేవస్థానం ఇది. దేవతలు, మానవులచే తనే కాకుండా స్వయంభువుగా యిచ్చట అవతరించి భక్తుల అభీష్టాలు నెరవేరుస్తూ, నిత్యాభిషిక్తుడై, నిత్య వేదపారాయణాదులతో త్రికాలార్చన విశేషంగా అందుకుంటూ కొలువై ఉన్న స్వామి. ఆ అర్చనలు

**1) మూల వరుల అభిషేకం**

**2) మాధ్యాహ్నిక మహానైవేద్య పంచహారతులు**

**3) ప్రదోషకాలార్చన.**

చతుర్వేద మహాభారత, రామాయణ భాగవతాదులతో, నిత్యపరాకులతో, ఆధ్యాత్మిక భగవత్సంకీర్తనలతో ప్రసన్నాంజనేయ సన్నిధిలో సంవత్సరానికి వేల సంఖ్యలో వివాహాదులు, నిత్యనాగవల్లీ దళార్చనలతో పొంగలి (పాయసాన్నం) గుడాన్నంతో స్వామి వారి సేవా కైకంర్యాలు జరుగుతూ, నిత్య కళ్యాణంగా విరాజిల్లుతూ ఆ ప్రసన్నాంజనేయ స్వామి ప్రసన్న వీక్షణాలతో భక్తులు తృప్తి చెందుచున్నారు.


ఒకసారి స్వామివారిని సేవించిన భక్తుడు ఆ చల్లని కరుణా కటాక్షవీక్షణలకు పునఃదర్శన భాగ్యము కొరకు వచ్చుచూ ఈ క్షేత్రము గురించి పెద్దల వల్ల పరంపరగా తెలిసికొన్న కొన్ని విషయములను తెలుసుకుందాము.

1896 వ సంవత్సరంలో అప్పుడు శింగరకొండ మీద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కొండ మీద కొలువై మెట్ల మార్గంలో శనివారం శ్రీ స్వామి వారికి భక్తులచే పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రాచీన కాలంనుండి ఈ నృసింహ స్వామిని వేంచేసి వుండుట విశేషముగా ఉత్తర, తూర్పు ద్వారములతో శ్రీ లక్ష్మీ అమ్మవారికి వామ భాగంలో నుండి ఆ నృసింహ స్వామిని దర్శించి, స్వామి వారికి కృపా కటాక్షాలను పొంది, శ్రీ అగస్త్యమహాముని సమీపంలో గుండికా నదిలో స్నానమాచరించి ఆ నదీ తీరంలో ఉన్న ఈశ్వరుని దర్శించి గుహ మార్గంలో సింగరాద్రి లో తపస్సు చేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుగ్రహం పొందినట్లు తెలుస్తూన్నది. ఈ దేవస్థాన నిర్వహణకోసం మాన్యాలు అద్దంకి రెడ్డిరాజులు, చోళరాజులు శ్రీ కృష్ణదేవరాయలు మొదలగు వారు వారి పరిపాలనలో యిచ్చినట్లు శిలాశాసనాల ద్వారా తెలిస్తున్నది. వైష్ణవ క్షేత్రానికి వుండవలసిన ఆళ్వార్లు, (అష్టసంఖ్యలు) బలిపీఠాలతో కూడిన దివ్యక్షేత్ర పాలకుడిగా ఉండి ఈ క్షేత్రంలో అప్పటికే ఉన్న ధ్వజస్తంభం శిధిలమై ఉన్నది. ఆ సమయంలో ఈ ప్రాంత ప్రజలు, భక్తులు ఆంధ్రదేశంలోనే లక్ష్మీనరసింహ ఉపాసాపరులు, వేద శాస్త్ర ఆగమ విద్వాంసులు, గృహ ప్రాంగణంలో శ్రీ నృసింహ స్వామిని ప్రతిష్టించుకొని నిత్యదేవతార్చన చేసే మహనీయులు శ్రీ మద్దంకి తాతాచార్యులు (తక్కెళ్ళపాడు) అయ్యంగారిగా ప్రసిద్ధినొందిన, వీరి ప్రియమైన నృసింహునకు పునఃధ్వజదండ ప్రతిష్ఠాముహూర్తం నిర్ణయించి ఆ యంత్ర రజత, సువర్ణ యంత్రాలకు నృసింహ మూల మంత్రంతో అక్షరలక్షల జపమొనర్చి ధారాదత్తం చేసి వీరి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రతిష్ఠ శుభముహూర్త సమయంలో అప్పటికి కొండ ఉత్తర భాగంలో నాగజెముడు గుట్టలతో, పిచ్చి ముళ్ళ చెట్లతో నిండిన చిట్టడవి మధ్యలో ఒక మహాపురుషుడు, సింధూర వర్ణంతో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి హారతి ఇస్తున్నపుడు కొండపై నున్న భక్తులు ధ్వజదండ ప్రతిష్టా కార్యక్రమంలో నిమగ్నమై, కొంతమంది ఆ దృశ్యాన్ని చూసి వడివడిగా పరుగెత్తి వచ్చి చూడగా మహాపురుషుడు అంతర్ధానమయ్యాడు.



ఎదురుగా అంజలి రూపంలో ప్రసన్నాంజనేయ స్వామి చూసి తన్మయత్వం పొంది ఈ విషయాన్ని నలుదిశలా వ్యాపింపచేశారు.

సింగరకొండ దిగువ భాగంలో ఆంజనేయస్వామి వెలిసినట్లుగా తెలుసుకొని భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఆ దివ్యమూర్తిని దర్శించి పునీతులయ్యారు. ఒక దివ్య ముహూర్త శుభసమయంలో శ్రీ లక్ష్మీ



1930 ప్రాంతంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం

నరసింహ క్షేత్రంలో రామభక్తుడైన ఆంజనేయస్వామి ఈ విధంగా అవతరించి భక్తుల పాలిట కల్పవృక్షమై వారి, వారి కోర్కెలు నెరవేరుస్తూ దర్శించినవారికి చల్లని చూపులతో అనుగ్రహిస్తూ ఉండగా సమీప గ్రామస్థురాలైన ఆదెమ్మ అనే భక్తురాలు శ్రీ స్వామి వారిని దర్శించి పుట్టుకతో చూపులేని వారి మనువడిని అచ్చటికి తీసుకొని వచ్చి శ్రీ స్వామి వారి వద్ద ప్రతి నిత్యం ప్రదక్షిణ చేయించి స్వామి వారి సన్నిధిలో 11 సంవత్సరాలు ఉన్న తరువాత ఆ పిల్లవానికి చూపు రాగా మొట్టమొదటగా అచ్చట ఆమె ఒక సత్రం కట్టించినట్లు తెలుస్తున్నది.

ఈ పదకొండు సంవత్సరాల కాలంలో పరిసర ప్రాంతం లోని కలవకూరు, గోపాలపురం, చక్రాయపాలెం, శింగరకొండపాలెం, అద్దంకి, కంభంపాడు, బొమ్మనంపాడు, వెంపరాల గ్రామములలోని భక్తులు స్వామి వారిని సేవించిన భక్తులకు దాహం తీరుస్తూ, పశువుల కాపరులకు పెద్ద పెద్ద బానలతో నీరు నిల్వ చేసి మంచినీటి వసతి కల్పించారు. శ్రీ స్వామి వారు వెలసిన నాటి నుండి నిత్యం క్రమం తప్పకుండా స్థల శుద్ధి ఆవుపేడతో కళ్ళాపి చల్లి చక్కని ముగ్గులు వేసేదని పరిసరములను పరిశుభ్రంగా ఉంచేదని తెలుస్తుంది. ఆ రోజులలో పరిసర ప్రాంతాలకు కూడలి అయిన శ్రీ స్వామి వద్ద చుట్టు ప్రక్కల గ్రామాలలో చోరులు తాము దొంగిలించిన వస్తువుల భాగపంపిణీ చేసుకునే వారని, వారిలో భేదాభిప్రాయములు వచ్చినప్పుడు ఈమెను తీర్పు అడిగేవారని ఆమె వారికి ఈ పాపపు పనులు మానుకొని సక్రమ మార్గంలో ఉండమని చెప్పేదని ఒక చోరుడు మనస్సు మార్చుకొని తన వద్ద ఉన్న ద్రవ్యంతో పరిసర ప్రాంతములన్ని శుభ్రం చేసి జ్ఞానం పొంది స్వామి వారి భక్తునిగా శేష జీవితాన్ని అక్కడే గడిపేవాడని ఈ భక్తురాలి సలహా మీద ఒక బావి త్రవ్వించి, బాటసారులకు, భక్తులకు మంచినీరు లభ్యమయ్యేట్టు చేసినాడు. ఇప్పటికీ చిన్నబావిగా పేరు పొందిన కొండ దిగువ భాగాన గల మొట్టమొదటి బావి ఇదే. కాల క్రమంలో స్వామి వారి ఈశాన్య భాగంలో ఒక బావి ప్రకార మండపమునకు ఈశాన్య భాగంలో మరి ఒక్క బావి, స్వామి వారికి ఉత్తర భాగాన ప్రస్తుతం భవనాశిచెరువుతో ఉన్న రెండు బావులు భక్తుల సహాయంతో త్రవ్వించారు.

(1896) నుండి స్వామి వెలసిన నాటి నుండి విశేషంగా శని, మంగళ, ఆదివారాలలో భక్తులే స్వయంగా స్వామి వారిని తాకి అభిషేక, ఆకుపూజలు జరుపుకొనేవారు. దీర్ఘ రోగులు, సంతానార్థులు, భూతపిశాచ (దయ్యం) భయపీడితులు స్వామి వారి వద్ద మండల దీక్ష (40 రోజులు) తో ప్రతినిత్యం భవనాశి తటాకంలో స్నానమాచరించి ఒక్కపూట భోజన నియమాదులతో ప్రదక్షిణ చేసి దీక్ష పూర్తి చేసికొని పూజచేయించుకొని విముక్తులై సంతోషంగా వెళ్ళేవారు. 1896 వ సంవత్సరం నుండి 1916 సంవత్సరం వరకు స్వామి వారికి ఏ విధమైన ఆచ్ఛాదన లేదు. 1916న అప్పటి



1960 ప్రాంతంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం

బ్రిటీష్ వారి హయాంలో ఇచ్చట పూర్వం నుండి భవనాశి అనే నది ఉండేదని పరిసర పర్వత ప్రాంతమందలి వర్షపునీరు సమీపాన గల గుండికా నదిలోనికి నీరు వృధాగా పోతున్నదని పరిశీలించి ఒక తటాకం నిర్మించాలని సంకల్పించారు. ఆ తటాక నిర్మాణం కాంట్రాక్టు విజయవాడ నివాసి అయిన కమ్యూనిస్టు భావాలు గల నాస్తికునికి లభించింది.

1916 మే నెల నుండి చెరువు నిర్మాణం పనులు ప్రారంభమయింది. తొలి రోజు కూలీల సలహా మేరకు శ్రీ స్వామి వారి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించటానికికు మొదట తిరస్కరించినా, తదుపరి శ్రీ స్వామి వారి దివ్య రూపాన్ని దర్శించి నాకు ఈ కాంట్రాక్టులో అనుకున్న మేర లబ్ధిపొందిన యెడల నీకు నీడ ఏర్పాటు చేస్తానని మనసులో సంకల్పించుకున్నాడు. ఆ రోజు నుండి సుమారు 200 మంది కూలీలతో రెండు సంవత్సరాలపాటు పని చేయించి తటాక నిర్మాణం పూర్తి చేశారు. ఆ శ్రామికులు స్వామి వారి పరిసర ప్రాంతాలలో తాత్కాలిక నివాసం ఏర్పాటుచేసుకొని ప్రతినిత్యం స్వామి వారికి జరుపు భజన సంకీర్తనలతో పాలుపంచుకొని స్వామి యందు అచంచల భక్తి విశ్వాసాలతో ఉన్నారు.

ఆ నిర్మాణ కాలంలో ఎలాంటి యంత్ర పరికరాలు లేకపోయినా వాతావరణ అవరోధాలు వచ్చినా అతను అనుకున్న దానికన్నా తక్కువ కాలంలో తటాక నిర్మాణం పూర్తి చేసి లాభం చేకూర్చుకొని ముందు అనుకున్నట్లుగా తటాక నిర్మాణం పూర్తి అయిన వెంటనే ఆ శ్రామికులు, కాంట్రాక్టర్ ఎంతో ఉత్సాహంతో ఆ కాలంలో మాచర్ల ప్రాంతంలో లభ్యమైన 8+4 నాపరాళ్ళతో గోడలుగా అదే సైజురాళ్ళతో పై కప్పుగా జాయింట్లతో చెరువులో లభ్యమైన బంకమట్టితో దేవాలయ రూపం తెచ్చి తమ భక్తిని, కృతజ్ఞతను చాటుకున్నారు.

కాలక్రమంలో శ్రీ స్వామి వారి అనుగ్రహం పొందిన భక్తుల ద్వారా దశదిశలుగా వారు మరియు మొదలగువారు ఈ క్షేత్రాభివృద్ధికి తోడ్పడుచూ ఆనాటి రాజధాని చెన్నపట్నంకు వెళ్ళి రెవిన్యూ రికార్డులను పరిశీలించి రికార్డులలో లక్ష్మీనరసింహ నిర్మాణ వివరము లభ్యము కాక తిరిగి వచ్చినారు.

1960 ప్రాంతంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ దేవాలయాలను ప్రభుత్వ ఆధీనంలోనికి చేర్చుకొని కార్యనిర్వాహణాధికారి పరిపాలనలోనికి వచ్చింది. అప్పటికే కొన్ని వందల సంవత్సరాల నుండి కొండపై దేవాలయంలో భాగవతుల వారు పాంచరాత్ర ఆగమంతో పూజా కైంకర్యాలను జరిపేవారు. 1980 వరకు ఒక శనివారం మాత్రమే మానవుల పూజ మహానైవేద్యం జరుగుచుండేది.

దిగువ భాగంలో ప్రసన్నాంజనేయ స్వామికి సుమారు 1950 నుండి శ్రీ అన్నవరపు

సత్యనారాయణ గారిచే స్మార్తాగమం ప్రకారం పూజాకైంకర్యాలు జరుగేవి. 1978 వరకు దేవాలయం ముందు భాగ కొష్టము వలె ఉండెడిది. అప్పటి శాసనసభ్యులు కార్యనిర్వహణాధికారి దేవాలయ జీర్ణోద్ధరణ సంఘం అధ్యక్షులు మారెడ్డి వెంకటరెడ్డి గార్ల కృషితో ప్రభుత్వం వారు సర్వశ్రేయోనిధి నుండి ధనంతో సేకరించి దేవస్థానము వద్ద ఉన్న కొంత ధనముతో గర్భాలయం ప్రాచీన సాంప్రదాయంగా రాతికట్టుబడితో నిర్మింపజేసి ఆలయ శిఖర ప్రతిష్టాపన జరిపారు. ఆనాటి నుండి అర్చకుల నిత్య నైవేద్య అభిషేకాదులు జరుగుచున్నవి. 1981-84 మధ్యలో విశాలమైన 100×60 ముఖమండపం అప్పటి ధర్మకర్తల మండలి కార్యనిర్వాహణ అధికారి కృషితో నిర్మింపబడింది.

16.07.1983 నుండి నిత్యవేదపారాయణ కొరకై వేదపండితుని నియమించారు. 1984-87 ఈ క్షేత్రంలో విశేషంగా ప్రతినిత్యం పొంగలి చేసికొనే భక్తుల సౌకర్యార్ధమై 08.03.1992లో సుమారు 40పొయ్యిలతో పొంగలిశాలను ఏర్పాటు చేశారు. 1992-94 ఆంధ్రదేశంలోనే చాలా తక్కువగా కనపడుతున్న ప్రాకారమండప నిర్మాణం భక్తుల సహకార సంపత్తితో నిర్మించారు. దేవాలయానికి ఈ నిర్మాణం ఎంతో శోభచేకూర్చింది.

1984లో దాతల సహకారంతో స్వామి వారి ధ్వజదండ ప్రతిష్ఠ జరిగింది. 1999 లో సుమారు 8 లక్షల రూపాయల దేవస్థాన నిధులతో దక్షిణ రాజగోపుర నిర్మాణం కలశ ప్రతిష్ట వైభవంగా జరిగింది. నిత్య వేదపారాయణ కొరకై వేదపండితుని నియమించారు. 1984-87 ఈ క్షేత్రంలో సంవత్సరానికి పదివందలకు పైగా జరుగు వివాహశుభకార్యాలు జరిగినవి. ఈ దేవాలయానికి నాలుగు దిక్కులలో రాజగోపురాలు ఉండటం ప్రాకార మండపం నిర్మింపచేయుటం ఆగమశాస్త్ర ప్రకారం అభిషేక, అర్చన, హారతి, వేదపారాయణాదులు, ప్రదోషకాలార్చనలు జరుగటం ఈ క్షేత్ర వైభవానికి నిదర్శనం.

వాస్తు ప్రకారంగా దక్షిణ నైరుతి దిక్కుగా ఎత్తైన పర్వతం, ఉత్తర ఈశాన్యంలో సువిశాలమైన భవనాశి తటాకం నిత్యమూ జలంతో నిండి ఉండటం విశేషం. ఈ క్షేత్రం లక్ష్మీనరసింహ క్షేత్రం అగుటచే దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ క్షేత్రాభివృద్ధికి ఎన్నో విధాలుగా సహకరించిన దాతలు, భక్తులు, అధికారులు, శాసనసభ్యులు, మంత్రివర్యులు, కార్యనిర్వాహణాధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి పరిపూర్ణ అనుగ్రహం పొందియున్నారు.

❄ ❄ ❄ ❄ ❄



# మన ఒంగోలు జాతి పశువులు
## ...... ప్రపంచానికే గర్వకారణం



– డాక్టర్ బీరం సుందరరావు,
ఇంకొల్లు,
సెల్ : 98480 39080



**"ఒంగోలు వృషభమ్ము**
**మనదేశ గర్వమ్ము!**
**నింగికీ నేలకూ**
**నిలువెత్తు అందమ్ము!**

**రంకెవేసిందంటే**
**కైలాసమే వంగురా**
**చాలుదున్నిందంటే**
**రతనాలు పండురా!**

**కాడిమోసిందంటే**
**కనకాభిషేకాలు**
**కాలుదువ్వొందంటే**
**కళ్ళకే పర్వాలు –** అని ప్రముఖవైద్యులు, కవి డాక్టర్ మండువ నరసింహారావు గారు (ఒంగోలు) మన ఒంగోలు జాతి గిత్తల గొప్పతనాన్ని గొప్పగా వర్ణించారు.

మన ఒంగోలు జాతి పశువులు ప్రపంచానికే గర్వకారణం. ప్రపంచంలోనే అత్యుత్తమ జాతి పశువులుగా గుర్తింపు పొందాయి., అఖిలభారత స్థాయిలోను, అంతర్జాతాయంగా జరిగిన పలు పశు ప్రదర్శనల్లో అందాల పోటీల్లోనూ మన ఒంగోలు జాతి కోడెలు, ఆవులు ప్రథమస్థానంలో నిలిచి, మన ఒంగోలు కు అఖండ ఖ్యాతిని తీసుకువచ్చాయి.



ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుడి దాక మానవ జీవన పరిణామ క్రమంలో అభివృద్ధిలో పశు సంపద తలమానికంగా నిలిచింది. ముఖ్యంగా మన దేశంలో సింధూ నాగరికత కాలం నుండి రైతులు వ్యవసాయం చేసినట్లు, పశువులు ముఖ్యపాత్ర వహించినట్లు ఆధారాలున్నాయి. సింధూలోయలోను, పరిసర ప్రాంతాల్లోనూ మన ఒంగోలు జాతి పశు సంపద విస్తరించినట్లుగా చరిత్రకారులు పేర్కొన్నారు. సింధూ నాగరికత కాలం నాటి ఎడ్లకు, మన ఒంగోలు జాతి ఎడ్లకు దగ్గర పోలికలున్నాయి.

నేలనుదున్ని, విత్తనాలు చల్లి, పంటలు పండించిన రైతును తొలి ఇంజనీరుగా మనం గుర్తించాలి. రైతుకు ప్రాణ ప్రదమైనది పశువులు. భారత, రామాయణకాలాల్లో కూడ పశు సంపదనే ముఖ్యమైన సంపదగా రాజులు, ప్రజలు భావించేవారు. భారతకాలంలో విరాట మహారాజుకు లక్షల ఆవులుండేవి. వీటిని కౌరవులు తోలుకపోతున్నప్పుడు జరిగిందే ఉత్తర గోగ్రహణం. దక్షిణగోగ్రహణయుద్ధాలు. మధ్యయుగంలోను, 13వ శతాబ్దంలోను గోసంపద అధికంగా వుండేది. కనిగిరి సీమను పాలించిన కాటమరాజుకు గో సంపద పుష్కలంగా ఉండేది. అలాగే పల్నాటి బ్రహ్మన్న తన అనుచరులతో ఆవులను మేపుకోవడానికి శ్రీశైలం, మేడపి, అడవుల్లో కొంతకాలం గడిపారు. 1950 ప్రాంతాల వరకు కూడ మన గ్రామాల్లో రైతులు ఆవులను ఎక్కువగా పోషించేవారు.

> ఒంగోలు జాతి పశువుల్లో ఆవులు, ఎడ్ల పట్ల రైతులు ప్రత్యేకాభిమానం చూపుతారు. కన్నబిడ్డల్లాగా ప్రేమిస్తారు. అందుక్కారణాలు అనేకం ఉన్నాయి. వ్యవసాయానికి ఉపయోగపడం, అందంగా ఉండడం, ఆకర్షణీయంగా వుండడం, చురుకుదనం, సమయ స్ఫూర్తి కల్గి వుండడం, రాజసంగా నడవడం, ఠీవిగా చూడడం, యజమాని పట్ల ప్రేమతో, గౌరవంతో వుండడం, ఇంటికే ఒక వెలుగుగా వుండడం ఒంగోలు జాతి ఆవులు, గిత్తల ప్రత్యేకత అంతేకాదు. ఒంగోలు జాతి ఆవులకు తల్లి ప్రేమ ఎక్కువ.

ఒంగోలు జాతి పశువులు అందం లోనూ ఆకారంలోనూ, అవయవ సౌష్ఠవం లోనూ, వాటికవేసాటి. బరువులు లాగడం లోనూ, అధికపాలదిగుబడి లోనూ, రోగనిరోధక శక్తి కలిగి ఎటువంటి వాతారణాన్నైనా తట్టుకొని ఆరోగ్యకరంగా జీవించడంలోనూ ప్రపంచం లోనే మేలిమిజాతిగా గుర్తింపు పొందాయి. ఒంగోలు జాతి ఆవులు లేదా గిత్తలకు ముఖ్యంగా 9 నలుపులు, 7 కురచలు వుండాలని పశువైద్య రంగ ప్రవీణులు రైతు పెద్దలు నిర్ణయించారు.

**9 రకాల నలుపులు :** కొమ్ము, కన్ను, చెవ్వు, ముట్టె, బొడ్డు, మోకాలు, తోక, గిట్టలు, ఆసనం.

**7 కురచలు :** ముట్టె, కొమ్ము, చెవ్వు, మెడ, కాలు, బొడ్డు, తోక

పాతతరం అనగా 1850 సంవత్సరానికి ముందు 9 నలుపులు కలిగిన ఎద్దులను, ఆవులను అసలైన ఒంగోలు జాతిగా భావించేవారు. కాని 1858 తర్వాత ప్రముఖ పశుపోషకులు, కరవది కృష్ణమూర్తి గారి సూచనలతో "బ్రాహ్మణ పసిమి" (బంగారు ఛాయ) రంగు గల ఒంగోలు ఆబోతుతో ఆవులను సంపర్కం చేసి (బ్రీడింగ్) సరికొత్త ఒంగోలు జాతి గిత్తలను, ఆవుదూడలను సృష్టించారు. వీటిని ప్రస్తుతం "బ్రాహ్మణ్ జాతి" గా పిలుస్తున్నారు. వీటికి 7 కురచలతో పాటు, 7 తెలుపులు వుంటాయి. వీటినే ఎర్రపట్టె జాతి అని కూడా పిలుస్తారు.

**7 తెలుపులు :** మూతి, కన్ను, ముట్టె, ముడ్డి, తోక, బొడ్డు, గిట్టెలు

9 నలుపులుంటే పశువులను 'నల్లపట్టె' జాతిగా పిలుస్తారు. ప్రస్తుతం ఒంగోలు పరిసర ప్రాంతాలతోపాటు, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, నల్గొండ, కడప, కర్నూలు, ఖమ్మం జిల్లాల్లో ఎర్రపెట్టె చార జాతి కోడెలు, ఆవులు 4 లక్షల వరకు వుంటాయని అంచనా.

అసలు, సిసలైన ఒంగోలు జాతి ఎద్లు, ఆవులకు కేంద్రస్థానం ప్రకాశం జిల్లాలోని గుండ్లకమ్మ నదికి దక్షిణ ప్రాంతం, ముసి, పాలేరు నదుల మధ్య ప్రాంతాల్లో జాతి విస్తరించి వుంది.

బ్రెజిల్, ఆస్ట్రేలియా, అమెరికా, స్వీడన్, ఇండోనేషియా, అర్జెంటైనా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో సైతం ఒంగోలు జాతి పశువులు విస్తారంగా వున్నాయి. 1950 ప్రాంతాల్లో, ఆ తర్వాత ఒంగోలు, చదలవాడ, గుంటూరు, అద్దంకిల్లో జరిగిన సంతల్లో విదేశీయులు సైతం ముచ్చటపడి, ముగ్ధులై, మన ఒంగోలు

జాతి ఆబోతులను లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయడం విశేషం. కరువది, ఈతముక్కల, అమ్మనబ్రోలు, ఉలిచి, నేతివారిపాలెం, చంద్రపాడు, చీమకుర్తి, ఆబోతులు మేలిమిరకానికి చెందినవిగా నిర్ధారింపబడ్డాయి. 1950లో అద్దంకిలో జరిగిన సింగరకొండ తిరునాళ్ళకు కరువది ఆబోతును తోలుకురాగా, రైతులు, జనం తండోపతండాలుగా చూచి, అందచందాలను మెచ్చుకున్నట్లు అప్పటి పెద్దలు చెప్పారు. కొమ్ములు కొంచెం వెనక్కు వంగి, బోడితలతో వున్న ఈ ఆబోతును 'అందగాడు'గా వర్ణించేవారు. ఒంగోలు జాతికి వుండవలసిన 66 అవయవ పుష్టులు ఈ కరువది ఆబోతు కున్నాయని పశుపోషణలో ఎంతో అను భవమున్న జరుగుల లక్ష్మయ్యగారు (ఇంకొల్లు) చెప్పారు. ఒంగోలు జాతి గిత్తలకు రొమ్ము భాగం విశాలంగా వుండి, ఎముకపుష్టి వుంటుంది. కుండచెండు (ముద్దచెండు) వుంటుంది. వెన్నుభాగం నలుపు రోమాలతో నల్లగా ఉంటుంది. గిట్టలు సమానంగా వుండాలి. చిప్ప గిట్ట వుండకూడదు. పూతకొమ్ము వుండకూడదు. రెండు కొమ్ముల మధ్య విశాలంగా బోటు లేకుండా (బుడిపి) అర్ధ చంద్రాకారంగా వుండాలి. నల్ల గుడ్డుతో, నల్లటి రెప్పలు వుండాలి. కనుబొమ్మల మధ్య పల్లుగా వుండాలి. మెడ బలంగాను విశాలంగాను వుండాలి. గంగడోలు ఏడు ఒంపులతో (అందాలు) వుండాలి. చెండు వెనుక నడుము సన్నగా వుండాలి. డొక్కలు పెద్దవిగా వుండి, మలుగుకు అందం తెచ్చేవిగా వుండాలి. లోతోక వుండాలి. తగిన మోతాదులో 'వట్ట' ఉండాలి. పొడవుగా జారినట్లుంటే ఆ గిత్తలో చురుకుదనం వుండదని అనుభవంగల రైతులు చెబుతుంటారు.

ప్రకాశం జిల్లాలోని 'కారుమంచి' గ్రామం ఒంగోలు జాతి గిత్తలకు, ఆవులకు పుట్టిల్లని పెద్దలు చెబుతుంటారు. ఈ గ్రామంలో నంది వంటి అందమైన కోడెలు ఆవులకు అసంఖ్యాకంగా పుట్టాయనే చిన్న కథను తీసుకొని ప్రఖ్యాత కవి, మా గురువర్యులు



డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు గారు 'నది చెప్పని కథ' – కావ్యం రాశారు. వాస్తవానికి ఈ కావ్యాన్ని 'నంది చెప్పిన కథ' అంటే సముచితంగా వుంటుంది.

**'ఎదకు వచ్చినట్టి మే ఆవునైనను**

**తెచ్చి, నంది చట్టు తిప్పి, నిలిపి**

**'గర్భదానము'నకు కలుపుదు 'రాబోతు'**

**నిప్పటికిని రైతులిచటివారు – అని కారుమంచి లోని నందుల వంటి ఎద్దుల గురించి రాసి, ఒంగోలు జాతి ఖ్యాతిని దేశవ్యాప్తం చేశారు.**

**'సొగసున ఒంగోలు ఎద్దను**

**మిగులంగల యెద్దు భూమి మీదం గలవే' – అని నాగభైరవ గారు అక్షర నీరాజనం అర్పించారు.**

ప్రకాశం జిల్లాలో ఉలిచి గ్రామానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ చుంచు చలమయ్యగారు 1965 నుండి ఒంగోలు జాతి అవులను గిత్తలను ప్రత్యేకాభిమానంతో మేపుతున్నారు. చేకూరపాడుకు చెందిన వడ్డెళ్ళ శేషయ్యగారు ఒంగోలు జాతి గిత్తలను పోషిస్తూ, పలుమార్లు విదేశీయులకు విక్రయించారు.


ప్రస్తుతం ఒంగోలు జాతి అంతరించిపోతుంది. ధనవంతులు, భూస్వాములు పేరుకోసం అరుదైన జాతి వ్యాపార వస్తువుగా మార్చారు. ప్రభుత్వం నిషేదించిన బండ పందేలకు గిత్తలను వినియోగిస్తూ పశుహింసను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయరంగం దెబ్బతిని రైతులు, డాక్టర్లు, ఇతర యంత్రాలపై ఆధారపడటంతో గ్రామాల్లో ఎద్దులు అంతరించి పోతున్నాయి. ప్రభుత్వం బండి పందేలను, బండ పందేలను తక్షణం నిషేదించి, పందాలు నిర్వహించేవాళ్ళకు, ఎద్దయజమానులకు భారీ జరిమానాలు విధించాలి. జిల్లాలోని 'చదలవాడ' పశుక్షేత్రాన్ని ఆధునీకరించి రైతుల పర్యవేక్షణలో నడపాలి. ఒంగోలు జాతి పశు పోషకులకు, రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేయాలి. అరుదైన ఒంగోలు జాతి అంతరించకుండా కాపాడుకోవడం మన బాధ్యత.

❄ ❄ ❄ ❄ ❄

# నటనా రంగంలో కలికితురాయి
## బండారు రామారావు



సందిరెడ్డి కొండలరావు
ఎడిటర్



**ఆయన రంగస్థలంపై గళం విప్పి పాడుతుంటే ప్రజలకు సూర్యోదయం తెలియదు. తన సంగీతంతో ఆంధ్రదేశాన ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగించి తనదంటూ ఒక ప్రత్యేక బాణిని ఏర్పరచుకొన్న అభినవ హరిశ్చంద్రుడు, గానగంధర్వుడు, నటచూడామణి స్వర్గీయ బండారు రామారావు. ఆయన గానామృతం, నటనా వైదుష్యానికి మంత్రముగ్ధులు కానివారుండరు. తరాలు మారుతున్నా వన్నె తరగని దివ్య యశ్చంద్రిక, రసభావానుగుణ నటనావైదుష్యం శ్రుతి హితమైన చక్కటి వాచికంతో ప్రేక్షకుల హృదయాంతరాళాలలోకి ప్రవహించిన సంగీత ఝురి బండారు. సుందర స్వరూపం, సుమధుర గాత్రం రామారావుకు పుట్టుకతో సిద్ధించాయి. గ్రామ సీమల్లో రసజ్ఞులు నాటక సందర్శన కోసం నిరీక్షించిన బంగారు యుగమది. ఆ యుగంలో బండారుది ఓ విశిష్ట స్థానం.**

1932 ఆగస్టు 12న అద్దంకి లో పేద కుటుంబంలో జన్మించిన బండారు రామారావు తన బాల్యంలోనే షేక్ షబ్బీర్ సంగీత నాటక శిష్యరికం చేసి మెలుకువల్ని నేర్చుకొన్నాడు. కీ.శే. రేబాల రమణ, చీమకుర్తి రామస్వామి వంటి వారితో 'శ్రీరామా నాట్యమండలి' ని స్థాపించారు. పౌరాణిక నాటక రంగంలో శ్రీరామ, శ్రీకృష్ణ, నారద, భక్త కబీర్, బిల్వ మంగళ మొదలైన ఎన్నో పాత్రలను బండారు పోషించినప్పటికి నవరసాలను ఆవిష్కరించి ప్రశంసలు, కీర్తిని తెచ్చిపెట్టింది మాత్రం సత్యహరిశ్చంద్ర పాత్ర అనడంలో సందేహం లేదు. శ్రోతల స్థాయి ఎరిగి, వేదిక విలువ తెలుసుకొని పండిత పామర జనరంజికంగా ఆయన నటన సాగేది.

పద్యం చదవడంలో బండారు వారిది విలక్షణ ఫక్కీ. కవి హృదయాన్ని పసికట్టి భావం యొక్క లోతులు తెలుసుకొని, సన్నివేశానికి అనుగుణంగా పాత్రౌచిత్యం దెబ్బతినకుండా పద్యం చదివి సంభాషణలు చెప్పడం బండారుకు మాత్రమే తెలిసిన అపూర్వ విద్య.

చంద్రమతిని కాలకౌశికుడికి విక్రయించే సన్నివేశం, కాటిసీనులో స్మశానవాటిక పద్యాలు పద్యాలు చదివే ఘట్టంలో బండారు సహజ నటన ప్రేక్షకులను కంటతడి పెట్టించడం రివాజు. నిజజీవితంలో తన భార్య 'సుశీల' చంద్రమతి పాత్ర వేసినప్పుడు ''ఈమె ఎవ్వతియో గాని సుశీలగా కనబడుచున్నది" అంటూ బండారు చెప్పే డైలాగ్ ఆయన మాత్రమే చెప్పగలిగారు.

పద్యాలకు విలక్షణమైన బాణీలు కట్టి శ్రోతల హృదయాలను దోచుకున్నారు. బండారులా పాడాలని, బండారులా హావభావ విన్యాసాలు ప్రదర్శించి ప్రేక్షకుల మెప్పు పొందాలని ప్రయత్నించిన నటులెందరో ఆయన బాణీ ఫక్కీని పట్టుకోలేకపోయారు. పద్యపఠన విషయంలో బండారుకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలు వున్నాయి. అద్దంకిలో ప్రారంభమైన రాగం అమలాపురం పొలిమేర్ల దాకా సాగకూడదు. పద్యానికి తగిన రాగం వుంటే మంచిది. తేనె తియ్యగా వుందని ఎక్కువ తాగుతామా? పౌరాణిక నాటకంలో పద్యానికి రాగం కూడా అంతే. తన గొంతు తన నటన తనతోనే పోవాలంటూ తరచూ మిత్రులతో చెప్పే రామారావు గారు తన గంధర్వగాత్రాన్ని కనీసం టేప్ రికార్డులోనైనా వినే భాగ్యం కల్గించకుండా అమరలోకం చేరాడు.

హిందూస్థానీ, కర్నాటక, ఒక్కొక్క చోట జానపద బాణీలు కరుణ రస సన్నివేశాలు ఆయన స్వరంలో కొత్త చమత్కారాలు సంతరించుకొనేవి. వేళ్ళ కదలిక ఒక ప్రత్యేకత, అబ్బూరి వారి తరువాత కళ బండారు పక్కకే చేరింది.

ఆంధ్ర దేశంలోని అగ్ర శ్రేణి నటీనటులతో ధీటుగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. తన బాణీలను అనుసరిస్తున్న ఏకలవ్య శిష్యులు ఎందరినో బండారు ఆదరించారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి పోటీలలో 18 మంది శ్రీకృష్ణ పాత్రల పోటీలో ప్రథమ బహుమతిని పొందారు. నవయుగ కవి గుర్రం జాషువా బండారుకు 'నట చూడామణి' బిరుదునిచ్చి సత్కరించారు. 1970లో బెంగుళూరు టౌన్ హాల్‌లో ఆయన నటనకు ముగ్దులైన ఎందరో ఆయన మన తెలుగువారు అని చెప్పుకొనేందుకు గర్వపడ్డారు. రంగస్థల నటులు పుట్టంరాజు శంకరరావు, రమణారెడ్డి, అద్దంకి హేమలత, అద్దంకి ఆంజనేయరాజు, మెల్లంపూడి వెంకటేశ్వర్లు అతనికి సన్నిహితులు.

అద్దంకి ప్రాంతానికి వన్నె తెచ్చిన బండారు యశస్సు ఒక్కటే వెంట వస్తుందని నమ్మేవారు. తల వంచి బ్రతకడం చేతకాని బండారు మరణానికి తలవంచి మౌనంగా వెళ్ళిపోయారు. ప్రతి క్షణం ముసురుతున్న కాలపు పొరలు అడ్డువస్తున్నా ఆత్మీయులు తలచుకొంటే కనుకొలుకుల బాష్ప బిందువుల్లో ఆయన దర్శనమిస్తారు.

**కాకిగా పుట్టి కోకిలలా బ్రతికి రాయిలో పుట్టి రత్నమై వెలసి, పేదవారింట పుట్టిన బండారు మనవాడవడం అందరూ గర్వించదగ్గ విషయం. నటన కేవలం ధనార్జన కోసం కాక లోక కళ్యాణానికి ఉపయోగించాలని ఆయన కోరుకున్నాడు. నాటికీ, నేటికీ బండారు ప్రజల మనస్సుల్లో మెలుగుతూనే ఉన్నాడు. నాటక రంగంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిన అజేయుడు. తన నటనతో తాను పుట్టిన అద్దంకి గడ్డకు**



**ఆంధ్రదేశంలోనే గుర్తింపు తెచ్చిన ఆ మహా నటుని కళను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి కళాభిమాని కర్తవ్యం.**

**భాష కందనట్టి భావాలు చూపించి**
**గానమునకు నవ్యకళలు గూర్చి**
**మతులలోన తీపికతలను మిగిలించి**
**అరిగినాడు రాముడమరపురికి...**

❄ ❄ ❄ ❄ ❄

# "గగనమెక్కిన రంగస్థల నట మాణిక్యం"

## అద్దంకి మాణిక్యాల రావు



**విశ్వామిత్రుని పాత్రలో సృష్టికి ప్రతిసృష్టి చేయగల ఆగ్రహమునీశ్వరుల్ని వేదికమీద సృష్టించగలిగారు. మాణిక్యరావు ఒక్కడే రాయబారము రారాజు పాత్ర సమర్ధవంతంగా పోషించి 'అభినవ సుయోధనుడు' అనిపించుకున్నాడు. అయితే మాణిక్యరావు కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిన పాత్ర రామదాసుపాత్ర. రామదాసు నాటకంలో మాణిక్యరావు పాత్రలో లీనమై జీవిస్తూ వుంటూ జనం భక్తి పారవశ్యంతో ఊగిపోయేవారు. జైలు సీనులో రామదాసు పడిన బాధలను ముఖకవలికలతో పలికించినప్పుడు ప్రేక్షకులకు కళ్లు అప్రయత్నంగా చమర్చేవి. రామదాసు పాత్రకు జీవం పోసిన మహానటుడు మాణిక్యరావు. ఒకమారు బండారు రామారావు, చంద్రమతి పాత్రధారురాలు సుశీలను చంద్రమతి అని పిలుచుటు బదులుగా పొరపాటుగా సుశీలా అన్నారు. ప్రేక్షకులలో నవ్వులతో అలజడి బయలుదేరింది. మాణిక్యరావు వెంటనే నాటకీయంగా ప్రవేశముచేసి నీవు పాతివ్రత్య మహిమను పొందిన సుశీలవా? లేక హరిశ్చంద్ర చక్రవర్తి భార్య చంద్రమతివా? ఎవరైతే మాకేమి? అని సొంత మాటలతో ప్రజలను మెప్పించిన మహానటుడు.**

అద్దంకి మాణిక్యరావును గూర్చి నాటక రంగంలో పరిచయమున్న ప్రతివారికి తెలుసు. ప్రకాశం జిల్లాలో నాటక రంగానికి మాణిక్యరావు ఆణిముత్యం వంటివారు. కళలలో పండిపోయిన మహాతపశ్వి అద్దంకి మాణిక్యాలరావు అనుటలో అతిశయోక్తి లేదు. ఈయన 1929 మే 5వ తేదీన కళలకు కాణాచి, కవులకు కన్నతల్లి అయిన అద్దంకిలో నిరుపేద కుటుంబములో జన్మించారు. తండ్రి విప్పర్ల కోటయ్య ప్రముఖ పంబకథాకళాకారుడు చిన్ననాడు లక్కరాజు రామయ్య దగ్గర ఓనమాలు నేర్పిన మాణిక్యరావు 4వ తరగతికి మించి చదువు సాగించలేకపోయారు. పేదరికం అంతకుమించి అనుమతించలేదు. వీరు షేక్ షబ్బీర్ దగ్గర సంగీతంలో సరిగమలు నేర్చుకొన్నారు. 10వ సంవత్సరంలోనే రామయ్య పంతులు నేర్పిన రామదాసు నాటకంలో రామదాసు పాత్రను పోషించడం జరిగింది. ఆ పాత్రలో జనాన్ని మెప్పించాడు. అదే తన నటనా జీవితానికి పునాది వేసింది. దుద్దుకూరులో బాలమిత్ర సమాజంలో చేరి మట్టికుంట రామస్వామి దగ్గర రామదాసు, తులాభారం మొదలగు నాటకాలు నేర్చుకున్నారు. బాలమిత్ర సమాజం ద్వారా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. 1951లో ఒంగోలులోని బండారు రామారావుతో కలిసి శ్రీ రామనాట్యసమాజ మండలిలో చేరారు. చివుకుల సోమసుందరం ఆధ్వర్యంలో తన నటనకు సహజత్వపు పరిమళం సాధించారు. వీరు రామదాసులో రామదాసుగా, రాయబారంలో రారాజుగా, హరిశ్చంద్రలో విశ్వామిత్రుడు, కాళకాశికుడిగా బొబ్బిలిలో తాండ్రపాపారాయుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. విశాఖ, రాజమండ్రి, హైదరాబాద్, గుంటూరు, తెనాలి పట్టణాలలో అనేక సన్మానాలు పొందారు. బండారు రామారావు హరిశ్చంద్రుడిగా, బండారు సుశీల చంద్రమతిగా, మాణిక్యరావు విశ్వామిత్రుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారు.

అద్దంకి మాణిక్యాలరావు మరణించ డానికి కొద్ది రోజుల ముందు (02.02.1991) ఆయనతో చేసిన ఇంటర్వ్యూ ఇది. స్వర్గీయ మాణిక్యం అనుభవాలు, జ్ఞాపకాలు, ఆశయాలు అక్షరరూపంలో మనకు ప్రత్యక్షమవుతాయి.

**ప్రశ్న : నాటక రంగంలో మంచి నటుడిగా గుర్తింపు పొందిన మీ జీవిత విశేషాలను గురించి వివరిస్తారా?**

జవాబు : నా జన్మభూమి అద్దంకి. ఇచ్చట ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రెగడ ప్రభవించి పరిఢవిల్లాడు. ఈ భూమిని కవిసార్వభౌముడు శ్రీనాధుడు తన కవితా ప్రసూన సౌరభాలు వెదజల్లారు. కళాతపస్వి బండారు రామారావు జన్మించి కళామతల్లి కీర్తి కిరీటంలో కలికితురాయిగా ఖ్యాతి పొందారు. అలాంటి అద్దంకి గడ్డపై పుట్టడం నా పూర్వజన్మ సుకృతం. అందుకే 'విప్పర్ల' అనే మా ఇంటి పేరును 'అద్దంకి' గా మార్చుకొని నా మాతృభూమి రుణం కొంతైనా తీర్చుకోగలిగాను.

**ప్రశ్న : నటుడిగా మీ అనుభవాలు, జ్ఞాపకాలు వివరిస్తారా?**

జవాబు : స్వర్గీయ బండారు రామారావు నేను కలిసి చదువుకున్నాం. కలిసి సంగీతం నేర్చుకున్నాం. అన్నదమ్ముల్లాగా ఉండేవాళ్లం. 1951లో శ్రీరామానాట్యమండలి స్థాపించాం. ఎన్నో నాటకాలు ఆడాం. ఎందరినో పరిచయం చేశాం. చింతామణి, రామాంజనేయయుద్ధం, కురుక్షేత్రం, గయోపాఖ్యానం నాటకాలు ఎన్నోసార్లు ఆడాం. నేను గయుడుగా, బండారు కృష్ణుడుగా, నేను దుర్యోధనుడిగా, బండారు కృష్ణుడుగా వేసేవాళ్లం. తొలి రోజుల్లో నేను ఆడవేషాలు కూడా వేశాను. కొలసనకోట సోమయాజి, గురుతుల్యులు ఎర్రగుంట్ల అక్కయ్య, బెజవాడ కోటప్ప, గోరంట్ల అంకయ్య, మెల్లెంపూడి వెంకటేశ్వర్లు, వైకుంఠ వెంకటేశ్వర్లు, కాకాని బుచ్చయ్య అంతా అన్యోన్యంగా ఒక కుటుంబంలాగా నాటకాలు ఆడేవాళ్లం.

**ప్రశ్న : మీరు ఏఏ పాత్రలు ధరించారు? మీకు బాగా నచ్చిన పాత్ర ఏది?**

జవాబు : ఆంజనేయుడు, యయాతి, శ్రీకృష్ణుడు, కర్ణుడు, దుర్యోధనుడు, విశ్వామిత్ర, హరిశ్చంద్ర, రామదాసు వంటి పాత్రలు ధరించాను. నాకు 'రామదాసు' పాత్ర ఎంతో ఇష్టం. సహజంగా నేను భక్తుణ్ణి. ఆ పాత్రలో లీనమై నటిస్తాను.

నా గురించి చాలా మందికి తెలియదు. చిన్నతనంలో నాకు చదువు అబ్బలేదు. వినడం ద్వారా నేను ఎంతో తెలుసుకున్నాను. నేను ఏకసంధాగ్రాహిని. భారత, రామాయణాలు, భాగవతం, బైబిలు అన్నీ చదివాను. భాగవతంలో వేయికి పైగా పద్యాలు కంఠతా వచ్చు. 'రామదాసు' జైలు సీనులో నా డైలాగులు ప్రేక్షకులను తన్మయుల్ని చేసేవి.

**ప్రశ్న : మీకు సంగీతంలో లోతుపాతులు బాగా తెలుసునని విన్నాను?**

జవాబు : అవును. చిన్నతనంలో కష్టపడి, తన్నులు తిని నేర్చుకున్నాను. చివుకుల సోమసుందరం, లక్ష్మీనరసింహం, సకలేశ్వరరావు పంతులు నన్ను సానపెట్టి సంగీతం నేర్పారు. 72 మేళ కీర్తనలలో ఏ రాగమయినా పాడగలను. కాంభోజి, శంకరాభరణం, చక్రవాకం, మధ్యమావతి, శ్రీరాగం, తోడి నాకు బాగా ఇష్టం.

**ప్రశ్న : మరి మీ వద్ద శిక్షణ పొందిన శిష్యులు ఎవరైనా?**

జవాబు : ఉన్నారు. బండారు, డి.వి. జ్యోతి ఆంజనేయులు, జి. చెంచురామారావు, అద్దంకి ఆంజనేయరాజు, చీమకుర్తి నాగేశ్వరరావు నా శిష్యులే.

**ప్రశ్న : మీకు జరిగిన సన్మానాలు, ప్రేక్షకులు మెచ్చి ఇచ్చిన బిరుదులు ఏవైనా వున్నాయా?**

జవాబు : ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి పట్టణాలలో సన్మానాలు జరిగాయి. ముఖ్యంగా 1980లో సికింద్రాబాద్ 'కళాస్రవంతి' వారు 'సంగీత నాటక కళా సామ్రాట్' బిరుదుతో ఘనంగా సత్కరించారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ అసెంబ్లీ హాలులో 'అభినవ దుర్యోధన' బిరుదుతో సన్మానించారు. నాగపూర్ (మహారాష్ట్ర) ఆంధ్ర సంఘం వారు రామదాసు పాత్రలో నా నటన నచ్చి అప్పట్లో 2,116/-లు రూపాయల పర్సుతో సత్కరించారు. మద్రాసు ఆంధ్ర సంఘం వారు 'నట ప్రపూర్ణ' బిరుదుతో గౌరవించారు. బాపట్లలో పురప్రముఖుల సమక్షంలో గండపెండేరం తొడిగారు.

**ప్రశ్న : మీరు ఏమనుకోను అంటే ఒక్క ప్రశ్న. మీరు తాగుడుకు బానిసయిపోయి భవిష్యత్తుని నాశనం చేసుకున్నారనే విమర్శ ప్రజల్లో వుంది?**

జవాబు : నాకు చిన్నతనం నుండి తాగుడు అలవాటుంది. తాగుడుతో భవిష్యత్తు నాశనం చేసుకున్నాననే ప్రచారం సరికాదు. నటుడిగా నాకు ఇప్పటికీ డిమాండ్ ఉంది. 40 ఏళ్ళ వయస్సులో ఉధృతంగా నాటకాలు ఆడాను. ఎక్కువ కిరాయి తీసుకున్నాను. మందు వల్ల ఆరోగ్యం ఏమాత్రం దెబ్బ తినలేదు. నా మాటకు పదును తగ్గలేదు. నటుడుగా నేను ఇప్పటికీ యువకుణ్ణే! చూడండి! స్టీమరు ఎంత? స్టీరింగ్ ఎంత? మనిషెంత? నాటకమెంత? నా ఉద్దేశ్యంలో నటుడు 'మందు' లేకపోతే నటించలేడు.

**ప్రశ్న :సరే! చివరగా ఒక ప్రశ్న. మీ భవిష్యత్తు కార్యక్రమం వివరిస్తారా?**

జవాబు : "బుద్ధాశ్రమం" పేరుతో ఒక సంగీత కళాశాల పెట్టాలని వుంది. నటన, సంగీతం పట్ల అభిలాష ఉన్న యువకులకు ఉచితంగా నేర్పుదామని ఆశయం. నేను 'మాణిక్యం' శిష్యుణ్ణి అని భవిష్యత్తులో గర్వంగా చెప్పే శిష్యులుగా వారిని తీర్చిదిద్దాలని కోరిక. అందుకు మీ అందరి సహకారం కావాలి.

60 ఏళ్లు దాటాయి. మనసు భగవంతుడి మీద లగ్నం చేసి, తపస్సు చేసుకుంటున్నాను. నా పలుకు వ్యర్థం కాకూడదనే నా తపన. భుక్తి, రక్తి, శక్తి అన్నీ కలిసిన ముక్తి కొరకు మార్గం వెతుకుతున్నాను.

❄ ❄ ❄ ❄ ❄

# పండరంగని అద్దంకి పద్యశాసనం



గాడేపల్లి దివాకరదత్




**మహోన్నతమైన సాంస్కృతిక వారసత్వం, చారిత్రక నేపథ్యం ఉన్న నగరం గుళ్ళకమ్మతీరాన ఉన్న అద్దంకి. పద్యం పుట్టిన గడ్డగా, భారతాన్ని గట్టెక్కించిన సీమగా ఈ ప్రాంతం సాహితీప్రియులకు అభిమాన పాత్రమైనది.**

తెలుగుభాష ద్రావిడభాషా కుటుంబానికి చెందినది. తమిళ, కన్నడ భాషల సాహిత్యం తెలుగుభాషా సాహిత్యంకంటె కొద్దిగా ప్రాచీనం. ఒకప్పుడు తెలుగువాడికి సంస్కృత సాహిత్యంపైన, సంస్కృతభాషపైన మక్కువ ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఆంగ్లభాషను నెత్తికెత్తుకుని పూజిస్తున్నట్లు ఒకప్పుడు తెలుగువాడు సంస్కృతభాషాసాహిత్యాన్ని ఆరాధించాడు. అందువల్లనే తెలుగుభాషలో శిష్టసాహిత్యం కాస్త ఆలస్యంగా వెలుగు చూసింది.

'నాగబు' అనే తెలుగుమాట 2 వేల సంవత్సరాలక్రితం అమరావతిశాసనంలో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంది. తెలుగు మాటలలోనే ఉన్న తొలితెలుగుశాసనం కడపజిల్లాలోని 'ఎర్రగుడిపాడుశాసనం'. ఈ శాసనం క్రీ.శ.575 – 600 ప్రాంతాలకు చెందినది.

ఈ చారిత్రక క్రమంలో తొలితెలుగుపద్యం(దేశీయఛందం 'తరువోజ'లో రచింపబడిన పద్యం) శాసనస్థమయింది క్రీ.శ.848లో. తొలితెలుగుపద్యానికి ఆశ్రయమిచ్చిన నేలగా, పద్యాన్ని పరిరక్షించిన ధాత్రిగా, పద్యంపుట్టినగడ్డగా పండరంగని అద్దంకి పద్యశాసనం వల్లనే అద్దంకి ప్రశస్తి నందుకుంది.

అద్దంకిలోని వేయిస్తంభాల గుడికి(క్రీ.శ.11వ శతాబ్దపు గుడి) కూతవేటుదూరంలో మసీదు పక్కన ఉన్న పొలంలో గ్రామాధికారి కీ.శే.కాకాని కోటయ్యగారికి పొలం దున్నుతున్న సందర్భంగా ఈ శిలాశాసనం 1900 ప్రాంతాలలో దొరికింది. ఈ శాసనాన్ని శ్రీ కాకాని కోటయ్యగారు కొంతకాలంపాటు తన ఇంటి పెరట్లో ఉంచి సంరక్షించారట. ఈ శాసనాన్ని మద్రాసులోని గవర్నమెంటు మ్యూజియంలోకి చేర్పించటంలో కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రముఖపాత్ర వహించారట.

మద్రాసు ప్రభుత్వంవారి ఆదేశాల ననుసరించి నాటి నెల్లూరుజిల్లాశాసనాలను ప్రచురించే బాధ్యతను ఇండియన్ సివిల్ సర్వీసులో బాధ్యతలు నిర్వహిస్తున్న కీ.శే.అలెన్ బటర్‌వర్త్, కీ.శే.వి.వేణుగోపాలచెట్టి చేపట్టారు. వీరు 1905లో ప్రచురించిన 'నెల్లూరుశాసనాలు' అనే ఆంగ్లగ్రంథంలో ఈ శాసనాన్ని కూడా ప్రచురించారు. ఈ గ్రంథంలో అద్దంకిలో ఒకరి ఇంటి పెరట్లో ఈ శాసనం ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ శాసనం 1922లో మద్రాసులోని గవర్నమెంటు మ్యూజియం(ఎగ్మోర్ మ్యూజియం)కు చేరింది.

1905లో నెల్లూరుశాసనాల గ్రంథంలో చోటు సంపాదించుకున్న ఈ శాసనం ప్రముఖ శాసనపరిశోధకులు కీ.శే.కొమర్రాజు లక్ష్మణరావుగారి దృష్టి నాకర్షించింది. కొమర్రాజువారు ఈ శాసనంలో తెలుగుపద్యం ఉందన్న విషయం గ్రహించారు. 1922లో మద్రాసు చేరిన ఈ శాసనం ప్రతిబింబాలను సంపాదించుకుని తరువోజ ఛందంలోని ఒకపద్యం ఈ శాసనంలో ఉందన్న విషయాన్ని వీరు గుర్తించారు. ఈ విషయాన్ని 1923 జూన్ నెలలో చిత్రాడలో జరిగిన ఆంధ్రపరిశోధకమండలి పంచమవార్షికోత్సవ సభలో వీరు ప్రకటించారు. శ్రీ కొమర్రాజువారు 1923 జులై 13వ తేదీన 47ఏళ్ళ వయసులోనే పరమపదించారు. కొమర్రాజువారు ఎపిగ్రాఫికా ఇండికాకు ఈ శాసనంపైన సమర్పించిన పరిశోధనవ్యాసం ఎందువల్లనో ఆలస్యంగా 1928లో ముద్రితమయింది.

నన్నయ భారతాంధ్రీకరణకు 200 సంవత్సరాలకు పూర్వమే తెలుగులో పద్యరచన చేసేవారన్న విషయం ప్రపంచానికి తేటతెల్లమయింది. మధ్యాక్కరలు ఉన్న యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనంకంటే ఈ శాసనం 100 సంవత్సరాలు ప్రాచీనమయినది.

కీ.శే.జయంతి రామయ్య పంతులుగారు ఈ శాసనాన్ని పరిష్కరించి ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలో ఒకవ్యాసాన్ని 1926లో ప్రకటించారు. కీ.శే.మల్లంపల్లి సోమశేఖరశర్మగారు 1928లో భారతి పత్రికలో సాధికారికమైన ప్రామాణికవ్యాసం రచించి ప్రకటించారు.

ఈ శాసనం గుణగవిజయాదిత్య భూపాలకుడు పట్టంకట్టిన ప్రథమ సంవత్సరానికి సంబంధించింది. గుణగవిజయాదిత్యుడు క్రీ.శ.848 నుంచి క్రీ.శ.892 వరకు వేంగీ సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కాబట్టి శాసనకాలం క్రీ.శ.848.

ఈ శాసనంలోని లిపికి నేటి తెలుగు లిపికి మధ్య చాలా భేదాలు కనిపిస్తాయి. ప్రాచీన తెలుగులిపి రూపాంతరంచెంది నేటి అందమైన గుండ్రని తెలుగు అక్షరాలను ఆవిష్కరించుకుంది. ఈశాసనంలోని లిపిని 'తెలుగు – కన్నడ లిపి' అనీ, 'వేంగీ చాళుక్య లిపి' అనీ పిలుస్తారు. ఆ కాలంలో శిల్పులు పంక్తులను పైనుంచీ కిందికి చెక్కకుండా కిందినుంచీ పైకి చెక్కేవారట.

అద్దంకిశాసనంలో పండరంగడు అనే గుణగవిజయాదిత్యుని సైన్యాధిపతి పరాక్రమం, విజయాలు వర్ణింపబడ్డాయి. అందువల్ల ఈ శాసనం పండరంగనిపేర ప్రసిద్ధి పొందింది. ఈ శాసనంలో తొలితెలుగుపద్యం ఉండటంవల్ల పండరంగని అద్దంకి పద్యశాసనంగా ఈ శాసనం ప్రాచుర్యం పొందింది.

మనకు లభించిన ఈ శాసనం పైభాగంలో రాయి విరిగిపోయింది. అందువల్ల శాసనం పూర్తిపాఠం మనకు లభించటంలేదు. అదృష్టవశాత్తూ తొలితెలుగుపద్యంలోని ఒక్క అక్షరం ముక్కకూడా విరిగిపోయినభాగంలో లేదు. శాసనంలో మొదటి రెండుపంక్తుల చివరిభాగాలు మాత్రమే మిగిలాయి. మొదటిపంక్తిలో 'పుర' అనే రెండక్షరాల శేషభాగాలు మిగిలాయి. ఈ పురం ఏదో ఊహించటానికి మనకు అవకాశం లేదు. రెండవపంక్తిలో మిగిలిన చివరిభాగం 'భూపాలకుణ్డు'. ఈ భూపాలకుడు వేంగీచాళుక్యాధీశుడైన గుణగవిజయాదిత్యుడేనని పండితులందరూ అంగీకరించారు. 'భూపాలకుణ్డు' అన్న పదంతో ఒక తరువోజపద్యం అంతం కావటానికి అవకాశం ఉంది. అందువల్ల ఇంకో తరువోజపద్యం విరిగిపోయిన శిల పైభాగంలో ఉండేదేమో అన్న ఊహకు ఆస్కారం మిగిలింది.

ఈ శాసనంలో మూడవపంక్తినుంచి ఎనిమిదవపంక్తిదాకా తరువోజపద్యం ఉంది. తరువోజపద్యంలో మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణము మళ్ళీ మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణము ఒక్కోపాదంలో ఉంటాయి. ప్రతి పాదంలోనిమొదటిఅక్షరానికి మూడవగణం, అయిదవగణం, ఏడవగణం మొదటిఅక్షరాలతో యతిమైత్రి చేయాలి. ఇది నాలుగుపాదాల పద్యం. ప్రాసనియమం ఉంది. రెండు ద్విపద పాదాలు కలిస్తే ఒక తరువోజపాదం అవుతుంది. దంపుడుపాటలనుంచి తరువోజపద్యం పుట్టిందని కొందరు పండితులు భావిస్తున్నారు.

ఈ శాసనంలో 9వ పంక్తినుంచి 12వ పంక్తిదాకా వచనం ఉంది. పద్య గద్య భాగాలను కలిపి రచియించే ఇటువంటి రచనాపద్ధతిని చంపూపద్ధతి అంటారు. కవిత్రయం ఆంధ్రమహాభారతం చంపూపద్ధతిలోనే రచించారు. ఈ శాసనంలోని పద్యంలో గుణగవిజయాదిత్యుని సేనాని అయిన పండరంగని విజయయాత్రావిశేషాలున్నాయి. వచనంలో పండరంగ పరమమాహేశ్వరుడు ఆదిత్యభట్టారకునికి ఇచ్చిన భూదానం విషయం ప్రసక్తమయింది.

కీ.శే.జయంతి రామయ్యపంతులుగారు వర్తమాన వర్ణక్రమానుసారం ఇచ్చిన

శాసనపాఠం –

**...............పుర .............భూపాలకుండు**
**పట్టంబుగట్టిన ప్రథమంబు నేఁడు**
**బలగర్వమొప్పంగఁ బైలేచిసేన**
**పట్టంబుగట్టించి ప్రభుపండరంగుఁ**
**బంచిన సామంతపడువతో బోయ**
**కొట్టము ల్పండ్రెండు గొని**
**వేఁగినాఁటి గొళచి యా త్రిభువనాంకుశమున**
**నిల్పి**
**కట్టెపుదుర్గంబు గడు బయల్సేసి**
**కందుకూర్బెజవాడ గావించె మెచ్చి**
**పణ్డరంగుపరమ మహేశ్వరుండు**
**ఆదిత్యభట్టారకునకు ఇచ్చిన భూమి**
**ఎనుబది(ఎనిమిది?)పుట్ల ఆళ్లు పట్టునేల**
**ధర్మవరంబున ధర్మువులు వీని రక్షించిన వారికి**
**అశ్వమేధంబున ఫలంబు అగు**

**శాసనవిషయం :** గుణగవిజయాదిత్యుడు పట్టాభిషిక్తుడైన మొదటి సంవత్సరం(క్రీ.శ.848) సైన్యాధిపతిగా పండరంగనికి పట్టం కట్టి(బలగర్వంతో విజృంభిస్తూ) సామంత సైన్యాన్నిచ్చి విజయయాత్రకు పంపితే – పండరంగడు 12 బోయకోట్టాలు(కోటలు) జయించి, వేంగీసామ్రాజ్య త్రిభువనాంకుశాన్ని నిలిపి, కట్టెపుదుర్గాన్ని ధ్వంసంచేసి, కందుకూరును మెచ్చి బెజవాడవలె కావించాడు. పండరంగపరమమాహేశ్వరుడు ఆదిత్యభట్టారకునికి ఎనభై(లేక ఎనిమిది) పుట్ల ఆళ్లు చల్లితే ఎంతభూమి పండుతుందో అంతభూమిని ధర్మవరంలో దానం చేశాడు. ఈ ఆజ్ఞను అమలుపరచినవారికి అశ్వమేథయాగఫలం లభిస్తుంది.

క్రీ.శ.9, 10 శతాబ్దులలో అద్దంకిని అణ్డెకి అని పిలిచేవారని వేమలూరుపాడు శాసనం(క్రీ.శ.945)వల్ల తెలుస్తుంది. శ్రీ వర్ఝుల సుబ్రహ్మణ్యశర్మగారు అణ్డ+టెంకి అన్న పదాలనుంచి అణ్డెక్కి వ్యుత్పన్నమైందని, సైనికస్థావరం అని దాని అర్థమని అన్నారు. ప్రాచీనకాలంలో సైనికస్థావరంగా నిలిచిన అద్దంకిలో మహావీరుడు పండరంగసేనాని శాసనం వేయించటం ఔచిత్యవంతమే అనిపిస్తుంది.

ఈ శాసనంలో(మనకు దొరికినంత భాగంలో) అద్దంకిపేరు ఎక్కడా ప్రసక్తం కాలేదు. శాసనంలో బోయకోట్టములు, కట్టెపుదుర్గము, వేంగినాడు, కందుకూరు, బెజవాడ, ధమ్మవరము అనే స్థలనామాలు ప్రసక్తమయ్యాయి. గోదావరి, కృష్ణా నదుల మధ్యప్రాంతం వేంగినాడు. 12బోయ కోట్టములు (కోటలు) కట్టెపుదుర్గము స్థావరంగా కందుకూరు పరిసరప్రాంతాలలో ఉండ వచ్చు. కందుకూరు పరిసరాల్లో వేంగీసామ్రాజ్యాధిపతిని ఎదిరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న బోయుల కోట్టములను, వారి దుర్గాన్ని ధ్వంసంచేసి పండరంగడు కందుకూరు ప్రాంతంలో శాంతిస్థాపన చేసి బెజవాడ నగరంలాగున మెచ్చి పునరుద్ధరించాడన్నమాట. ఈ శాసనంలో పేర్కొనబడ్డ ధమ్మవరం అద్దంకి సమీపంలో ఉన్న నేటి ధర్మవరం గ్రామమే. కందుకూరు కేంద్రంగా ఈప్రాంతాన్ని పండరంగడు పాలించాడని కొందరు చరిత్రకారులు ఊహిస్తున్నారు.

శాసనంలో దానంచేసిన నేల ధర్మవరానికి చెందినదైతే, శాసనం దానంగాఇచ్చినభూమిదగ్గర దొరకకుండా ఈ శాసనం అద్దంకిలో ఎందువల్ల దొరికింది? అన్న అనుమానం మనకు వస్తుంది. అద్దంకినుంచి ధర్మవరం దాదాపు 7 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎనభైపుట్ల ఆళ్లు విత్తనాలుగా చల్లితే పండేభూమి విస్తీర్ణం అద్దంకినుంచి ధర్మవరందాకా ఉన్న భూములన్నిటినీ కలిపితేతప్ప సరిపోదు. శాసనంలో పేర్కొన్న ఎనుబొది ఎనిమిదికి పర్యాయపదమైతే మాత్రం ధర్మవరం చుట్టూ ఉన్న భూములను మాత్రమే దానం చేసినట్లు భావించాలి. శాసనం అద్దంకిలో దొరకటంవల్ల అద్దంకినుంచి ధర్మవరందాకా ఉన్న నేలను ఆదిత్యభట్టారకునికి దానం చేశాడేమో అనిపిస్తుంది. ఆదిత్యభట్టారకుడు నన్నయభట్టారకునిలా పాండిత్యప్రకర్ష ఉన్న మహాకవి కావచ్చు. ఆదిత్యభట్టారకుడు అంటే సూర్యభగవానుడు అన్న అర్థం తీసుకుంటే సూర్యదేవాలయ నిర్మాణంకోసం పండరంగడు దానం చేశాడేమో అని ఊహించవలసి వస్తుంది.

అద్దంకి పరిసరాల్లోనే తెలుగుభాషలో శిష్టసాహిత్యం పరిఢవిల్లిందనిపిస్తుంది. తొలితెలుగుపద్యం అద్దంకిశాసనంలో కనిపిస్తే, రెండవపద్యం(సీసపద్యం) పండరంగని కందుకూరు శాసనంలో(క్రీ.శ.848–849) అగుపించింది. కందుకూరి శిలాశాసనాన్ని మనం రక్షించుకోలేకపోయాం. శాసనం గ్రంథస్థమయిన తరువాతే ఈ శాసనపుశిల మాయమయింది. ఈ తొలితెలుగుపద్యాలలో మూడవపద్యం భీమమహారాజు ధర్మవరపు శాసనంలో(క్రీ.శ.897) కనిపించింది. ధర్మవరపు శాసనంలోని పద్యంకూడా సీసపద్యమే. తొలితెలుగుపద్యశాసనాలన్నింటిలో పండరంగని విజయాలు ప్రసక్తమయ్యాయి. క్రీ.శ.850కి చెందిన విజయాదిత్యుని ధర్మవరపుశాసనంలో గ్రాంథిక గద్యపద్ధతిలో రచన సాగింది.

తెలుగుసాహిత్యం ఓనమాలు దిద్దుకున్నప్రాంతం అద్దంకిసీమేనని, తెలుగువారి పద్యకవితామహాసౌధానికి పునాది రాళ్ళు వేసినవాడు నిస్సందేహంగా ప్రకాశంజిల్లావాడేనని తేటతెల్ల మవుతుంది. 1905లో తొలిసారి గ్రంథస్థమయితే ఈ శాసనం ప్రతికృతిని వందేళ్ళ తరువాత అద్దంకి కమతేశ్వరాలయంలో 2005వ సంవత్సరంలో ప్రతిష్టించుకోవటం సృజన సాహిత్యసంస్థ చేసుకున్న అదృష్టంగా భావించవచ్చు. పద్యానికి గొడుగుపడుతున్నట్టుగా నిర్మించుకొన్న పండరంగని అద్దంకి పద్యశాసన స్థూపం నిరంతరం తెలుగుసాహిత్యకారులకు స్ఫూర్తినిస్తుందని ఆకాంక్షిద్దాం. అద్దంకిపట్టణంలోని వదాన్యుల సహకారంతో, సాహితీమిత్రుల సంకల్పబలంతో, ప్రకాశంజిల్లా రచయితలసంఘం తోడ్పాటుతో 2005లో ఈ కార్యక్రమం ఒక పండుగలా అద్దంకిలో జరిగింది.

**పద్యాన్ని వెయ్యేళ్ళకుపైగా భద్రంగా పొత్తిళ్ళలో దాచుకుని, ఎఱ్ఱన పాదస్పర్శతో పునీతమైన ధాత్రి గుండ్లకమ్మతీరాన ఉన్న మన అద్దంకి.**

❄ ❄ ❄ ❄ ❄

# ఆశుకవి చక్రవర్తులు, అవధాన కవి సమ్రాట్‌లు

## కొప్పరపు సోదరకవులు



మా శర్మ
హెచ్‌యం టి.వి., విశాఖపట్నం.

**క**వితపుట్టిల్లు సోదరకవుల ఇల్లు... అని నానుడి. కొప్పరపు వారి మహదాశు కవితా ప్రతిభను చూస్తే... నన్నయ్య మొదలు పూర్వ మహాకవులంతా ఒక్క రూపమై కొప్పరపు కవులుగా అవతరించారేమో అని అనిపిస్తుంది...

ప్రపంచ సాహిత్య చరిత్రలోనే కొప్పరపు కవుల వంటి ప్రతిభా మూర్తులు యింతవరకూ పుట్టలేదు. పుట్టబోరు.. అని నాటి నుండి నేటి వరకూ మహాకవిపండితులంతా ఒక్క గొంతై జేజేలు పలుకుతున్నారు. వారు నేటి మన ప్రకాశం జిల్లాకు కానుకగా దొరికిన కవి ప్రకాశములు. కొప్పరపు వారు అప్పటి గుంటూరు జిల్లాలో ఉన్న కొప్పరంలో పుట్టారు. ఆ ప్రాంతం తరువాత ప్రకాశం జిల్లాలోనికి వచ్చింది. దీనివలన అటు గుంటూరు జిల్లా వారు, ఇటు ప్రకాశం జిల్లావారు కొప్పరపు కవులను ఉభయకవి మిత్రులుగా భావిస్తున్నారు. అది అభినందనీయమే. ఐతే... ఈ క్రమంలో జిల్లాలోని మహామహులను స్మరించుకొనే క్రమంలో వీరిని రెండు జిల్లాల వారు మరచిపోతున్నారు. ఈ పరిణామం వలన రెండు జిల్లాల చరిత్ర పుటల్లోకి వీరు ఎక్కువగా ఎక్కడం లేదు. యిది చరిత్రలో జరుగుతోన్న దురదృష్టం. నేడు గుండ్లకమ్మ పత్రిక వారు పనిగట్టుకొని కొప్పరపువారిని



**గుర్తుచేసుకొని పత్రిక ప్రత్యేక సంచికలో వారి వ్యాసం ప్రచురించి తీరాలి అని నియమం పెట్టుకున్నారు. యిది వారి పట్టుదలకు, భాషాభిమానాకీ, సంస్కృతికి, సంస్కారానికి వెలకట్టలేని నిదర్శనం. గుండ్లకమ్మ పత్రిక ఎడిటర్ నందిరెడ్డి కొండలరావును మనమంతా కలిసి అభినందిద్దాం.**

కొప్పరపు సోదరకవులుగా ప్రఖ్యాతి చెందిన వీరి పేర్లు కొప్పరపు వేంకటసుబ్బరాయశర్మ (1885–1932) కొప్పరపు వేంకటరమణశర్మ (1887–1942). వీరు నరసరావుపేట దగ్గరిలోని సంతమాగులూరుకు అతి సమీపంగా ఉండే కొప్పరం గ్రామంలో జన్మించారు. యిది

కొండవీటి సీమ. శ్రీనాథుడు, ఎర్రాప్రెగ్గడలు నడయాడిన పుణ్యభూమిలోనే కొప్పరపు వారూ పుట్టారు. కొప్పరము మావూరు... కోటప్పకొండకు కోసుడుదూరము.. అంటూ వారు పద్యాలు చెబుతుండేవారని కాసు బ్రహ్మానందరెడ్డి అన్నగారైన వెంకటరెడ్డి గారు చెబుతూ వుండేవారు.

టంగుటూరి ప్రకాశం పంతులుగారికి కొప్పరపు వారికీ ఎంతో అనుబంధం ఉండేది. పంతులుగారు ఎప్పుడు నరసరావుపేట వచ్చినా తప్పనిసరిగా కొప్పరపు సోదరకవులను, తదనంతరం వారి వారసులను కలుస్తూ ఉండేవారు. ఆ అభిమానం, ఆ అనుబంధం చిహ్నంగా కొప్పరపు సుబ్బరాయకవిగారి మనవడికి (సీతారామప్రసాదరాయకవి కుమారుడు) ప్రకాశం పంతులు పేరు పెట్టారు.

కొప్పరపు సోదరులు ఏల్చూరులో మాతామహులైన పోతరాజు రామకవిగారి (ప్రసాదరాయకులపతి, నేడు కుర్తాళపీఠాధిపతి వారి ముత్తాతగారు) దగ్గర అవధాన, పద్యవిద్యలు నేర్చుకున్నారు. నరసరావుపేటలో రామడుగు రామకృష్ణశాస్త్రి గారి వద్ద సంస్కృతభాషా, కావ్యాలు నేర్చుకున్నారు. తండ్రి వేంకటరాయల దగ్గరే ఓనమాలు దిద్దుకున్నారు. మొట్టమొదటగా 1908లో తన 12వ ఏట సుబ్బరాయకవి నరసరావుపేట పాత్తూరు ఆంజనేయస్వామి దేవాలయంలో అష్టావధానం నిర్వహించారు. 16వ ఏట శతావధానం చేశారు. తమ్ముడు రమణయ్యను కలుపుకొని జంటగా అవధాన జైత్రయాత్రను ప్రారంభించి కొప్పరపు సోదరకవులుగా జగద్విఖ్యాతి పొందారు. వీరిద్దరి కవనజీవనం 1927 వరకూ సాగింది. 1928 నుండి తీవ్ర అనారోగ్యానికి గురై, 1932లో తన 46వ ఏట అగ్రజుడు సుబ్బరాయకవి అస్తమించాడు. తరువాత, రమణయ్య గారు మూడవ తమ్ముడు బుచ్చిరామయ్యను కలుపుకొని కొంతకాలం అవధానాలు నిర్వహించారు. కానీ... సుబ్బరాయకవిగారి మరణంతో కొప్పరపువారి ఇంట్లో ఒక గొప్పవెలుగు వెళ్ళిపోయింది. 1942లో రమణయ్య గారు పరమపదించారు. కొప్పరపు సోదరకవుల కుమారులు మల్లిఖార్జునరావు, సీతారామప్రసాదరావులు కలిసి కుమారసోదరకవులుగా కొంతకాలం జంటగా అవధానాలు చేశారు. మల్లిఖార్జునరావు కూడా చిన్నవయస్సులోనే మరణించారు. సీతారామప్రసాదరావు ఒక్కరే 1988 లో మరణించేంతవరకూ అవధానాలు చేసి కొప్పరపువారి వారసత్వాన్ని, కీర్తిని నిలబెట్టారు.

**కొప్పరపు కవుల అసమాన ప్రతిభ :** గంటకు నూరు పద్యములు గట్టిగ జెప్పగ జాలినట్టివారము... ఏనుగు నెక్కినాము, ధరణీంద్రులు మొక్కగ నిక్కినాము అంటూ... దోసమటంచు ఎరింగియును దుందుడుకొప్పగ పెంచినారము ఈ మీసము అని సవాళ్ళు విసురుతూ తిరుపతి వేంకట కవులు అవధానాలు చేస్తున్న రోజులవి.

అటువంటి వాతావరణంలో... ఒంగోలు గిత్తల్లా సాహితీ సామ్రాజ్యంలో దుమికిన కవివీరులు కొప్పరపు సోదరకవులు. గంటకు ఐదు వందల పద్యాల వేగంతో, ఆశువుగా ప్రబంధ తుల్యమైన కవిత్వాన్ని సృష్టిస్తూ, అరగంటకొక కావ్యాన్ని ఆశువుగా నిర్మిస్తూ, ఒకే రోజు రెండేసి శతావధానాలు నిర్వహిస్తూ గద్వాల్ నుండి మద్రాసు వరకూ కవితా జైత్రయాత్ర చేశారు కొప్పరపు కవులు. కొన్నివేల అవధానాలు, ఆశుకవిత్వ సభలు చేశారు. అసంఖ్యాకంగా బిరుదు సత్కారాలు పొందారు. వెళ్ళిన చోటల్లా విజయమే వారిని వరించింది. ఇద్దరు నాటు తుపాకులతో వీరి వెంట రైల్వే స్టేషన్ దాకా వచ్చేవారు. ఒంటి నిండా బంగారమే ఉండేది. వేలాదిరూపాయలు పారితోషకంగా వచ్చేది. రక్షణ కోసం వారి వెంట భటులుండేవారు. ఊహించుకోండి... వందేళ్ళ క్రితం కవులకు గన్‌మెన్‌లు ఉండడం, గుర్రపు, ఎద్దుల బండ్లలో కొప్పరపు వారు వెళ్తోంటే, వారి వెంట అభిమానగణం వెళ్ళేది. వారి అవధానాలు, ఆశుకవిత్వ సభలు చూడడానికి బండ్లు కట్టుకొని వేలాది మంది వచ్చేవారు. దేశంలోని నలుమూలల నుండి మహాకవిపండితులు వచ్చి వీరి అవధానాలను తిలకించేవారు. నాటి పత్రికల్లో వీరి ప్రతిభా విశేషాలను మొదటి పేజీల్లో అత్యంత ప్రముఖంగా ప్రచురించేవారు. 1916కే వీరు ఆశువుగా చెప్పిన పద్యాల సంఖ్య 3 లక్షలకు పైగా ఉంటుందని లక్కవరం రాజావారు మంత్రి ప్రగడ భుజంగరావు 1927 వరకూ ఈ మహాకవులూ జంటగా ఎన్నో సభలు చేశారు. ఎన్ని లక్షల పద్యాలు చెప్పారో ఆ పలుకులతల్లికే ఎరుక. కొప్పరపువారి ఇంట్లో పద్యాలతోకూడిన గోతాలు ఉండేవట. ఆ కాగితాల్లో ఏ మహాకావ్యాలు దాగి ఉన్నాయో? కుటుంబ సభ్యుల అశ్రద్ధవలన, కాల మహిమవలన ఏదైతేనేమి? వారి లక్షల పద్యాలు గాలిలో కలిసిపోయాయి. ఆశువుగా సృష్టించిన పద్యాలు, వారి ఆశుకవితా విన్యాసం ఆనాడు రికార్డింగ్ సదుపాయం లేకపోవడం వలన ఆ మహాదృశ్యాలను వీక్షించే మహద్భాగ్యాన్ని మనం కోల్పోయాము. వారు ఆశువు చెబుతుంటే ఎంతటి రాయసకాడు రాయలేకపోయేవాడట. 4 సెకన్లకు ఒక పద్యం చెబుతూంటే ఎవరు రాయగలరు? పలికిన పలుకులన్నియును పద్యములయ్యెడు ఏమి చెప్పుదున్ అంటారు ప్రఖ్యాత కవిపండితుడు వేటూరి ప్రభాకర శాస్త్రి, మార్టూరులో ఒకసారి అరగంట సమయంలో 380 పద్యాలతో మనుచరిత్ర ప్రబంధాన్ని చెప్పారట. అంటే గంటకు 760 పద్యాల వేగం. యిది నిజమా? అంటే నిజమే. ఈ విషయాలన్నీ కొప్పరపు కవుల సభల్లో ప్రత్యక్షంగా పాల్గొని, ఆనందించి, ఆశ్చర్యపోయిన మహామహులు చెప్పిన అక్షరసత్యాలే. సమకాలీన మహాకవిపండితుల ప్రశంసా పద్యాలు సాక్షీభూతంగా నేడు మనకు అందుబాటులోనే ఉన్నాయి.

కావ్యకంఠవాసిష్ఠ గణపతిముని, వేదం వేంకటరాయశాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, వావిలకొలను సుబ్బారావు, జయంతిరామయ్య పంతులు, వడ్డాది సుబ్బరాయకవీంద్రుడు, కాళ్ళకూరి నారాయణరావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, శతఘంటం వేంకటరంగ శాస్త్రి, చెన్నాప్రగడ భానుమూర్తి, దేవరాజు సుధీమణి, పేరి కాశీనాథ శాస్త్రి, కొండా వేంకటప్పయ్య

పంతులు, కొమర్రాజు లక్ష్మణరావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, చిలకమర్తి లక్ష్మీనరసింహారావు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, వేంకట రామకృష్ణ కవులు... వద్దిరాజు సోదరులు... యిత్యాది సమకాలీన మహాకవిపండితులంతా నివ్వెరపోయి భజించారు. వీరి పద్యప్రశంసలన్నీ నేడు అందుబాటులో ఉన్నాయి.

వీరి ధార, ధారణకు తిరుపతి వేంకటకవులు కూడా ఆశ్చర్యచకితులై నవరత్నములతో కొప్పరపు వారిని ప్రశంసించారు. కొప్పరపువారూ తిరుపతి వారిని ప్రశంసిస్తూ అద్భుతమైన మాలికలు చెప్పారు. ఈ రెండు జంటలూ అభేద్య కవితా స్వరూపాలు అని వేటూరి సుందర రామ్మూర్తి గారు అభివర్ణించారు. ఏ గతి రచయించిరేని సమకాలమువారలు మెచ్చరేగదా? అన్న చేమకూర వేంకటకవి వాక్యం కొప్పరపువారి విషయంలో చెల్లదు.

**తిరుపతి వేంకటకవులకు, కొప్పరపు కవులకు గుంటూరులో కుర్చీ విషయంలో మొదలైన చిన్న వివాదం అలా పెరిగి పెరిగి శాఖా వైషమ్యాల దాకా వెళ్ళి మహాసాహిత్య సంగ్రామంగా పరిణమించింది. ఆంధ్రదేశ మంతా రెండు భాగాలుగా విడిపోయింది. అభిమానులు, పత్రికలు, ఊర్లు చెరొకరి ప్రక్కన నిలబడి వాదోపవాదాలు చేసుకు న్నారు. ఘర్షణలకు దిగారు. సవాళ్ళు విసురుకున్నారు. ఈ సాహిత్య సంగ్రామం వలన కొంత చెడు జరిగినా... మంచి ఫలితాలనే యిచ్చింది. పద్యకవులు పుట్టు కొచ్చారు. వేల పద్యాల సృష్టి జరిగింది. కవితా పరిమళాలు ఆంధ్రదేశమంతా వ్యాప్తి చెందాయి. (ఇద్దరు అత్తరు సాయిబులు కొట్టుకొంటే... సీసాలు పగిలి సువాసనలు వెదజల్లిన చందంగా...) తెలుగు భాష, వ్యాకరణము, ఛందస్సు పరిఢవిల్లింది. తరువాత రెండు జంటల్లోనూ వైషమ్యాలు తొలగి పోయాయి. కాలం గాయాన్ని మాన్పిస్తుంది కదా.**

తిరుపతి వేంకటకవులంటే కొప్పరపు కవులకు, కొప్పరపు వారంటే తిరుపతి వారికి ఎంతో అభిమానం, వాత్సల్యం, గౌరవం ఉండేవి. మధ్యలోవారే తగదా పెట్టి తమాషా చూశారు. స్పర్థయా వర్థతే విద్యా.. అన్న విధాన పద్యవిద్య శిఖరాయమానమైన ఖ్యాతి పొందింది.

తిరుపతి వేంకటకవులు అవధానాల వలన పండితులకు, శ్రీకృష్ణరాయబారం వంటి నాటకాల వలన పామరులకు దగ్గరయ్యారు. వారిలో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు ఎనభై ఏళ్ళు జీవించారు. వారి రచనలన్నీ దాదాపుగా గ్రంథస్తం చేసుకున్నారు. మహానటులు తమ ప్రతిభచే రాయబారం నాటకాలను ఊరువాడా ప్రదర్శించి తిరుపతి వేంకటకవుల ఖ్యాతికి మూలస్థంభాలై నిలిచారు. విశ్వనాథ, పింగళి, వేటూరి ప్రభాకర శాస్త్రి, దివాకర్ల వేంకటావధాని వంటి శిష్యగణం అధ్యాపక వృత్తిలో ఉండడం వలన తిరుపతి కవుల విశేషాలు పాఠ్యాంశాల్లో చేర్చారు. దీని వలన కాస్త చదువు కున్నవారికి కూడా తిరుపతి వేంకట కవుల పేర్లు పరిచయమయ్యాయి. నిజం చెప్పాలంటే.. తిరుపతి కవుల నాటక పద్యాలు (చెల్లియొ చెల్లకొ వంటివి) చాలామందికి నోటికి వచ్చును కానీ... వారి కావ్యపద్యాలు గానీ, అవధాన పద్యాలు గానీ చాలామందికి తెలియదు. వారితో నిలిచి మహాకవిత్వాన్ని చెప్పిన కొప్పరపు కవులు, వేంకటరామకృష్ణకవులు చిన్నవయస్సులోనే మరణించారు. చెళ్ళపిళ్ళవారే ఏక ఛత్రాధిపత్యం వహించి స్థిర కీర్తికి మార్గం వేసుకున్నారు.

కొప్పరపుకవులు దైవసంకల్పం, సాధ్వీ మహాత్మ్యం, శ్రీకృష్ణకరుణా ప్రభావం, సుబ్బరాయశతకం, నారాయణాస్త్రాం, దీక్షిత స్తోత్రం మొదలైన రచనలు అనేకం చేశారు. వయస్సు మీరిన తరువాత మహాకావ్యాలు రాద్దాం అని భావించారు. కానీ మన జాతి దురదృష్టం వలన వారు చిన్నవయస్సులో మరణించడం, వారి సాహిత్యం వానలు, వరదలకు కొట్టుకుపోవడం, రాసిన కొన్ని రచనలు పూర్తిగా గ్రంథస్థంకాకపోవడం వలన కొప్పరపుకవుల సాహిత్యం సమగ్రంగా మనం పొందలేకపోయాము. దైవ సంకల్పం కావ్యం, సుబ్బరాయశతకం, కొన్ని అవధాన పద్యాలు, సమకాలిక మహాకవిపండితుల కొన్ని ప్రశంసా పద్యాలు, సాధ్వీ మహాత్మ్యం దృశ్య కావ్యంలోని కొన్ని పద్యాలు మాత్రమే నేడు గ్రంథస్థమై మనకు దొరుకుతున్నాయి.

గంగిగోవుపాలు గరిటడైనను చాలు... అన్న విధంగా వారి సాహిత్యం కొంతైనా దొరుకుతున్నందుకు తెలుగువారిగా మనమందరం సంతోషిద్దాం. కొప్పరపు వారి కవిత్వాన్ని మూల్యాంకనం చేసే శక్తి మనకు లేకపోయినా... వారి పద్యపాదాలను పఠిస్తూ, వారి కవిత్వాన్ని భజించడమే ఆ అప్రతిమాన ప్రతిభామూర్తులకు మనం యిచ్చే అసలైన నివాళి.



పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, అయ్యదేవర కాళేశ్వరరావు, భోగరాజు పట్టాభిసీతారామయ్య, గంజా వేంకటరత్నం పంతులు, రాజా మంత్రి ప్రగడ భుజంగరావు బహద్దర్, రాజా కొచ్చర్లకోట వేంకట కృష్ణారావు బెజవాడ పట్టాభిరామిరెడ్డి, భోజవాడ గోపాలరెడ్డి, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి వంటి మహానాయకులు కొప్పరపు అభిమానకోటిలో వారే. యింతటి మహావైభవమైన జీవితాన్ని అనుభవించి, సౌశీల్యమూర్తులుగా అందరి మన్ననలు పొంది, ఆశుకవితా ప్రతిభ దైవకృపగా భావించిన కొప్పరపువారి గొప్పతనం ఎన్ని పేజీలు రాసినా తీరని ఋణంగా భావిస్తున్నాను. వారి శీలమే వారికి రక్ష వారి ప్రతిభే వారికి కీర్తి.

**సత్యమేవ జయతే.**

❄ ❄ ❄ ❄ ❄

# ప్రముఖ వాగ్గేయకారులు

# సద్గురు శ్రీ శ్రీ శ్రీ శివనారాయణ తీర్థయతీంద్రులు



**మాదిరాజు వెంకటసుబ్బారావు,**
మాజీ ఛైర్మన్ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం, సింగరకొండ, అద్దంకి.

సద్గురు శ్రీ శ్రీ శ్రీ శివనారాయణ తీర్థయతీంద్రులు రచించిన శ్రీ కృష్ణ లీలాతరంగిణి యొక్క సాంప్రదాయ వైశిష్ట్యం. శ్రీ శివనారాయణ తీర్థయతీంద్రులవారి సంక్షిప్త పరిచయం

శ్రీ తీర్థులవారి పూర్వనామం గోవిందశాస్త్రి. వీరి ఇంటి పేరు తల్లావఝ్ఝలవారు. వీరు గుంటూరు జిల్లా మంగళగిరి సమీపమున గల "కాజా" గ్రామములో గంగాధర శాస్త్రి, పార్వతి దేవిలకు 1675లో జన్మించినారని తెలియుచున్నది. (అది అషాఢ శుద్ధ ఏకాదశి). వీరికి 8వ సంవత్సరములోనే ఉపనయనము చేసినారు. అంతట వీరు విద్యాభ్యాసము నిమిత్తమై కాశీ మొదలగు పట్టణములలో సంచారము చేసి వ్యాకరణము, తర్కము నిరుత్తము మీమాంస, వేదాంత శాస్త్రములలో పాండిత్యము పొందినారు. వారు తదుపరి వేదాద్రిలో



మహాలక్ష్మమ్మ అనువారిని వివాహమాడిరి. ఒకరోజు వీరు అత్తగారి గ్రామమైన వేదాద్రి వెళ్ళుటకు గాను కృష్ణానదిని దాటుచుండగా హఠాత్తుగా నది పొంగి వరదరాగా దిక్కు దోచని సందర్భములో ఆగంతుక సన్యాసమును మనస్సులో స్వీకరించినారు. వెంటనే ఆ కృష్ణానదిలో ఒక ఒడ్డు దొరకగా అవతలి గట్టునకు చేరి వేదాద్రిలో వారి అత్తగారింటికి చేరినారు. ఐతే భార్య మీద వుండే వ్యామోహము చేత ఆగంతుక సన్యాసము స్వీకరించాననే మాటమరచి భార్య వద్దకు చేరినాడు. ఆమెకు తన భర్త యైన గోవింద శాస్త్రి గా కాక గొప్ప యతీశ్వరుడుగా కంటికి అగుపడినది. ఎంత ప్రయత్నించినా అటులనే అగుపడుటచేత ఈ విషయమును ఆమె తల్లిదండ్రులకు విన్నవించినది. అంతట అత్తమామలు గట్టిగా అడుగగా నేను ఆగంతుక సన్యాసము స్వీకరించానని చెప్పినారు. అంతట ఆమె ఇక నుండి నీవు నాకు భర్తవు కాదు, నేను నీకు శిష్యురాలును. నాకు మీరు గురువులని క్రమ సన్యాసము స్వీకరించుటకు అనుమతించినది. అనుమతి పొంది శ్రీ శివరామానంద తీర్థులవారి వద్ద సన్యాసం స్వీకరించినారు. అంతట వారు వీరి నామమును శివనారాయణ తీర్థ యతీంద్రులుగా నామకరణం చేసిరి. అంతట గురుశిష్యులిద్దరూ కాశికేగిరి. అచట

శ్రీకృష్ణచరితమును ప్రధానాంశముగా సంస్కృతములో శ్రీ కృష్ణ లీలా తరంగిణి గా రచించినారు. ఇందులో ముఖ్యముగా సంగీత, సాహిత్య, నృత్య శాస్త్ర త్రివేణి సంగమముగా జాలువారి ప్రాచుర్యము పొందినది.

గీతం, వాజ్యంచ, నృత్యంచ త్రయము సంగీత మృచ్చతే (సంగీత రత్నాకరము అనే పుస్తకములో ఉన్నది)

శ్రీ మహాభాగవతమందలి దశమ స్కంధములోని శ్రీ కృష్ణ జననము నుండి రుక్మిణీ కళ్యాణము వరకూ పంద్రండు (విభాగములుగా) రచించినారు. కీర్తనలు, గద్యము, శ్లోకములు దరువులతో రచించారు. ఇది పండిత పామరులలో బహుళ ప్రచారము పొందినది. కాశీ నుండి బయలు దేరి అనేక ప్రాంతముల మీదుగా గోదావరి తీరము, కృష్ణాతీరము దాటిన తరువాత వీరికి పరిణామశూల వ్యాధి కలిగినది. అంతట అప్పటి గుంటూరు జిల్లా ప్రస్తుతము ప్రకాశము జిల్లా ఒంగోలు తాలుకా యందు గుండికా నదీ తీరమున అద్దంకి దగ్గరలో సింగరకొండకు వెళ్ళి అచట కొండపై గల లక్ష్మీ నృసింహస్వామి దేవాలయమును చేరుకున్నారు. అచట దేవాలయములో మూలవిరాట్‌కు దక్షిణము వైపున గల బిళము నుండి గుళ్ళకమ్మ నదిలో గుండా ఒడ్డున గల సంగమేశ్వరస్వామి దేవాలయమును చేరుకొని అచట స్వామిని సేవించుకొని గుండ్లకమ్మ నదిలో స్నానము చేయుచూ ఈ రీతిగా కొంతకాలము లక్ష్మీనృసింహస్వామి దేవాలయమునకు ప్రదక్షిణము చేయుచూతపస్సు చేయగా వారికి వచ్చిన పరిణామశూల వ్యాధి నివారణ అయినది.

ఆ రోజులలో ఆ ప్రాంతమున గల సంగీత ప్రియులందరినీ ఒక చోటకి చేర్చి వారు రచించిన శ్రీ కృష్ణ లీలా తరంగములకు శుద్ధమైన సాంప్రదాయ రీతులలో వారికి శిక్షణ ఇచ్చినారు. అద్దంకి దాదాపు నూర్ల సంవత్సరముల పై కాలము నాడు మహోన్నత దశయందు వుండినట్లు తెలియుచున్నది. దేశమున ప్రసిద్ధియైన వారిలో మొదట తరంలోని వారందరూ అచటనే వుండిరి. అచట 101 దేవాలయాలు వున్నట్లు శాసనము కూడా కలదు. సూర్య సిద్ధాంతమునకు కల్పవల్లి యను వ్యాఖ్యానమును రచించిన మల్లిఖార్జునుడు అద్దంకి యందు వుండెను. అసలు అద్దంకికి సమీపమున గల (అద్దంక్యాంయహవ్యుభాగాశాఖవరం కల్పపూర్వాభిరామం) కల్పవల్లి వ్యాఖ్య కలవకూరు అను గ్రామము. అంతట ప్రసిద్ధియైన గ్రామము వారికి తీర్థులవారు దర్శనము కలుగచేసిరి. ఇటీవల వరకుకూడా అద్దంకి ఎందరో మహానుభావులకు స్థానమైయున్నది. అచట బ్రాహ్మణ సత్రములు సస్తాహములు సామ్రాజ్య పట్టాభిషేకములు అనంతముగా జరుపబడియుండును. ఆ సందర్భములలో అందరూ తీర్థుల వారిచే రచింపబడిన తరంగములు గానము చేయుచుండెడివారు. ఆ పరంపరలోని వారే శ్రీమాన్ అద్దంకి వెంకట్రాయుడు గారు. శ్రీమాన్ పాలపర్తి నృసింహదాసుగారు, చల్లా సుబ్బయ్య గారు, తాడిగడప శేషయ్య గారు, మాదిరాజు సూర్యనారాయణ గారు వీరందరూ అద్దంకి వారే. చెరువు వెంకటేశ్వర్లు గారు, బొమ్మరాజు సీతారామదాసు, నాగరాజు సుబ్బారావు మొదలగువారు.

వీరందరికి, వీరు గాక అనేకమందికి వారే స్వయముగా ఈ తరంగములో పాడుటలో శిక్షణ ఇచ్చినారు. ఈ ఒంగోలు తాలుకా వారు గానమునకు ఇతరులు చేసే బాణీకి చాలా వ్యత్యాసము వున్నది. ఇప్పటి ఒంగోలు తాలుకా వారి గానమే ఈ తరంగములకు వన్నె వచ్చినది. అటుల శివనారాయణ తీర్థులవారు ఆంధ్రదేశము నుండి బయలుదేరి వెళ్ళినప్పుడు మార్గమధ్యమున తిరుపతి, తిరుమల క్షేత్రమునకు వెళ్ళి వెంకటేశ్వరస్వామిని సేవించిరి. పిమ్మట అనేక పుణ్యక్షేత్రములు మార్గమున దర్శించుచూ కావేరి తీరంన వున్న భూపతిరాజపురం చేరిరి.

ఈ గ్రామము తంజావూరు జిల్లాలో కావేరి నందికి ఉపనదియగు కుడుమపత్తి అను నదికి దక్షిణము పక్కన గలదు. అచట తీర్థులవారి యొక్క అపూర్వమైన అమానుషమైన వారి శక్తిని గుర్తించిన వారై వారిని భక్తితో సేవించుచుండిరి. తీర్థులవారి అజ్ఞానుసారము అచట రాజు శ్రీకృష్ణ పరమాత్మకు ఒక దేవాలయము నిర్మించగా తీర్థుల వారే స్వయముగా శ్రీకృష్ణపరమాత్మ ప్రతిమను ప్రతిష్ఠించినారు. నారాయణ తీర్థులవారు పాడుకొనబడు సమయమున ఒక తెరను కట్టించినారు. ఆ తెర వెనుక వారి గానమునకు తగినట్లుగా నృత్యము చేయుచున్నట్లుగా లీలగా ధ్వని వినిపించుచుండెడిదట. ఈ విధముగా భూపతి రాజు పురము నందు శిష్యులకు తరంగములు బోధించిరి. ఇటుల తీర్థులవారు అనేక దివ్యక్షేత్రములు దర్శించుచూ దివ్యమైన తోటలతో కూడిన మధ్యాహ్నసమయమున తిరువయ్యూర్ అనే ప్రదేశమునకు చేరి అచట శ్రీ మహాలింగేశ్వరస్వామిని దర్శించి అచట కొంత కాలము నివసించినారు. ఆ తరువాత నారాయణ తీర్థులవారు తిరువయ్యూరుకు వెళ్ళి అచట ఉండిన శ్రీ సచ్చిదానంద స్వామి వారిని దర్శించినప్పుడు వారి చిత్త పరిపక్వత గమనించి సచ్చిదానందస్వాములవారు వారిని పంచనది క్షేత్రమునకు వెళ్ళి అచట ఉండవలసినదిగా చెప్పిరి.

పంచనదులతో చుట్టబడినటువంటి ఆ తిరువయ్యూరు అను కేంద్రమున ఒక బిల్వ వృక్షము కింద కూరుచుండిరి. కొంతకాలము నకు ఏకాంతము గా వున్న స్థలమునకు చేరదలచి విళాంగుడిలో విప్పతోటలో ఒక చెట్టు కింద నివసించిరి. ఆ శివస్థలములో గొప్ప దగు కాళ్ళదమునకు ఉత్తర దిక్కుగా వుండు తిరుమళ్ళూపూడియలలో ఒకచోట ఆశీసులై వుండిరి. అచట నుండి బయలు దేరి సూర్యస్తమయ సమయములో బ్రాహ్మణులు విశేషముగా వుండు నడుక్తీరి అను గ్రామమునకు చేరిరి. ఆ గ్రామములో వినాయకుడి గుడిలో బసచేసి ధ్యానయోగములో ఉండిరి. ఆ రాత్రి కలలో శంఖ, చక్రాదులు ధరించిన శ్రీ మహావిష్ణువు కనపడి తాను ప్రపంచమును రక్షించుటకు పూర్వము అవతరించిన బహురూపములను చూపి ఈ కలియుగమున ప్రపంచమును కాపాడుటకై

ఎత్తిన అవతారము అలివేలుమంగా సమేతంగా శ్రీ శ్రీనివాసరూపముతో శ్రీ తీర్థుల వారికి దర్శనము ఇచ్చినారు. సాయంత్రము ఇచట కనుపించిన వరాహము వెంటపోయి అది చూపిన చోటుకు చేరుదువుగానీ అని అంతర్థానమయ్యెను. తెల్లవారిన పిమ్మట కలలో కాంచినటువంటి చెప్పబడిన వరాహము తీర్థులవారి పక్కన కనిపించెను. తీర్థులవారు ఆ వరాహము వెంటపోగా అది వీరకూరు అను గ్రామములో బ్రాహ్మణ వీధిలో మధ్యాములకు ఒక ఇంటిలో చేరెను. లోపలికి దూరిన వరాహము ఎన్ని పర్యాయములు వెతికిననూ కానరాలేదు. తనను తీసుకెళ్ళిన వారాహము సాక్షాత్తూ మహావిష్ణువే అని గ్రహించి శిరముపై చేతులు జోడించి కన్నీట ధారతో సావేరి రాగమున మత్స్య, కూర్మ, వరాహ, నరమృగ, వామనాసురభార్గవా అని దశావతార తరంగములను పాడుచూ ధ్యానమందున నిలిచి ఏడు రోజులు నిష్టలో వుండి ఎనిమిదవ రోజున అదే ఇంటిలో దేవాలయము ఏర్పరుపచేసి అందు శ్రీ వెంకటేశ్వరుని ప్రతిష్టించి తాము ఆ ఇంటిలో వుండి పూజలు చేసిరి.

అటుల గోకులాష్టమి మొదలగు వుత్సవములు చేయుచూ తమకు కలలో కనిపించినటువంటి ఆ వెంకటేశ్వరుని మహత్వమును భక్తులకు బోధించుచూ వుండిరి. తీర్థుల వారికి కొందరు శిష్యులు కూడా ఏర్పడిరి. తరువాత ఒకరోజు కృష్ణ పరమాత్మ కలలో కనిపించి, నా యొక్క లీలలను గానము చేయవలసినదిగా చెప్పి అంతర్థానమయ్యెను. మరునాడు కృష్ణ పరమాత్మ ఆజ్ఞాపించిన విధముగా జయజయరమానాధ, జయజయ ధరానాధ, జయజయ వరాహపురి శ్రీ వేంకటేశా అనే తరంగమును గానము చేసెను. తదుపరి తనచే స్థాపించబడినటువంటి వెంకటాచలపతి యొక్క ఆజ్ఞను నొంది తిరువయ్యూరు సమీపమున గల తిరుకుత్రపల్లి అను క్షేత్రమునకు వచ్చి అప్పర్‌స్వామి వారిని దర్శించుకొని కావేరి నదికి దక్షణమున గల తిరువన్‌దుర్తి అను క్షేత్రమునకు చేరిరి. తదుపరి ఒక బ్రాహ్మణుడు తీర్థులవారికి సేవ చేయుచుండగా కొంతకాలమైన తరువాత నీకేమి కావలయునని అడుగగా కుటుంబపోషణకు కొంత ధనము కావలెనని అడిగినాడు.

తీర్థులవారు ఆ బ్రాహ్మణుని చేతిలో ఒక పచ్చని ఆకును పెట్టినాడు. ఏమిటి ఆకు పెట్టినారని అడుగగా తంజావూరు రాజధానిగా అమరసింగు అను రాజు ధర్మపరిపాలన చేయుచున్నాడు. వారు అనేక దానధర్మములు చేయుచున్నాడు. ఐనప్పటికీ పూర్వజన్మ కర్మ ఫలముగా ఆ రాజుచేతిలో ఒక వ్రణము ఏర్పడినది. అతను చాలా బాధపడుచున్నాడు. ఈ ఆకును అతనిచేతిలోని వ్రణమునకు దివ్యఔషధము కనుక నీవు అచటికి వెళ్ళి ఈ ఆకును ఉపయోగించుము, నీకు కావలసిన ధనము ఆ రాజు ఇచ్చును అని చెప్పినాడు. ఆ విధముగానే అమరసింగ్ మహారాజునకు ఆ వ్రణమును నయము చేసినాడు. ఆ బ్రహ్మణునికు అడిగినంత ద్రవ్యము అమరసింగ్ మహారాజు ఇచ్చి మీకు ఈ ఆకు ఎక్కడ లభించినది. ఎవరు ఇచ్చినారు అని అడుగగా నారాయణ తీర్థులవారి ఉదంతము ఆ బ్రహ్మణుడు తెలిపినాడు. అమరసింగ్ మహారాజు సకుటుంబ సపరివార సమేతముగా మంగళవాద్యములతో తిరుపందుర్తికి చేరిరి. కాని మూడు రోజుల వరకు తీర్థుల వారి దర్శనము లభించలేదు. అందులకు రాజు గారు సంతాపపడుచుండుట గ్రహించి రాజునకు దర్శనమిచ్చి మీరు ఎవరూ అని అడిగినారు. నేను తంజావూరు నేలు అమర్‌సింగ్ అను రాజును మిమ్ములను దర్శించ ఇచటికి వచ్చినాను అని అనేక విధములు కొనియాడినారు.

రాజు అమరసింగ్ అచటనే ఒక దేవాలయము నిర్మించినారు. తీర్థులవారి వద్దన్ను మేక తిరుగుటకు తగిన స్థలము ఇచ్చేదనని రాజు గారు తీర్థుల వారికి విన్నవించి, ఎంత భూమి ఇవ్వవలనో యోచించుచుండగా రాజుగారి సందేహము తీరు విధమున అక్కడ వున్న మేక తన వెనుక కాలితో గీత గీచుకొనుచూ తీర్థ స్వాముల వారు వున్న తోటలో కొంత ప్రదేశము చుట్టివచ్చినది. ఆ ప్రదేశమునకు రాజు గారు తీర్థుల వారి పేరుతో పట్టా మంజూరు చేసినారు. అచట రాజు గారు సూర్య పుష్కరిణి అను పేర ఒక తటాకమును కూడా త్రవ్వించినారు. మేక నిలబడిన ప్రదేశములో ఒక దేవాలయము మండపము ప్రాకారము కట్టించెను. తీర్థుల



వారు తమ వంశము వారై వుండి అంతట మహనీయులు కొందరు తల్లావఝ్ఝల వంశీయులు దక్షిణ దేశమున శ్రీర్న మహాదేవి గ్రామములో దాదాపు తల్లావఝ్ఝల వంశము వారు రెండు వందల కుటుంబముల వారు చేరిరి.

శ్రీ శివనారాయణ తీర్థ యతీంద్ర సద్గురు స్వామి వారు తమ నిర్యాణ కాలము ఆసన్నమైనదని అమరసింగ్ మహారాజునకు, తిరుపన్‌దుర్తి వాసులకునూ తమ శిష్యులకునూ ముందుగా తెలిపిరి.

తీర్థులవారి మోక్షకాలము దర్శింప అనేక ప్రాంతముల నుండి రాజులతో సహా అనేక మంది వచ్చి చేరిరి. స్వామి వారు తెలిపినటువంటి సమయము ఆసన్నము కాగానే గొప్ప కాంతి పుంజముగోచరించి ఆ జ్యోతి పైకి కొంతదూరము వరకు పోయి కనుపించకుండా పోయినది. ఆ రోజు మాఘమాస శుక్లపక్షము అష్టమి తిథి కృత్తికా నక్షత్రము, గురువారము అయి ఉన్నది. శ్రీ స్వామి వారు జీవన్ ముక్తిని పొందిన పిమ్మట అమరసింగ్ మహారాజు తీర్థులవారికి సమాధిని కట్టించి పూజాధికములకు గాను పందొమ్మిది ఎకరముల మాన్యము కూడా ఇచ్చిరి. నేటికి నిర్యాణ దినమున తీర్థులవారి ఆరాధన వారి సమాధి తిరుపన్‌దుర్తి యందు జరుగుచున్నది. అచట భక్తులు శ్రీ వారి తరంగములను ఆడిపాడి సేవించుకొనుచున్నారు. అద్దంకి సీమలో తీర్థులవారి తరంగ కాలక్షేపములకు ప్రసిద్ధి వహించినది.

అద్దంకి వెంకట్రాయుడు గారు, పాలపర్తి నృసింహదాసు గారు, బొమ్మరాజు సీతా రామదాసుగారు, చదలవాడ వెంకటరమణదాసు గారు, రామాయణ సీతాపతిగారు, రామాయణం బలరామస్వామి గారు, మాదిరాజు సూర్యనారాయణ గారు, కోట చంద్రమౌళిగారు, తాడిగడప శేషయ్య గారు, ఘోరకవి వీరరాఘవరావు గారు పోలూరి వెంకటసుబ్బదాసుగారు వీరి తమ్ముడు పోలూరి వెంకటరమణదాసుగారు (వీరినే వాలిసుగ్రీలు అని అనేవారు) నాగరాజు సుబ్బారావు గారు,



అచ్యుతుని వెంకటసుబ్బారావు గారు, రాచపూడి సీతారామయ్య గారు, నీలంరాజు ఆదిముత్తుగారు ఎందరో మరెందరో మహనీయులు ఈ తరంగ కాలక్షేపములలో మునిగి వారి జీవితములను ధన్యము గావించుకొనినారు. అందు ముఖ్యముగా భాగవత దశమ స్కంధము తరంగముల రూపములో తీర్థులవారు రచించినారు.

**(1) శ్రీ కృష్ణ ఆవిర్భావము,**
**(2) బాల్య లీలలు,**
**(3) గోవత్స పాలనము**
**(4) కృష్ణ గోపాల వర్ణనము,**
**(5) గోవర్ధనోద్ధరణము**
**(6) కృష్ణ గోపికలసమా గమము**
**(7) రాసక్రీడ (8) గోపికా గీతములు,**
**(9) మధురానగర ప్రవేశము**
**(10) కంస సంహారము**
**(11) ద్వారకానగర ప్రవేశము**
**(12) రుక్మిణీ కళ్యాణము.**

ఈ విధముగా దశమ సక్కదము యావత్తు తరంగముల రూపములో వర్ణించి ధన్యులైనారు. ఈ తరంగములలో ముఖ్యమైనది 'బాల గోపాలమా, ముద్దుర – కృష్ణ పరమ కళ్యాణ గుణాకర నీరదనీలకళేబరాకృష్ణా నిరుపమ కౌస్తుభ కంధర అనే బాలగోల తరంగమును కనీసము మూడు గంటలకాలము గానము చేసెడివారు. అట్టి వారిలో రామాయణం సీతీపతిగారి స్వరకల్పన, రామాయణం బలరామస్వామి వారి భరత శాస్త్రం ఎంతయో చెప్పుకోదగినదై యున్నది.

ఒక సంవత్సము చదలవాడ రఘునాయక స్వామి వారి బ్రంహోత్సవములలో బొమ్మరాజు సీతారామదాసు గారు 'శ్లో' జన్మాంతర సహస్రేషు కృతపుణ్య ఫలోదయ ఇదమాఘపరాకాంతంకుర్వంతి ప్రణతీర్మహుః

**॥తీ॥ గడచిన అనేక జన్మలయొక్క – ఫలోదయం కలిగినట్టి**
**మరియొక గోపికా కాంత ప్రియుడగు ఆ శ్రీ కృష్ణ పరమాత్మను**
**మాటమాటికి నమస్కారములు చేయుచూ ఈ క్రింది తరంగమును**
**చెప్పబోవుచున్నాను.**

**॥ప॥ పూరయ మమకామం గోపాల – పూరయ మమకామం**

**॥అనుపల్లవి॥ వారం వారం వందనమాస్తుతే – వారిజదళనయినా**
**గోపాల అనే తరంగమును పూరయమమ కామం**
**గోపాల పూరయిమమ కామం అంటూ బొమ్మరాజు**
**సీతారామదాసు గారు పరమపదించినారు.**

అంతటి మహనీయులు వున్న ఈ ఒంగోలు, అద్దంకి ప్రాంతములో ఇప్పుడు ఈతరంగములు పాడువారిని వేళ్ళ మీద లెక్కించవచ్చును. ఈ తరంగములను ఇప్పుడు వున్నవారు, తరంగములు రూపురేఖలను దిద్దుచూ ఈ తరంగములను బతికించు కోవలసినదిగా ప్రార్ధించుచున్నాను. మనకు (1) తీర్థులవారి తరంగముల ప్రతీతి (2) ఒంగోలు జాతి పశు సంపద భారతదేశములోనే గాక ప్రపంచములో కూడా ప్రసిద్ది చెందియున్నది. ఈ రెండింటిని పోషించుకోవలసిన బాధ్యత అటు రైతులపైన, ఇటు సంగీత ప్రియుల పైన వున్నదని మనవి చేయుచున్నాను.

శ్రీశ్రీశ్రీ శివనారాయణ తీర్ధయ తీంద్రుల జయంతి ఆషాఢ శుద్ధ ఏకాదశి
వర్ధంతి మాఘశుద్ధ అష్టమి

ప్రస్తుతంబొమ్మరాజు పాండురంగారావు గారు, ఘోరకవి సంపత్‌కుమార్, చెరువు వెంకటప్పయ్య గారు ఇప్పటికీ గానం చేయుచున్నారు. శ్రీ కృష్ణ లీలా తరంగిణి అనుతరంగములను మొట్టమొదటసారిగా వావిళ్ళ రామస్వామి శాస్త్రి వారు ముద్రించినారు. తరువాత సదరు తరంగములను ప్రతి పదార్ధములతో కీ.శే గుళ్ళాపల్లి ఆదినారాయణగారు (స్వాతంత్ర్య సమర యోధులు) 2000 సంవత్సరములో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి 5 వందల పుస్తకములను ముద్రించినారు. వారికి ఈ తరంగ కాలక్షేపములలో ప్రవేశము కలదు. ఈ ముద్రణ జరుగునాటికి వారి వయస్సు తొంబదియేళ్ళుకు పైబడినది. ఇప్పుడు వారు పరమపదించినారు. వారి ఆత్మకు శాంతి కలుగవలెనని ఆ శ్రీ కృష్ణపరమాత్మని ధ్యానించుచున్నారు.

లోకాసమస్త సుఖినోభవంతు,
***సర్వేజనాః సుఖినోభవంతు.***

❄ ❄ ❄ ❄ ❄

# గుండ్లకమ్మ గేయ కవిత

రచన : **పదాల పద్మావతి,** యం.ఎ., కావలి

**కమ్మని నీళ్ళిచ్చు అమ్మా గుండ్లకమ్మా**
**ఉన్నావు మరి నీవు అద్దంకి సరిహద్దుల**
**సింగర గిరి దరిదాపుల, భవనాశి చేరువున**
**పాడిపంటల కాలవాలమైనావు**
**పారించు చున్నావు సెలయేరులా**
**సస్యశ్యామలము చేసేవు అద్దంకి సీమల**
**సాగిపోతున్నవి నీ జలాలు ప్రకాశము జిల్లా అంతటా**
**నీ పేరుతో సాగుతున్నది ఒక పత్రికమ్మ 'గుండ్లకమ్మ'**
**సాగు చేయుచున్నాడు ఈ పత్రికమ్మను 'కొండలరావు'**
**తన సహనశక్తులతో**
**ఎదుగనున్నది ఈ పత్రికమ్మ ఏడు కొండలవాని దీవెనలతో**

**సింగరాద్రి నరసింహుని అనుగ్రహముతో**
**సమాజాభివృద్ధికై సాగుతున్నది**
**సమసమాజ నిర్మాణమే కోరుతున్నది**
**ఈ రాజకీయ పత్రికమ్మ 'గుండ్లకమ్మ'**
**మరువవద్దు మన గుండ్లకమ్మను**
**మరి చదివించాలి దేశప్రజలందరిచేత**
**కలిగించాలి నవచైతన్యం**
**కలగాలి సుఖసంతోషాలు**
**కదలికలు రావాలి, కరిగిపోవాలి వైషమ్యాలు**
**కాపుకాయాలి దుష్టశక్తులను,**
**కాలరాయాలి అవినీతి చర్యలను**

# ఎఱ్ఱన మహాకవి



డి.వి. యం. సత్యనారాయణ



ప్రబంధపరమేశ్వరుడనియూ, శంభుదాసుడనియూ ప్రఖ్యాతిగన్నట్టి ఎఱ్ఱాప్రెగ్గడ ఆంధ్రసాహిత్యంలో పేరెన్నిక గన్నట్టివాడు. కవిత్రయములో స్థానము వహించి చిరకీర్తినందినవాడు.

ఎఱ్రనపూర్వులు :

**ప్రజ్ఞాపవిత్రుడాపస్తంబ సూత్రుండు**
**శ్రీవత్స గోత్రు దూర్జిత చరిత్రు**
**డగు బొల్లనకు బోలమాంబకు పుత్రుండు**
**వెలనాటి చోడునివలన మిగుల**
**మన్ననగన్న భీమనమంత్రి పౌత్రుండు**
**పేరమాంబామనఃప్రియుడు, పోత**
**మాంబికావిభు సూరనార్యుమజ్జనకుని**
**బొల్లధీనిధికిని బోలనకును**
**జన్ననకు ననుజన్ముని కన్నతండ్రి**
**వేగినాట గరాపర్తి వృత్తిమంతు**
**డనఘు డెరపోతసూరి కంసారిచరణ**
**కమలమధుకరపతి, సారవిమలయశుడు**

(నృసింహపురాణము)

అని ఎఱ్రన నృసింహపురాణము ఆరంభములో చెప్పెను పై పద్యమునను సరించి ఎఱ్రనగారి తాతకు తాత భీమనమంత్రి ఆయన గొంకరాజు కుమారుడైన రెండవ వెలనాటిచోడునివలన మిక్కిలి గౌరవము పొందినవాడు. ఈ వెలనాటి చోడుని పరిపాలనాకాలము క్రీ.శ. 1163–80గా చారిత్రకులు తేల్చిరి. ఎఱ్రనగారి ముత్తాత దంపతులు బొల్లన–పోలమాంబ. ఇక ఎఱ్రనగారి తాతగారు ఎరపోతసూరి. పరమ విష్ణుభక్తుడు. అంటే తాతగారిపేరే ఎఱ్రయగారికి పెట్టారన్నమాట. ఎఱ్రన తల్లిదండ్రులు సూరన, పోతమాంబ. ఎఱ్రనగారు తన తండ్రి సూరనను 'ఉభయ కవిత్వ ప్రౌఢ శబ్దార్థ యోగాజ్ఞాసిద్ధిఘనుండు' అని సంభావించాడు.

ఎఱ్రయ తన తాతగారైన ఎరపోతసూరి వేగినాటిలో కరాపర్తివృత్తిమంతుడని తెలిపియున్నాడు. కరాపర్తి అనీ, కరావర్తి అనీ అనేక రకాలుగా చారిత్రకులు కరాపర్తిని అగ్రహారంగా గ్రామనామంగా ఊహించారు.

కానీ పరిశోధనా పరమేశ్వరులైన శ్రీ నిడుదవోలు వెంకటరావు పంతులుగారి అభిప్రాయం ప్రకారం 'కరము' అనగా 'పన్ను' అనియూ, ఎఱ్రయగారి పూర్వీకులు వేగినాటి సీమలో గ్రామకరణము (టాక్స్ కలెక్టర్) వంటి వృత్తిని నిర్వహించిన వృత్తిమంతులనివారు అభిప్రాయపడినారు. ఈ

అభిప్రాయమునే ప్రముఖ పరిశోధకురాలైన డా॥పి.యశోదారెడ్డి గారునూ సమర్థించిరి. వేగినాటి నుండి తరువాతి కాలంలో ఎఱ్ఱనగారి పూర్వులు కారణాంతరాలవల్ల పాకనాటి సీమలోని గుడ్లూరుకు వచ్చి స్థిరపడ్డారు. అందువల్ల నేటి ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు ఎఱ్ఱన గారి జన్మస్థలమైంది. వారి బాల్యమంతా అక్కడే గడిచింది.

**ఎఱ్ఱయ పోషకులు :**

ప్రతాపరుద్ర చక్రవర్తిని బంధించి ఢిల్లీసైన్యాలు తీసుకుపోయాక కాకతీయ సామ్రాజ్యం అంతరించి పాకనాటి లో రెడ్డి రాజ్యం ఆవిర్భవించింది. అద్దంకి రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1324 ప్రాంతంలో రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. ధరణికోట, చందవోలు, బెల్లంకొండ, వినుకొండ, కొండవీడు, కొండపల్లి మొదలైన 84 దుర్గాలను నిర్మించి అనుజ, తనుజ బాంధవులను అధిపతులను చేశాడు.

**తనకు అద్దంకి తగు రాజధానిగా ప**
**రాక్రమంబున బహుభూములాక్రమించి**
**అనుజ తనుజ బాంధవ మిత్రజనులకిచ్చె**
**యెదురె ఎవ్వారు వేమ భూమీశ్వరునకు**

అని హరివంశంలో ఎఱ్ఱనమహాకవి చెప్పినట్లుగా ప్రోలయవేమారెడ్డి తన రాజ్యాన్ని తూర్పు సముద్రపు (బంగాళాఖాతం) తీరప్రాంతమంతా వ్యాపింపచేశాడు. గుండ్లకమ్మ కు ఇరువైపులా తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఇందుకు అతని అనుగు తమ్ముడు మల్లారెడ్డి ఎంతో సహకరించాడు. అనంతర కాలంలో ప్రోలయవేమారెడ్డి ఇతనిని కందుకూరు దుర్గాధిపతిని గావించాడు. కందుకూరు దుర్గాధిపతిగా ఉన్న కాలంలోనే బహుశా ఎఱ్ఱన గారికి మల్లారెడ్డి గారి పరిచయం లభించి ఉండవచ్చు. మల్లారెడ్డి ఎఱ్ఱనను 'ఆతతశ్రీసముపేతుణ్ణి' చేశాడు. ఎంతో అభిమానించాడు. ఈ మహాకవి ఉండవలసింది దుర్గంలో కాదు. రాజధానిలో...అని భావించి ఈ కవిరత్నాన్ని అన్నకు కానుకగా సమర్పించాడు. ఈ విషయాన్ని "వేమారెడ్డి తన తమ్ముడు మల్లారెడ్డి సముద్ర తీరస్థ గ్రామాల మీద అధికారం, ద్వీపాంతర వ్యాపారం మీద పెత్తనమూ ఇచ్చాడు. మల్లారెడ్డి వర్తకాన్ని బాగా అభివృద్ధి చేసి రత్నాలు, గుఱ్ఱాలు మొదలైనవి అన్నగారికి ఇచ్చేవాడు. రత్నాలను ఇచ్చినట్టే కవిరత్నాన్నీ ఇచ్చాడు" అని తన సమగ్రాంధ్ర సాహిత్యంలో ఆరుద్ర గారు చమత్కరించారు.

**నా తమ్ముడు మల్లరథినీనాథుండు నన్నాతత**
**శ్రీతోడన్ సముపేతు జేసి యెలమిం చేపట్టిమాకిచ్చుటం**
**చేతో మోదమెలర్ప రామకథమున్ చెప్పించి అత్యుత్తమ**
**ఖ్యాతిం బొందితి ఇంక నేను తనియన్ కావ్యామృతాస్వాదనన్॥**

– అని హరివంశకావ్యంలో ఎఱ్ఱన చెప్పియున్నాడు.

ఈ పద్యంవల్ల ఎఱ్ఱయ్య గారు రామాయణం సంపూర్ణంగా రచించినట్లు తెలుస్తున్నది. కాని ఆ రామాయణం ఇప్పుడు అలభ్యం. క్రీ.శ. 1756 ప్రాంతంలో జీవించిన కూచిమంచి తిమ్మకవి కాలం దాకా ఎఱ్ఱాప్రెగ్గడగారి రామాయణప్రతులు దేశంలో ఉండేవని తిమ్మకవి తన 'సర్వలక్షణసారసంగ్రహం' లో ఉదహరించిన పద్యాల వల్ల తెలుస్తోంది. అలా మల్లారెడ్డి గారి ద్వారా అద్దంకిలోని ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలోకి ఎఱ్ఱన ప్రవేశించాడు. ఎఱ్ఱన తన హరివంశ కావ్యాన్ని ప్రోలయవేమారెడ్డికి అంకితమిచ్చాడు.

**ఎఱ్ఱన మహాకవిరచనలు :**

**(1) అరణ్యపర్వశేషము :** ఎఱ్ఱన మహాభారతంలోని అరణ్య పర్వశేషము ను నన్నయ శైలితో ప్రారంభించి, తిక్కన శైలితో విరాటపర్వానికి సంధానిస్తూ అద్భుతంగా రచించాడు. అరణ్యపర్వశేషము 1595 గద్యపద్యాలతో అలరారే రమణీయరచన. ఇది మంచి ముత్యాల హారంలో నాయకమణివలె (మధ్యన ఉండు పతకము) ప్రకాశించుచున్నదని చింతలపూడి ఎల్లనార్యుడు ప్రశంసించాడు.

**(2) రామాయణము :** ఎఱ్ఱయ్యగారు రామాయణము సంపూర్ణముగా రచించినట్లు తెలియవచ్చుచున్నది. కానీ పూర్తి కావ్య మిప్పుడు అలభ్యము. ఛందోగ్రంధములలో కన్పించు 46 పద్యములే మనకు లభించిన ప్రబంధ పరమేశ్వరుని మహాప్రసాదము.

**(3) నృసింహ పురాణము :** ఇది నృసింహావతారకథ. అహోబల నరసింహస్వామి వారికి అంకితమీయబడిన 804 గద్యపద్యాలతో అలరారే మహాకావ్యమిది.

**(4) హరివంశము :** మహాభారత రచన అరణ్యపర్వశేషపూరణంతో పూర్తి కాలేదని తలంచి, హరివంశమును 4704 గద్యపద్యాలలో తెనిగించి భారతాన్ని మహాభారతం చేశారు ఎఱ్ఱయ్య గారు. మహాభారతాన్ని హరివంశం ఖిలపర్వం, అరణ్యపర్వ శేషమును పూరించుట మాత్రమే కాక హరివంశమును కూడా రచించి నందులకే ఎఱ్ఱన స్థానము కవిత్రయములో సుస్థిరమైనదని భావింపవచ్చు. హరివంశము ప్రోలయ వేమారెడ్డికి అంకితము. ఎఱ్ఱయ్య ప్రోలయవేమారెడ్డి ఆస్థానకవి.

ఎఱ్ఱాప్రెగ్గడ 'కవిసర్పగారుడము' అనే ఛందోగ్రంధము ను కూడా రచించినట్లు ఆనంద రంగరాట్ఛంధంలో ఉదాహృతమయిన పద్యాలను బట్టి తెలుస్తోంది. కాని ఆయన ఈ గ్రంథం రచించాడనడానికి సరి అయిన ఆధారాలేవీ లేవు.

**ఎఱ్ఱన గారి కాలం :**

సాహితీ విమర్శకులందరూ ఆమోదించిన ఆకరాల ప్రకారం ఎఱ్ఱన క్రీ.శ. 1280–1355 మధ్యకాలంలో జీవించియుండవచ్చునని ఊహించవచ్చు. కానీ ప్రోలయ వేమారెడ్డి తరువాత అద్దంకిలో అధికారమును చేపట్టి రాజధానిని కొండవీటికి మార్చిన అనపోతారెడ్డి రాజ్యకాలము (1353–1364) లో కూడా ఎఱ్ఱయ్యగారు జీవించి యున్నట్లు తోచుచున్నది. అనపోతారెడ్డి కొల్లూరు దానశాసనంలో ఆ రాజుతమ్ముడు అనవేమభూపతి 'యఱ్ఱయప్రెగ్గడ' గారికి కేసరపాటి యాభైపుట్ల చేను ధారపోసి కొల్లూరునే కలిపినట్లున్నది. ఈ కొల్లూరు గ్రామం తెనాలి తాలుకాలో ఉన్నది. ఈ కొల్లూరు తామ్ర శాసనము కాలము క్రీ.శ. 1364 వ సంవత్సరము అనగా ఎఱ్ఱయ్య గారు క్రీ.శ. 1364వరకు జీవించి యున్నట్లు భావించవచ్చు.

## ఎర్రయ్యగారి గుణగణాలు :

ఎర్రయ్యగారు గురుభక్తి పరాయణుడు 'శ్రీశంకరస్వామి సంయమీశ్వర చరణ సరోరుహ ధ్యానానంద సౌందర్య ధుర్యుడ'నని ఎర్రయ్య తన గురువైన శంకరస్వామిని గూర్చి సగర్వంగా చెప్పుకొన్నాడు. ఎర్రన శంభుదాసుడు. ఈతడు పరమేశ్వర చరణధ్యాన తత్పరుడైనప్పటికీ హరివంశము, నృసింహపురాణము, రామాయణము వంటి విష్ణుకథలను అత్యద్భుతంగా రచించిన అద్వైతి.

**నినునొల్లక నను జేరుట**
**నను మెచ్చక నిన్ను గొలుచు నరునకు నరకా**
**యనములుగ తెలుప హరిహర**
**వినిరూపణ తుల్యమతులు విభులే యెడలన్**

– అనగా శివదూషణము చేసిన విష్ణుభక్తుడును, విష్ణుదూషణము చేసిన శివభక్తుడునూ నరకప్రాప్తి నొందుదురని ఎర్రయ్య శివకేశవులకు అభేదమును నిరూపించినాడు.

**హరివంశం ప్రారంభంలో**
**'సకల భాషా కవిత్వ విశారదుడవు**
**సాధు సమ్మతుడవు, నిత్యసౌమ్యమతివి**
**భవ్యుడవు.......'**

– అని ప్రోలయ వేమారెడ్డి ఎర్రన గారికి సంభావించినట్లుగా నున్నది. అనితర సాధ్యమైన కవితా పాండిత్యములను కల్గియుండి కూడా, గర్వంలేకుండా ఉత్తముల చే సన్మానింపబడుతూ, సౌమ్యంగా అద్దంకిలో ఎర్రయ్యగారు వర్తించేవారని పై పద్యం వల్ల తెలుస్తుంది.
ఎర్రయ్య వినయ గుణ గరిష్ఠుడు. అందుకు ఈ పద్యం పరమసాక్ష్యం.
**మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మరా**
**యంచలు కూయ కౌంచమును నావల గూయగడంగుభంగి బ్రౌ**
**ఢాంచిత శబ్దసారులు మహాకవులాద్యులు కావ్యశయ్య గీ**
**లించిన కీర్తి సంగసుఖలీలకు నేను కాంక్ష జేసితిన్ ॥**

– తనకు పూర్వులయిన మహాకవుల వాక్కులు రాయంచల కూతలవలెనుండగా, తాను కూడా ఒక ప్రక్కన కొంగలాగా కూయడానికి ఉపక్రమిస్తున్నానని ఎంతో వినయంగా ఎర్రన నృసింహ పురాణ పీఠికలో విన్నవించుకున్నాడు.

## ఎర్రయ్య గారి కవితా శైలి :

**పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని శేవ**
**సూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు**

– అని శ్రీనాథుడు తన కవిత్వాన్ని గూర్చి చెప్పుకుంటూ ఎర్రయ్య గారిని ప్రస్తుతించాడు. అంటే నన్నయగారి కవిత్వంలో 'నానారుచిరార్థసూక్తి నిధిత్వము' లాగా, తిక్కన గారి కవిత్వంలో 'రసాభ్యుచిత బంధము' లాగా ఎర్రన కవిత్వంలో 'సూక్తి వైచిత్రి' ప్రస్ఫుటముగా కనిపిస్తుందని శ్రీనాథుని అభిప్రాయం. సూక్తి అనగా స్వభావోక్తి, వక్రోక్తి, రసోక్తి యను మూడు సూక్తి విభేదములను సమర్థవంతంగా రచించి నిర్వహించడం. ఈ పనిని ఎర్రన తన కావ్యాలలో విశేషంగా నిర్వహించాడు. ఎఱ్ఱాప్రెగ్గడ స్వభావ రమణీయములైన సహజ భావ చేష్టాదులను అద్భుతంగా తన కావ్యాములందు వర్ణించాడు. ఎర్రనగారి పురాణపాత్రలు సజీవములై నవ చైతన్యంతో మనముందు కదలాడతాయి.

ఎర్రన హరివంశంలో గోపికలు పెరుగుచిలికే సన్నివేశాన్ని ఎంత సహజసుందరంగా వర్ణించాడో చూడండి.

**వెన్న పెట్టెద మాడు మాయన్న. అన్న**
**మువ్వలును మొలగంటలు మొరయ ఆడు**
**అచ్యుతుడు గోపికలు తమ ఆత్మభ్రమసి**
**పెరుగు దరువను మరచి సంప్రీతి జూడ**

– మువ్వలు, మొలగంటలు మ్రోగుతూ ఉండగా ఆడే చిన్ని కృష్ణుని రూపం మనముందు కదలాడుతుంది. ఇంత వర్ణనలోనూ ఆడేది అచ్యుతుడని మరువబోడు మన ఎర్రయ్య. ఇలాగా శ్రీకృష్ణుని బాల్య క్రీడా వర్ణనం చేసే ప్రతి పద్యంలోనూ ఇతడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని మనకు ఎర్రయ్య గుర్తు చేస్తూ ఉంటాడు.

**సురలు దరువగ సుధాశీ**
**కరములు మెయి చిలుకునట్టి కల్యాణంబా**
**పురుషోత్తమునకు నొదవున్**
**తరుణీ నిర్మథనలగ్నదధి బిందువులన్॥**

క్షీరసాగర మధనం సందర్భంలో అమృతపు బిందువులు శ్రీ మహా విష్ణువుపై ఎట్లా చిందిపడ్డాయో అట్లే చిన్నికృష్ణుని పై గోపికలు చిలికే పెరుగు బిందువులు పడ్డాయని ఎంతో ముగ్ధమనోహరంగా వర్ణించారు ఎర్రన మహాకవి. ఎంతటి భక్తి పారవశ్యం. ఎంతటి సహజ కవితాతత్వం.

**కదలిన మొత్తుదు, ఎక్కడ**
**కదలెదవటు కరదులాడ కదలు సమ ఏజూ**
**చెదననుచుబోయి యిమ్ముల**
**ముదిత నిజకుటుంబ కార్యతత్పరయై ॥**

"కదులుచూద్దాం! కదిలితే మొత్తుతాను" అంటూ చిన్ని కృష్ణుణ్ణి అదిలించిన ఎర్రయ్య గారి యశోద అచ్చంగా తెలుగుతల్లి. బాలకృష్ణుడు తెలుగువాడు. ఎంతటి తెలుగుదనం.

రామరాజ్యమంటే ఏమిటో ఎర్రయ్యగారు వర్ణించారు చూడండి.

**మునులును సురలును వేడుక**
**మనుజులతో కలసిమెలసి మనుచుండుదురెం**
**దును, గుడువుడు, కట్టుడు, గొను**
**డను మాటలు వినవచ్చునఖిలక్షోణిన్॥**

రామరాజ్యంలో ఎక్కడ చూచినా 'తినండి', 'కట్టుకోండి', 'తీసుకోండి' అనే మాటలే వినబడేవనీ, దేవతలూ, ఋషులూ మనుషులతో కలసి మెలసి తిరిగేవారనీ రామరాజ్యాన్ని అందంగా వర్ణించాడు ఎర్రయ్య. అన్నార్తులు, బాధితులు లేనిదే రామరాజ్యం.

## తదనంతర కవులపై ఎర్రన ప్రభావం :

తాను బాల్యంలో నివసించిన గుడ్లూరులోని నీలకంఠేశ్వరస్వామి మీద ఎర్రయ్య గారు కొన్ని పద్యాలు చెప్పినట్టుంది. చాలా జటిలమైన సమాస కల్పనతో ఒక చాటువు కనబడుతుంది.

**నిను సేవించినగల్గు మానవులకున్ వీటీవధూటీఘటీ**
**ఘనకోటీశకటీ కటీతటిపటీ గంధేభావాటీపటీ**
**రనచటీ హారి కటీ సువర్ణమ కుటీ ప్రచ్ఛోటికాపేటికల్**
**కనదామ్నాయ మహాతురంగ! శివలింగా! నీలకంఠేశ్వరా!**

ఈ పద్యం అనంతర కవి అల్లసాని పెద్దన గారి ప్రఖ్యాత ఉత్పలమాలిక 'పూతమెరుంగులు' అనే దాని సంస్కృత భాగానికి (భారతీవధూటీ తపనీయ గర్భనికటీ ...) ఒరవడి పెట్టిందేమోనని ఆరుద్రగారి అభిప్రాయం.

ఎర్రనగారి ప్రభావం ఆంధ్రభాగవత కర్తయైన పోతన మహాకవిపై అపారం. ఎందుచేతనంటే హరివంశంలోనూ, నృసింహ పురాణంలోనూ భాగవత గాథలే ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఎర్రయ్యగారి భావాలను గైకొని పోతన మరింత సుందరంగా పద్య శిల్పాలను నిర్మించాడు. ఉదాహరణకు కాళీయమర్దన సన్నివేశాన్ని ఎర్రయ్య గారు వర్ణించిన తీరు చూడండి.

**యమునా వీచి మృదంగ వాద్యములు మ్రోయందీర గోపౌఘ హ**
**ర్ష మనోజ్ఞ ధ్వనితంబు గేయముగ జంచత్కాళియవ్యాళభో**
**గ మహారంగ తలంబునంబటుగతిం గంజాక్షు నిర్మర్దనా**
**ట్యము హృద్యాద్భుత భీమమై పరగ దివ్యశ్రేణి చూచెన్ దివిన్॥**

**ఇదే సందర్భాన్ని పోతన మహాకవి వర్ణిస్తూ**

**ఘనమయునానదీ కల్లోల ఘోషంబు**
**సరసమృదంగ ఘోషంబుగాగ**
**సాధు బృందావన చర చంచరీకగానంబు**
**గాయక సుగానంబుగాగ**
**కలహంస సారస కమనీయ మంజు శ**
**బ్దంబులు తాళశబ్దములు గాగ**
**దివి నుండి వీక్షించు దివిజగంధర్వాది**
**జనులు సభాసీన జనులు గాగ**
**పద్మరాగాది రత్న ప్రభాసమాన**
**మహిత కాళీయఫణిఫణామంటపమున**
**నళినలోచన విఖ్యాత నర్తకుండు**
**నిత్య నైపుణ్యమున నేర్చి నృత్యమాడె ॥**

– అని ఎర్రన గారి స్ఫూర్తితో రచించాడు. కృష్ణ శతకంలోని 'హరియనురెండక్షరములు' అనే ప్రసిద్ధమైన పద్యానికి ఎర్రయ్య గారి నృసింహ పురాణంలోని క్రింది పద్యమే ఆధారం.

**హరియను రెండక్కరములు**
**దొరకొన దీపోసగు జిహ్వాతుది నెవ్వని క**
**న్నరు డొక డిభ్యుడు భవసా**
**గర నిస్తరణ ప్రకార కౌశలమునకున్ ॥**

'కమలక్షునర్చించు కరములు కరములు' వంటి ప్రసిద్ధమైన పోతన గారి పద్యాలకు ఎర్రయ్య గారి పద్యాలే స్ఫూర్తి. అల్లసాని పెద్దనగారి ప్రసిద్ధపద్యం 'ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ' కు ఎర్రయ్య గారి అరణ్యపర్వంలోని క్రింది పద్యం స్ఫూర్తి.

**ఎవ్వరి దానవంబుజదళేక్షణ ఏకత మిట్టులేలనీ**
**వివ్వన భూమియందు జరించెదు నావుడు తండ్రి పంపునం**
**దివ్వన భూమియందు జరించెద సద్వరుగోరి కన్యనే**
**నెవ్వరి దానగావలయు నేర్పడ జెప్పుము రాజనందనా॥**

ఇట్లనేకమంది మహాకవులకు మార్గదర్శకుడై ఆంధ్రసాహితీ వినీలాకాశంలో ప్రకాశిస్తున్న ధృవతార మన ఎఱ్ఱాప్రెగ్గడ.

❄ ❄ ❄ ❄ ❄


అభినందనలతో...

**సందిరెడ్డి సాత్విక,** హైదరాబాద్
**నరిశెట్టి చాతుర్య,** బెంగుళూరు
**బోడెంపూడి మితున్‌సాయి,** చెన్నై

ప్రపంచవ్యాప్తంగా
తెలుగు పాఠకులకోసం
**ఇంటర్‌నెట్‌లో**
**"గుండ్లకమ్మ"**
www.gundlakamma.com
జాతీయ, అంతర్జాతీయ వార్తా
విశేషాలు మీముందు
ప్రత్యక్షమవుతాయి.

# ఎర్రన వర్ణించిన 'అద్దంకి సీమ'

డా॥ యు. దేవపాలన, రిటైర్డ్ ఆర్.జె.డి.

పండరంగని అద్దంకి శాసనము తెలుగు భాషలో ప్రథమ ఆంధ్ర భాషా శాసనమని జగద్విదితము. అయితే అద్దంకి సాహితీ చరిత్రకు ఆద్యుడు ఎర్రాప్రెగడ. ఈనాడు శాఖోపశాఖలుగ విస్తరించి ఊడలు దిగిన కవితా తరువునకు తల్లివేరు ఎర్రన. (1280-1364). వీరి జన్మస్థలం గుడ్లూరు. దీనికే నేత్రపురి అని కూడ నామాంతరం. తల్లిదండ్రులు పోతమాంబ, సూరనలు, ఎర్రనగారి పూర్వీకులది వేగినాటిలోని కాకరపర్తి అగ్రహారం. ఎర్రనగారి ప్రతిభా పాటవములను తెలిసికొనియున్న కందుకూరి సంస్థానాదీశుడు మల్లారెడ్డి ఆ కవిగారిని అద్దంకికి తీసుకొని వచ్చి తన అన్నగారైన ప్రోలయ వేమారెడ్డి ప్రభువునకు పరిచయం చేసి, క్రీ.శ.1325 సం॥లో ఆస్థాన ప్రవేశం కల్గించిననాడు.




నన్నయగారి కాలధర్మంతో అరణ్యంలో నిలచిపోయిన సాహితీ సరస్వతిని ఆ ప్రమాదం నుండి గట్టెక్కించి మహాభారత సమగ్రతను సాధించిన యశస్వి ఎర్రన. నన్నయగారి కధాకథన శైలిని, తిక్కన గారి నాటకీయ శైలిని ఆకళింపు చేసికొని ఈయన వర్ణనాత్మక శైలిని అనుసరించాడు. శబ్దగతిలో నన్నయను, భావగతిలో తిక్కనను ఆదర్శంగా తీసుకొన్నాడు. పై ఇద్దరు మహాకవులు రెండు మహాసముద్రాలైతే ఎర్రన జలసంధి లాంటివాడు. ఓ అమూల్య హారానికి రెండు పేటలు వారైతే, ఎర్రనగారు తరళమణివంటివాడు. ఎర్రాప్రెగ్గడ గర్వము లేనివాడు. తన అదృష్టం చేతనే ఆ మహాకవులిద్దరూ హరివంశమును వారు తనకు వదలిపెట్టివెళ్ళారని వారిద్దరూ రాజహంసలైతే, తానొక క్రౌంచపక్షినని నన్నయభట్టారకుడు ఆదికవి ఆయన రచనను కొనియాడాడు. మరియు తిక్కన కవిబ్రహ్మ అనియు ఆయనవలె ఎవరూ వ్రాయలేరని నిరూపించినాడని ప్రశంసించాడు. ఎర్రనకు శంభుదాసుడు, ప్రబంధపరమేశ్వరుడని బిరుదులున్నవి. అయినా ఆయన వ్రాసినవి వైష్ణవ రాతలే. ఆయన మొత్తం నాలుగు కావ్యాలను వ్రాశాడు. అందులో ఒకటి రామాయణం, రెండు హరివంశం, మూడు మహాభారత అరణ్యపర్వ శేషం, నాలుగు నృసింహపురాణం. మొదటి రెండు కావ్యాలను అద్దంకి ప్రోలయవేమారెడ్డి గారికి అంకితం చేశారు. అరణ్యపర్వశేషాన్ని నన్నయభట్టునుసరించి రాజరాజనరేంద్రునికి అంకితం చేశారు. నృసింహపురాణాన్ని అహోబిల నరసింహస్వామికి అంకితం చేశారు. ఆయన గ్రంథాలను పరిశీలిస్తే మహాభారతము, రామాయణము ఈయన చేతిలోనే పరిపూర్ణత చెందినట్లు అర్థమవుతుంది. ఈ విధంగా కూడా

నన్నయభట్టు, తిక్కనామాత్యులకు ఆయన కృతజ్ఞత చూపించారు.

కాకతీయుల పతనానంతరం కకావికలైపోయిన తెలుగు ప్రజల్ని మళ్ళా ఒక్క గొడుగు నీడకి తెచ్చిన కీర్తి విజయనగర ప్రభువులదే అయినా 13, 14 శతాబ్దుల్లో అద్దంకి సీమ కూడ తెలుగు సాంస్కృతిక వైభవానికి తనవంతు కృషి చేసిందనడంలో అతిశయోక్తి లేదు. హరివంశం పూర్వభాగం 1-23లో ఈ విధంగా

**"తనకు నద్దంకి తగు రాజధానిగ బ**
**రాక్రమంబున బహుభూములాక్రమించి**
**యనుజ తనుజ బాంధవ మిత్రజనులకిచ్చె**
**యెదురె యెవ్వారు వేమ భూమీశ్వరునకు"**

అటు పాలేరు నుండి ఇటు గుండ్లకమ్మ వరకు మళ్ళా ప్రాభవం వచ్చింది. ప్రజల కష్టాలను బాపే రాచరికం వచ్చింది. తటాకాలను త్రవ్వించి వ్యవసాయాన్ని వృద్ధి చేశారు. రెడ్డి సామ్రాజ్యం, సరిసంపదల గిడ్డి అయింది. కళల వ్యాప్తికి ప్రభువులు కృషి చేశారు. వసంతోత్సవాలు, వెన్నెలరాత్రులు, ఆటపాటలు, యక్షగానాలు, కోలాటాలతో గుండ్లకమ్మ తీరభూమి ఆనందతరంగితమైనంది. ఈ నేపథ్యం ఎర్రన కవిత్వానికి ప్రాణం పోసింది. రాజుల ప్రాపకంతో తన జీవితం వైభవంగా గడిచిపోతున్నా గ్రామీణ జీవన సహజత్వాన్ని, సహజీవన తత్వాన్ని, సరసత్వాన్ని మరువలేకపోయాడు. జనాన్ని మరచిన మనిషి, వనాన్ని విడిచిన పక్షితో సమానమని ఆయన ఉద్దేశ్యము. నిజానికి పల్లెజీవిత వర్ణనల్లో కవిబ్రహ్మని కూడ మించిపోయాడని పెద్దలంటారు.

ఎర్రనగారి జీవితంలోని రెండవ భాగం అతడు రాజాస్థానప్రవేశం చేసిన తరువాత ప్రారంభమవుతుంది. అదే అతని సాహిత్య జీవితం. తమ్ముడు తన కప్పజెప్పిన కవిని జూచి ప్రోలయవేమారెడ్డి ఒకనాడిలా అన్నట్లు హరివంశంలో ఉంది.

**"నా తమ్ముండు ఘనుండు**
**మల్లరథినీ నాథుండు నిన్నాతత**
**శ్రీ తోడన్ సముపేతుఁజేసి**
**యెలమిం జేపట్టి మాకిచ్చుటన్**
**జేతో మోదమెలర్ప**
**రామకథయున్ జెప్పించి యత్యుత్తమ**
**ఖ్యాతింజెందితి నింకల నేను**
**దనియన్ గావ్యామృతాస్వాదనన్"**
(హ.వం.పూ.భా 1-39)

ఎర్రాప్రెగడ తాను వ్రాసిన హరివంశాన్ని ప్రోలయవేమారెడ్డి గారికే అంకితమిచ్చారు. గుడికి గోపురం ఎద్దుకు మోపురం ఎంతటి నిండుతనాన్ని, గంభీరత్వాన్ని ఇస్తాయో మహాభారతానికి హరివంశం అలాంటిది. ఈ కావ్యం గుండ్లకమ్మ తీరాన, అద్దంకి గద్దెపై వ్రాయబడింది. పల్లెపట్టుల ప్రజా సంస్కృతికి నిగ్గుటద్దం లాంటిది. ఎర్రన పుట్టి పెరిగింది కందుకూరు సమీపంలోని గుడ్లూరు. అది ఒక పల్లెటూరు. అక్కడ నీలకంఠేశ్వర స్వామిని గురించి కూడా స్తుతించాడు. తరువాత అద్దంకిలో చాలా కాలం ఉన్నారు. కొంతకాలం చదలవాడ నివసించినట్లు తెలుస్తున్నది. ప్రోలయవేమారెడ్డి మరణించిన తరువాత (1153సం॥) ఆయన కుమారుడు అనపోతారెడ్డి ఎర్రన గారి జీవనభృతికై కొందరి బ్రాహ్మణులతో కలిపి కొల్లూరు సమీపంలో అగ్రహారం దానం చేసినట్లు కొల్లూరు శాసనం తెలుపుతున్నది. కాబట్టి ఆయనకు పట్టణవాసకంటే పల్లెటూరు జీవనం మీదనే పట్టెక్కువ. అందుకనే తన కావ్యాలలో ఏమాత్రం అవకాశం దొరికినా పల్లెటూరి జీవితాన్ని గురించి, వారి సాదకబాధకాల గురించి, వారి ఆటపాటల గురించి, వారి వ్యవసాయ మరియు ఇతర వృత్తుల గురించి తెలియపరచారు. ముఖ్యంగా మూలంలో లేని సందర్భాలు అతని ఉద్దేశ్యాన్ని గ్రహించడానికి మంచి ఆకరములు. అతనకున్న లోకానుభవాలను ఆయా కథల్లో అతికిపోయేటట్లు ఇమిడ్చినారు. ఈ పల్లెజీవితాలు మా అద్దంకి సీమవి అనుకోవడంలో ఒక ప్రాంతీయత, ఆత్మసంతృప్తి కలుగుతాయనడంలో ఆశ్చర్యం లేదు. కాలాలు మారినా, కథలు మారినా, తరాలు గడచినా అంతరాలు వచ్చినా ఒక జాతి సంస్కృతిలోని మౌలిక లక్షణాలు, మానవ స్వభావాలు ఒక్కసారిగా మాసిపోవని అర్థమౌతుంది. నేటి సామాజిక అధ్యయనానికి కూడా ఇవి ఎంతో ఉపయోగపడతాయి. హరివంశ కావ్యంలో కొన్ని ఉదాహరణలాన్ని తెలుసుకుందాం.

జన్మభూమిపై భక్తిభావం కలిగించ డానికి నందుడిలా పలికాడు.

**"వినుడు యాదవకుల వీరులందరు**
**నవధానంబుతోడ మద్వాక్యసరణిఁ**
**మనకు నివాస మిమ్మధుర,**
**యిప్పురిబోల పురిలేదు మనభూమిబోల భూమి**
**యెందును పుట్టదే, మిప్పురంబున**
**బుట్టి పెంపార వ్రేపల్లె పెరిగివచ్చి"**

"ఏదేశమేగినా... పొగడరా నీ తల్లి భూమి భారతిని" మన తల్లివంటి చల్లని తల్లిలేదు అనే రాయప్రోలు సుబ్బారావు గారి భావనకు పై పద్యం స్ఫూర్తిదాయకంగ కన్పిస్తుంది.

**వ్రేపల్లె నుండి బృందావనానికి బయలువెడలిన ప్రజల కోలాహలం**

**"బండ్ల మెట్టింపుపై బరువు లెక్కింపు**
**మీదళ్ళను, బూన్చు, కావళ్ళ నునుపు**
**వదిలంగా నేతివనటులు,**
**క్రొత్తగోనియల బియ్యము, వడ్లు నెమివడ్లు**
**నొదివిరి ప్రాలును, నొనరింగబోనె**
**చాపలు మంచములు మీద బలియగట్టు"**

ముదుసళ్ళవారి, గంగవోపులు ముందర కదలు ననుము అవిధంగ గిరిమఖానికి ఒక వేడుకలాగ బయలు దేరిన

జనుల జాగ్రత్తలు వర్ణింపబడ్డాయి. నేటికి కూడా తిరునాళ్ళ సమయాల్లో కాని, వేడుక సమయాల్లో కాని, బండ్లు కట్టుకొని ఊరంతా కదిలినప్పుడు గ్రామపెద్ద చిన్నలకు, పెద్దలకు కొన్నిజాగ్రత్తలు చెప్పడం మనం గమనిస్తూనే ఉంటాం.

ఆనాటి వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తి సాధనాలు ఇలా తెలుపబడ్డాయి.

గుద్దండ్లనుం బెద్ద గునపంబులను గోట
**యొండొంద త్రవ్వుట నుక్కుటులు**
**రాకట్టనపుటెడల్ గైకొని నఖకుట**
**యొనరు దంచనములు నొడిసెలును**
**అంతేగాక కోడెలను కొండ్రకు**

వశంబు చేయుట, ముక్కు తాళ్ళు కుట్టుట, అప్పుడే పుట్టిన దూడలకు తల్లి చేపులను ఎరిగించుట పేర్కొనబడినవి.

వర్షాగమన వేళావిశేషములు తెలిసిన పెద్దకాపు ఎఱ్ఱన. వానకి తడిసే మట్టి వాసనను గుండెల నిండుగ పీల్చుకున్న పల్లెటూరి రైతు ఈ కైతలరాయుడు. అందుచేతనే ఇలా వ్రాయగలిగాడు.

**''శివదిక్కునందు వేకువగోల మెఱుగులు మెఱసె**

**నచ్చేనసవవీరుణుండు**

**యీగ మిక్కుటమయ్యె, నెఱనింగి గదులంచె నిడుదలై తిలకించె నీరుకాళ్ళు**

**అంబరంబున బర్వెనాగడపలు"**

అదేవిధంగా తెల్లవారే సమయాన్ని ఎంతో సహజంగ వర్ణించినాడు. నేటికీ వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు ప్రకృతిలో వచ్చే మార్పుల్ని బేరీజు వేసుకుంటే ఎఱ్ఱన వర్ణనలు ఆనందం కలిగిస్తాయి. ముఖ్యంగా రైతులకు వర్షసూచనలు ఎంత హర్షాన్ని కలిగిస్తాయో నేటికినీ మనం గమనిస్తాం.

సుమారు 700 ఏళ్ళ క్రితం ఆనాటి ఆంధ్రప్రాంతంలో చిన్న పిల్లలు ఆడుకొనే ఆటలు, అందున ఆడపిల్లలు, మగపిల్లలు ఆడుకొనే ఆటలు, సుమారు వందకు పైగా ఉన్నట్లు చరిత్ర చెబుతున్నవి. ఇప్పటికి ఆటలన్నీ మరుగున పడిపోతున్నాయి. బాలకృష్ణుని క్రీడల వర్ణనలు అందంగా వర్ణించబడ్డాయి. కాళింది మడుగులో ఉన్న సర్పం మీద కృష్ణుడు నాట్యం చేయు సందర్భంలో అతను ఆ మడుగులో దూకే విధానాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. యశోదమ్మ చిన్ని కృష్ణునికి వెన్నె తినిపిస్తున్న విధానం

బాలకృష్ణుని క్రీడల వర్ణనలు ఆనాటి పిల్లల ఆటలకు ప్రతిబింబాలే. యశోద చిన్న కృష్ణునికి

''ముదముతో గడ్డునకు బెట్టి మూతిజిడ్డు వెామునను వేన చమరి, యమ్ముదితయక్కు గలయనిమిరి, యేనుగు దిన్న వెలగపండు నాగనొప్పు కృష్ణుడు సాశ్రు నయనుడగుచు" అంతేగాక గోపికలు ఓ చిన్న కృష్ణా వెన్నపెడతాము అనగానే

**"వెన్నబెట్టిదనాడు మాయన్న, యన్న మువ్వలును మొలగంటలు మొరయనాడు"**

చిన్నపిల్లల మనస్తత్త్వాన్ని హృద్యంగ వర్ణించాడు.

ప్రయాణాల్లో చినికృష్ణుని ఎంత జాగ్రత్తగ తీసుకెళ్తున్నారో దర్శించండి.

**"పురటిపాపని తొట్టెలో పొందుగా పెట్టి మోపించుకొని"**

పిల్లవాడు కన్పించకపోయేసరికి నందుడు యశోదను గద్దిస్తాడు. అప్పుడు ఆయమ్మ భయం భయంగ

"కడుపు నిండగ జన్నిచ్చి కొడుకు నిద్ర

**పోవ దీవియ మండంగ బ్రొద్దుపోవు**

**నందాక మేల్కని యుండి, యలసి**

**కన్నొకింత మూసితి యాలస్యమేది**

యిందు" అని సమాధానమిస్తుంది.

పూతనను చంపిన తర్వాత బిడ్డకు ఎక్కడ దిష్టి తగిలి అరిష్టాలొస్తాయోనని నందుడు రక్షాతిలకము దిద్దినాడట. ఇది ఆనాటి నమ్మకాన్ని తెలియపరుస్తుంది. ఇప్పటికీ బిడ్డలకు ఆయుష్షు, ఆరోగ్యం కలగడానికి తాయత్తులు కట్టించడం గమనిస్తూనే ఉంటాము.

బాలకృష్ణునితో వేగలేక గోపికలు కదలివచ్చి "ఏ పొలములు పాడయ్యెనె, యీ పల్లెకు చిచ్చుబెట్టి యేగెదమేమున్" అని యశోదమ్మతో నిష్ఠూరములు పలుకుట ఇప్పటికిని మారని గ్రామీణుల స్త్రీల మనస్తత్త్వానికి మచ్చుతునకవంటిది.

హరివంశంలో ఆనాటి స్త్రీల ఆభరణ విశేషాలు చక్కగ తెలుపబడినవి. ముఖ్యంగ దర్పణం (అద్దంబు) వాడుక కన్పిస్తుంది. స్త్రీలతో సమానంగా పురుషులుకూడా ఎన్నో ఆభరణాలు ధరించినట్లు తెలుస్తున్నది. పురుషులు నిడుపాటి తమ కేశములను ముడివేసుకున్నట్లు కొందరైతే జులపాలుగా తిరిగినట్లు ఈ కథలో సూచించబడింది.

పురుషుని మనసును తమవైపు త్రిప్పుకొను మరులమందుల ప్రస్తావన ద్రౌపది, సత్యభామల సంభాషణలో తెలుస్తుంది.

పేదరికంతో పాటు, సంతోషం కూడా ఉండకపోదు. వేడుక సమయాలు, పండుగలు పబ్బాలురాకపోవు. శ్రమజీవులు, పండుగ సమయాల్లో ఎంతో ఉల్లాసంగా గడిపేవారు. మధుపానసేవన, విహారయాత్రలు, రాసక్రీడలు ఆనాటి శృంగార జీవితాన్ని పట్టిస్తాయి. మణిదీపాల కాంతులు, గుర్రాల తేరులు ఆనాటి ప్రజల విలాస జీవితానికి దర్పణాలు. సాహిత్యంతో పాటు, సంగీతం, శిల్పము, చిత్రలేఖనము కూడా విరామకళలుగ విరాజిల్లాయి. ముసురుపట్టిన సమయాల్లో పేదకాపులు, ఇంకా దిగువస్థాయి దీనులు, ఎంత దుర్భరంగా జీవితం గడిపారో వర్షాలలో తడుస్తూ నెమరువేయడం కూడా మానివేసి హృదయవిదారకంగా గోగణాలు నిలబడ్డాయో ఈ హరివంశంలో

పేదవారైన గోపకులు వర్షాకాలంలో పడే తిప్పలు, పశుగణానికి వచ్చే రుగ్మతలు పేర్కొనబడ్డాయి. పొలము కాసే కాపరుల వేషం కళ్ళకు కట్టినట్టు వర్ణింపబడింది.

శుభాశుభదినాలు, నమ్మకాలు, శకునాలు పాటించబడేవి. వైశాఖ శుద్ధద్వాదశి మిక్కలి శుభమనే నమ్మకం.

ఎఱ్ఱనగారు వాడిన సామెతలు జాతీయాలు కథా సందర్భములకు లక్కకు బంగారం అతికినట్లుంటాయి. తెలుగు భాషా సౌందర్యాన్ని నేటికినీ తెలుపుతుంటాయి. సముద్రమంత వారి కవిత్వానికి ఈ రచన చిన్న గవ్వ మాత్రమే. అద్దంకి సీమను కవితామయం చేసి హరివంశపు అందలమెక్కించిన ఎఱ్ఱాప్రెగడ మహాకవికి మనఃపూర్వక నివాళి.

❄ ❄ ❄ ❄ ❄

# ఒక్కసారి మోగిస్తే 108 సార్లు ఓంకార నాదం



**కొల్లూరి సత్యనారాయణ,**
ఇంకొల్లు, 94920 32302

సాధారణంగా మనం ఏ గుడిలోకి వెళ్ళి గంట మోగించినా అది రెండు లేదా మూడు పర్యాయాలు మాత్రమే ప్రతిధ్వనించి ఆగిపోతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే కేవలం కొద్దిమందికి మాత్రమే తెలిసిన విషయం మరొకటి ఉంది. అదేమిటో తెలుసా. ప్రకాశం జిల్లా, చినగంజాం మండలం, సంతరావూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికో ప్రత్యేకత, విశిష్టత ఉంది. అదేమిటంటే ఈ ఆలయంలోని గంట ఒక పర్యాం మోగిస్తే అది 108 సార్లు ఓంకార నాదాన్ని ప్రతిధ్వనిస్తుంది. నమ్మలేకపోతే మీరూ వెళ్ళి ఒకసారి ప్రయత్నించి చూడండి మరి. సాధారణంగా మనం ఏ గుడిలోకి వెళ్ళి గంట మోగించినా అది రెండు లేదా మూడు పర్యాయాలు మాత్రమే ప్రతిధ్వనించి ఆగిపోతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే కేవలం కొద్దిమందికి మాత్రమే తెలిసిన విషయం మరొకటి ఉంది. అదేమిటో తెలుసా. ప్రకాశం జిల్లా, చినగంజాం మండలం, సంతరావూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికో ప్రత్యేకత, విశిష్టత ఉంది. అదేమిటంటే ఈ ఆలయంలోని గంట ఒక పర్యాం మోగిస్తే అది 108 సార్లు ఓంకార నాదాన్ని ప్రతిధ్వనిస్తుంది. నమ్మలేకపోతే మీరూ వెళ్ళి ఒకసారి ప్రయత్నించి చూడండి మరి.



ఉత్తరాదిన అంటే ఉత్తరప్రదేశ్‌లోని కాశి, దక్షిణాదిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఒక పోలిక ఉంది. రెండు ఆలయాల్లోని గంటలను తయారుచేసింది ఒక వ్యక్తే కావడం గమనార్హం. ఆలయ చరిత్ర తెలుసుకుందాం. 12వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని చోళరాజులు నిర్మించారు. అమరావతి మొదలుకొని తిరుపతి పట్టణం వరకూ అప్పట్లో చోళరాజుల ఆధీనంలో ఉండేది. చోళ రాజులు తమ హయాంలో ఎన్నెన్నో ఆలయాలను నిర్మించారు. అమరావతిలోని వాయులింగం శ్రీశైలం మాదిరిగానే స్వయంభువు. ఇక చినగంజాంలోని రామలింగేశ్వరస్వామి విగ్రహం కూడా స్వయంభువే. ఆనాటి రాజైన వాసిరెడ్డి జమీందార్ వరప్రసాద్ ఈ ఆలయాన్ని నిర్మించారని చారిత్రక కథనం. అమరావతిలో చాముండేశ్వరి, సంతరావూరులో గంగాసమేత పార్వతి అమ్మవార్ల విగ్రహాలు ఉంటాయి. ఆనాటి శిల్పకారులు వీటిని తీర్చిదిద్దారు. వివిధ శివాలయాల కోసం మొత్తం నందులను చెక్కారు. ప్రస్తుతం ఈ ఆలయంలో రెండు నందులు మాత్రమే ఉన్నాయి. అన్ని శివాలయాలకు ఈ శివాలయానికి మరో రెండు ప్రత్యేక తేడాలు ఉన్నాయి. రెండు నందులు ఉండడం ఒకటైతే రెండోది గర్భగుడిలో వెలిగించిన దీపాన్ని ఆలయం బయటి నుంచి కూడా చూడగలగడం. ఈ ఆలయ శిల్పకళా నైపుణ్యం అత్యద్భుతం. ఈ ఆలయ శిల్పకళా నైపుణ్యం గురించి నెల్లూరు పట్టణంలో ఉన్న శివాలయంలో ఒక శాసనం కూడా ఉంది.

ఇక గంగామాత విగ్రహాన్ని ఇద్దరు శిల్పులు చెక్కారు. ఇందుకు సంబంధించి ఒక చారిత్రక కథనం ఉంది. అదేమిటంటే ఈ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని చెక్కేందుకు గాను రాజుగారి అనుమతి పొందిన ఒక శిల్పకారుడు అమ్మవారి విగ్రహాన్ని రూపొందించేందుకు ఒక మహిళను తన వెంట తీసుకొస్తాడు. అమ్మవారి విగ్రహాన్ని చెక్కేందుకు కొంత సమయం పడుతుందని, తాము ఇరువురం లోపలకి వెళ్ళి గడి పెట్టుకుంటామని, తాము పిలిచేదాకా తలుపు తీయవద్దని గ్రామస్తులకు చెబుతారు. అందుకు స్థానికులు సరేనంటారు. ఆ తరువాత ఇద్దరు ఆలయంలోకి వెళ్ళి అమ్మవారి విగ్రహాన్ని చెక్కే పనిలో నిమగ్నమవుతారు. సదరు మహిళను తిలకిస్తూ శిల్పి తన పనిని ప్రారంభిస్తాడు. ఆ తరువాత 50 రోజులు గడిచిపోయినా వారు బయటకి రారు. దీంతో గ్రామస్తులకు అనుమానం కలుగుతుంది. అసలు వీళ్లింకా బ్రతికే ఉన్నారా అనే సంశయం వస్తుంది. దీంతో తలుపు తెరచి చూడగా వారిద్దరూ విగతజీవులై కనిపిస్తారు. వాస్తవానికి సదరు శిల్పి ముందుగానే చెబుతాడు. తమ అనుమతి లేకుండా తలుపు తీస్తే చేటు జరుగుతుందని హెచ్చరిస్తాడు. అయినా గ్రామస్తులు తలుపులు తీయడంతో



వారిరువుకీ మోక్షం ప్రాప్తిస్తుంది. అయితే అప్పటికి శిల్పి అమ్మవారి విగ్రహాన్ని పాదాల వరకే చెక్కుతాడు. ఆ పని అంతవరకే ఆగిపోయింది. ఆ తరువాత చోళరాజులు మరో శిల్పితో మిగతా పనులు పూర్తి చేయించారు. ఇక్కడి రామలింగేశ్వరుడిని 50 రోజులపాటు పూజిస్తే మోక్షం పొందుతారని ప్రతీతి. చిలుకూరి వెంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసిన మాదిరిగానే ఈ ఆలయం చుట్టూ  కూడా 108 ప్రదక్షిణలు చేసినట్లయితే అనుకున్న కోరికలు తీరతాయి.

సంతానప్రాప్తి కలుగుతుంది. ఈ ఆలయంలో గంటను ఒక పర్యాయం మోగిస్తే 108 పర్యాయాలు ఓంకార నాదం ప్రతిధ్వనిస్తుంది. ఈ ప్రత్యేకత ఈ ఆలయానికే పరిమితం.

**సంత జరుగుతున్నందువల్లనే సంతరావూరు**

సంతరావూరుకు ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసా. ఒకప్పుడు ఈ ఊరి పేరు కేవలం రావూరు మాత్రమే. అయితే బకింగ్‌హాం కాలువలో పడవల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కొంతమంది వారం వారం సరుకులు విక్రయించేవారు. ఇందుకోసం వారం వారం ఒక సంత జరిగేది. అందువల్లనే ఈ ఊరికి సంతరావూరు అని పేరు వచ్చింది. ఒకనాడు వరి పంటతో కళకళలాడిన ఈ ప్రాంతం ఇప్పుడు సరిగా నీరు అందని కారణంగా మెట్ల పంటలకే రైతాంగం మొగ్గుచూపుతున్నారు. దీంతో ఇప్పుడు ఒకనాటి పచ్చదనం కనిపించడం లేదు. శనగ తదితర వాణిజ్య పంటలకే రైతాంగం మొగ్గుచుపుతున్నారు. ఇక్కడికి ఏడు కిలోమీటర్ల దూరంలో వాడరేవు (ఒకనాటి ఓడరేవు) వద్ద కార్తీక మాసంలో స్థానికులు సముద్రస్నానం చేస్తారు. ఇలా సముద్రస్నానం చేస్తే తమ పాపాలు హరించిపోతాయనేది వారి ప్రగాఢ విశ్వాసం. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో గంట నిజంగా ఓంకార నాదం పలుకుతుందా అనే సందేహం కలిగితే మీరే మోగించండి మరి.

**కార్తీకమాసంలో శివుని విగ్రహం వద్దకు పాము**

కార్తీకమాసంలో రామలింగేశ్వర స్వామి విగ్రహం వద్దకు ప్రతి ఏడాది భారీ పాము వస్తుంది. విగ్రహాన్ని చుట్టుకుని పడుకుంటుంది. అయితే ఎవరినీ ఏమీ అనదు. ఈ మాసం దాటిపోగానే వెళ్లిపోతుంది. ఇక్కడి శివుడు అత్యంత మహిమాన్వితుడు. ఇక్కడ పూజలు చేయించుకుంటే సర్వపాపాలు పోతాయి. సర్వరోగాలు నశిస్తాయి. కార్తీకమాసంలో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తుల కోరికలు నెరవేరతాయి. సర్వం కార్యరూపం ధరిస్తుంది.

❄ ❄ ❄ ❄ ❄





# అద్దంకి సీమ - సాంస్కృతిక వికాసం



- డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు,
ప్రిన్సిపల్

**'పాకనాటి సీమ'గా అలనాడు ప్రసిద్ధికెక్కిన ఈ అద్దంకి సీమ సాంస్కృతిక అభ్యుదయ వికాసాలను రేఖామాత్రంగా చెప్పడం ఈ వ్యాసంలో ప్రధాన విషయం. ఒక ప్రాంతమంటూ మనం చెప్పుకోవడం కేవలం అధ్యయన సౌకర్యార్థమే గాని వేరే కాదు. ఈ గడ్డ మీద పుట్టినఅన్ని సంస్కృతిలో భాగాలు మాత్రమే. చెంగుదీసి పంచగట్టినా, భుజాన ఉత్తరీయం వేళ్ళాడినా, జారిన పైట కొంగును జఘనం చుట్టి తెచ్చి కుచ్చిళ్ళలో దోపుకున్నా అది భారతీయ వస్త్రధారణకున్న జాణతనం. మన నాగరికతలో చోటుచుసుకున్న నెరజాణతనం. ప్రాంతం మారితే పరిమళంలో రవంత వ్యత్యాసముండవచ్చునేమో గానీ ప్రారంభంగాని, ఫలితంగాని వేరుకాదు.**

**"లోకహితం మమకరదీయమ్" "అహింసో పరమో ధరఃమః", "సత్యం భూయాత్ ప్రియం బ్రూయత్' వంటి ప్రాతఃస్మరణీయ ధ్యేయ వాక్యాలు భారతీయ సంస్కృతికి మూలసూత్రాలు.** ఈ సూత్రాలను సూత్రంగా స్వీకరించే భారతీయ సాంస్కృతిక వికాసం అన్ని ప్రాంతాలలోను సమాంతరంగా అభివృద్ధి పొందుతూ వచ్చింది. స్వావలంబన, స్వాభిమానం, స్వాతంత్ర్యము అనేమూడు పాయల జడ మన సంస్కృతి. ఈ జడను ముడుచుకనే తీరులోని వేరు సొగసులే భారతదేశంలో వివిధ ప్రాంతంలో వైవిధ్యంతో కనిపించే సంస్కృతీ వికాసాలు. అలాంటి వందలాది రూపాలు భారతీయ సంస్కృతిలో భాగంగానే వికసించాయి. 'భిన్నత్వంలో ఏకత్వం' అంతఃస్సూత్రంగానే పరిమళించాయి.

తేనెకు తీయదనాన్ని పంచగల మాధుర్యం మన తెలుగు భాషకుంది. సూర్యుడికి సైతం అతిధ్యం ఇవ్వగల మమకారం మన తెలుగు సంస్కృతికుంది. అందులో మన ప్రాంతం తెలుగు నేలకు హృదయపీఠం కావడం చేతనేమో అన్నిటా అగ్రగామిగా నిలుస్తుంది. ఆమాటకొస్తే అసలు మానవ జీవనాన్ని సక్రమంగా నడిపేది సంస్కృతి. వ్యఇకత& సంస్కారవంతుడై తనదైన ఒక ప్రత్యేక సంస్కృతిని ఏర్పరచుకుంటాడు. ఒక సమాజం యొుక్క సంస్కృతి ఆ సామాజంలోని సంస్కారవంతుడైన ప్రజల అభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది. నిజానికి సంస్కృతి అంటే సంస్కారము అని నిఘంటువు చెబుతుంది. అలాగే సంస్కారము అంటే సంకల్పము, చక్కబరుచుట, శిక్ష, శిక్షణ, శృంగారించుట, వండుట, సమర్పించుట, ముద్ర, భావము, సంకల్పము, శక్తి, సామర్థ్యము, మతకర్మలు అని అర్థాలు కనిపిస్తాయి. ఇక పూర్వ ఋషి ప్రోక్తమైన దశదిశ సంస్కారాలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ ప్రభావితం చేసే జీవన కర్మలన్నీ సంస్కృతి క్రిందకే వస్తాయి.

'పాకనాడు'గా ప్రసిద్ధమైన ఈ ప్రాంతంలో గుళ్ళకమ్మ జీవనది. గోదావరి నీళ్ళు తగిలితే సాహిత్యం వస్తుందని, కావేరి నీళ్ళు తాగితే సంగీతం సిద్ధిస్తుందని పెద్దలంటారు. మరి నా గుళ్ళకమ్మ నీళ్ళు తగిలితే సంగీతానికి, సాహిత్యానికి కూడా తరుగులేదు. భారతీయ సాంస్కృతిక వికాసానికి మూల సూత్రాలయిన ఐతిహాసిక సంప్రదాయ వైభవం, మధ్యయుగ మతరాజకీయ జీవనం, నూతన చైతన్య పథగామి అయిన ఆధునిక యుగ ప్రాభవం మన ప్రాంత సాంస్కృతిక జీవనానికి కూడా మూల సూత్రంగా నిలిచాయని చెప్పవచ్చు.

1970 ఫిబ్రవరి 2వ తేదీన కర్నూలు జిల్లా నుంచి మార్కాపూర్ డివిజన్, గుంటూరు జిల్లా నుంచి ఒంగోలు డివిజన్, నెల్లూరు జిల్లా నుంచి కందుకూరు డివిజన్ కలిపి ఒంగోలు కేంద్రంగా ఈ జిల్లా ఏర్పడింది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం గారి పేరు ఈ జిల్లా కు పెట్టారు.

గుళ్ళకమ్మ పరీవాహక ప్రాంతం ఈ జిల్లాలో ప్రధానభూభాగం. అద్దంకి రెడ్డిరాజులు

అనువమాన సాంస్కృతిక వికాసంతో ప్రజాపాలన సాగించిన చారిత్రాత్మక సీమ నా సీమ. ఇంకా మూసీనది, మన్నేరు, పాలేరు ఈ జిల్లాలో జీవనదులు.

ఒక ప్రాంత సాంస్కృతిక వికాసానికి అక్కడి రాచరిక చరిత్రకి, పాలనా వ్యవస్థకి ఎంతో సంబంధం కనిపిస్తుంది. మన జిల్లా చారిత్రక స్థితిగతులు సమీక్షిస్తే తొలి ఆంధ్ర రాజులైన శాతవాహన రాజుల్లో యజ్ఞశ్రీ శాతకర్ణి పోగిప్రోలు వరకూ అంటే ఇప్పటి ఒంగోలు వరకు పాలించినట్లు చినగంజాంలో లభించిన ఇత్తడి శాసనం వలనతెలుస్తోంది. తరువాత ఈ ప్రాంతం విష్ణుకుండినులు, పల్లవ రాజుల ఆధీనంలో ఉంది. అలాగే చాళుక్య చోళులు, కాకతీయ రాజులు, అద్దంకి, కొండవీటి రెడ్డి రాజులు, గోలుకొండ నవాబులు, బ్రిటీషువారు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఈ వరుసలోని ఆయా రాజవంశాల పాలన, పోషణ, అభిరుచులు, అవసరాలు, అలవాట్లు ఇక్కడి సాంస్కృతిక జీవనానికి ఆధారంగా నిలిచాయి. అలాగే ఈ ప్రాంత ప్రజల వ్యక్తిత్వ జీవనాలు, ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలు, ఆటపాటలు, మతాలు, మార్గాలు, పండుగలు, పబ్బాలు, ఉత్తేజాలు, ఉద్యమాలు అన్నీ సాంస్కృతిక వికాసంలో భాగాలే. అలాగే జాతి జీవనంలో మమేకమైసాగే జానపదకళలు ఆ జాతి జీవన వికాసానికి దర్పనం. ఉన్న పరిధిలోనే భిన్న వికాసాలకు చెందిన మౌలిక సంప్రదాయకర్తలను స్మరించకపోతే వ్యాసం వట్టిక ప్రాయంవౌతుంది. అందుకే రేఖామాత్రంగా స్పర్శిస్తున్నాను.

మొదట సాహితీ సౌగంధాన్ని గురించి చెప్పాలి. కాని మన ప్రాంతంలో సాగిన సాహిత్య వికాసాన్ని ప్రత్యేక వ్యాసంలో చెప్పడం జరుగుతుంది గనుక ఇక్కడ స్పృశించడం లేదు.

ప్రకాశం జిల్లాలో ప్రకాశించిన మరో కళ సంగీతం. కర్ణాటక సంగీ మూర్తిత్రయంలో ముఖ్యులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి పూర్వీకులు గుళ్ళకమ్మ ప్రాంతం వారే. కంభం శ్యామశాస్త్రి వంశీకుల నివాసమైతే ఆ సమీపంలోని కాకర్ల త్యాగయ్య పూర్వీకుల స్వగ్రామం. వారి సంప్రదాయాలకు అనుయాయులైన తాడిగడప శేషయ్య, ధేనువకొండ సుబ్బారావు, అద్దంకి వెంకటరాయుడు, ఓగిరాల వీరరాఘవశర్మ వంటి వారెందరో గాయకులు మనవారే.

ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా అభివృద్ధి చెందిన మరో సంగీత శాఖ మంగళ వాద్యం. ఖండాంతర ఖ్యాతి పొందిన నాదస్వర విధ్వాంసుడు షేక్ చిన్నమౌలానా ఒంగోలు సమీపంలోని కరవది నివాసి. అలాగే ఈనాడు దేశంలో అగ్రస్థానంలో నిలిచిన మహబూబ్ సుభానీ, కాలీషాబీ మహబూబ్ దంపతులు, ఒంగోలు రంగయ్య మన ప్రాంతీయులే. ఈమని రాఘవయ్య, భూసురపల్లి ఆదిశేషయ్య, నిడమానూరి లక్ష్మీనారాయణ ఈ వ్యాసకారుడు డోలు వాద్యంలో, ఘటవాద్యంలో కూడా లబ్ధప్రతిష్టుడు. ఈ జిల్లాలో అభివృద్ధి చెందిన మరొక కళ తరంగ కాలక్షేపం. సంస్కృతంలో కృష్ణలీలాతరంగిణి రచించిన అభినవ జయదేవుడు యతినారాయణ తీర్థులు, తీర్థులవారు పరిణామశూల వ్యాధికి గురై అద్దంకికి సమీపంలోని శింగరగిరి క్షేత్రంలో నృసింహస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తూ గుళ్ళకమ్మ తీరంలో తపస్సు నాచరించినట్లు తన శృతిలో గాథలే కాదు, మయూరుని సూర్యశతక కల్పవల్లీ వ్యాఖ్యానకర్త తగిన ఆధారాలతో గ్రంథస్థము చేశాడు.

మన జిల్లాలో సమాహార కళారూపమైన హరికథకు మంచి ప్రాధాన్యత కనిపిస్తుంది. ఆదిభట్లవారి శిష్యులు జవంగుల యల్లమందదాసు, కందుకూరు వాసి అయిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, ఈపురుపాలెం ఉమాకాంతం, బెజవాడ నగరాజకుమారి, దాసరి భిక్షాపతి వంటి ఎందరో ప్రముఖులు మన జిల్లా వాసులు. హరికథా కాలక్షేపంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన వీరగంధం వెంకటసుబ్బారావు, కోట సచ్చిదానందశాస్త్రి మన జిల్లావారే.

బుర్రకథా కళారూపానికొక మరూపం తెచ్చి భావితరాలకందించిన మహనీయుడు దొడ్డవరపు వెంకటస్వామి. ఈయన్ని గురించి చెబుతూ ''ఇంతటి మహనీయుడు ఈ యుగంలో పుట్టడు" అంటాడు నాజర్. ఈ యుగంలో పుట్టడు" అంటాడు నాజర్. ఈ యుగంలో కూడా అనేకమంది బుర్రకథా కళాకారులున్నారు. శారద, పందిళ్ళపల్లికృష్ణమూర్తి వంటి వారు ముఖ్యులు. ఈ తరంలో అంతగా లేకపోయినా వీధి నాటకాలు, పగటి వేషాలు కూడా ప్రకాశం జిల్లాలో గొప్పగానే రాణించాయి. ఈ రంగాల్లో తనంతవాడు తానే అనిపించుకున్న కళాకారుడు తమ్మారపు వెంకటస్వామి. పిచ్చి గుంటలు, బైనీడివారు,చెక్కభజనలు, గంగిరెద్దుల వాళ్ళు కూడా అక్కడక్కడా కనిపిస్తారు.

ఇక నాటక రంగానికొస్తే నాటి మహానటులు సి.యన్.ఆర్.గా ప్రసిద్ధిపొందిన చిలకపాటి రామాంజనేయులు, అద్దంకి శ్రీరామమూర్తి, ప్రకాశం పంతులు, ఇమ్మానేని హనుమంతరావు నాయుడు, బండారు రామారావు, మాణిక్యరావు, యర్రగుంట అక్కయ్య, చెంచురామారావు మన జిల్లావారు. నేటి మేటి నటులు డి.వి.సుబ్బారావు, వి.వి.స్వామి, కామిక్ సుబ్బయ్య వంటి వారు ఎందరో ఉన్నారు. ఇంకా చీమకుర్తి నాగేశ్వరరావు, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, వృధ్వి వెంకటేశ్వరరావు, పుట్టంరాజు శంకరరావు, మిరియాల వెంకటేశ్వర్లు, సాబ్జాన్ మొదలగువారు ప్రసిద్ధులు. సాంఘిక నాటకాల్లో మనజిల్లా అగ్రస్థానమంటే అతిశయోక్తి కాదు. మొక్కపాటి కృష్ణమోహన్, కరవది రంగారావు, సుబ్బారాయుడు, సుశీల జిల్లాలో సాంఘిక నాటకాలకొక ఊపు, రూపు తెచ్చారు. ఎమ్.వి.యస్. హరనాధ రావు, ఇసకపల్లి మోహనరావు, వి.యస్.కామేశ్వరరావు, పాటిబండ్ల ఆనందరావు ఈనాటి మంచి నాటక రచయితలు. నేడు నాటక రంగంలో సంచలనం సృష్టించిన 'పడమటి గాలి' నాటకం పాటిబండ్ల ఆనందరావుది.

ఈనాటి నటుల్లో నల్లూరి వెంకటేశ్వర్లు, టి. కృష్ణ, రాజశేఖర్,మార్కాపురం ఎర్రయ్య,బీనిడి కృష్ణయ్య, గురుమూర్తి, ఆర్.కె. కఠారి, హేమలత, రత్నకుమారి మొదలైన వారెందరినో చెప్పవచ్చు.

అలాగే సినిమా రంగంలో కూడా మన జిల్లా వారెందరో ప్రకాశించారు. పద్మభూషణ్ భానుమతి, జి.వరలక్ష్మి, గిరిబాబు, మాదాల రంగారావు, టి.కృష్ణ, వెంకటేష్, హరనాధరావు వంటి ఎందరినో చెప్పవచ్చు.

శ్రవ్య, సమాహార కళలతో పాటు దృశ్య కళల్లోనూ మన జిల్లా అగ్రగామిగానే నిలిచింది. గుండెలు తాకే లోతైన భావాలతో కుంచె కదిలించే డా॥మాచిరాజు రామచంద్రరావు, ఉల్చి, చివుకుల భరద్వాజశాస్త్రి, మన జిల్లా చిత్ర కళా లోకంలో త్రిమూర్తునవచ్చు.

కందుకూరి జనార్ధనస్వామి దేవాలయం, మార్కాపురం చెన్నకేశవ దేవాలయం, త్రిపురాంతకం, చేజర్ల, కొణిదెన దేవాలయాలు ఇక్కడ వెలసిన శిల్పకళకు తర్పణాలు.

డా॥ ధారా రామనాధ శాస్త్రి చేతిలో 'నాట్యావధానం' రూపుదిద్దుకుంది. డా॥ నాగభైరవ గారి సృష్టిలో 'కవన విజయం' కళారూపమైంది.

ఇంకా ఇంకా ఎన్నో సంప్రదాయ జానపద కళారూపాలు మనజిల్లాలో వెలుగుచూశాయి.

మన ప్రాంతం తెలుగుపై ఏ ప్రాంతీయ భాషా సంస్కృతుల ప్రభావం లేదు. అచ్చ స్వచ్ఛమైన తెలుగుదనం ఆరవేసుకున్న అమృత ఖాండం.

అయితే ఈనాడు యాంత్రిక ప్రభావం ఒకవైపు, విదేశీ, సంస్కృతుల ఆక్రమణ మరోవైపు జీవన ప్రపంచీకరణలో తరతరాల సంస్కృతులు కళలు అడుగంటి పోతున్నాయి. నిజానికి సంస్కృతీ సాంప్రదాయాలు మనిషి ఎదుగుదలకు మూలస్థంభాలు.

అందరూ నడుంకట్టి ఉద్ధరించుకుంటేనే అది నిలిచేది. ఒక తరం గురించి మరో తరానికి సాంఘిక వారసత్వాన్ని అందించే వారధులే మన సంస్కృతులు.

❄ ❄ ❄ ❄ ❄


**"గుండ్లకమ్మ"**

పత్రిక దశమ వార్షికోత్సవం సందర్భంగా

ఎడిటర్ **సందిరెడ్డి కొండలరావు** గారికి

*శుభాభినందనలు....*



# కె. కృష్ణయ్య

ఆంధ్రాబ్యాంక్

ఆంధ్రాబ్యాంక్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఒంగోలు.

యన్.కె.ఆర్.యం. బ్రాంచ్

# అద్దంకి చరిత్ర

**ఆంధ్రదేశమునందున్న అతిప్రాచీనమైన నగరాలలో అద్దంకి ఒకటి. ఇది మొదలు కర్మక రాష్ట్రం భాగంగాను, కమ్మనాటి భాగంగాను, పాకనాటి భాగం గాను, పూంగినాడు భాగంగాను అద్దంకి సీమభాగంగాను విరాజిల్లినది.**

**అద్దంకి మొదట అణ్డకి అని పిలిచేవారు. అణ్డకి అనగా సైనిక స్థావరం అని అర్థము. తరువాత అణ్డక్కి గా మార్పు చెంది చివరకు అద్దంకి గా రూపాంతరం చెందినది.**


అద్దంకి కోట




**విద్యాన్‌జ్యోతి చంద్రమౌళి**
ఇంకొల్లు,
సెల్ : 98480 39080


అద్దంకి క్రీ॥శ॥ 4వ శతాబ్దంలో పల్లవులపాలనలోను, ఆ తరువాత ఇక్ష్వాకులపాలనలోను, విష్ణుకుండినుల పాలనలోను వున్న యీ ప్రాంతం తూర్పు చాళుక్యుల పాలనలో చాలా కాలం వున్నట్లుగా వారి శాసనాల ద్వారా తెలుస్తుంది. తూర్పు చాళుక్యుల తరువాత కొణిదెన చోళులు, చక్రనారాయణ వంశీకులు, కాకతీయులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబులు చివరిగా ఆంగ్లేయులపాలనలో నున్నది. ఆంగ్లేయుల పాలనా కాలంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా యెందరో పోరాడారు.

మనకు లభించిన శాసనాలలో క్రీ॥శే॥ 7వ శతాబ్దం నాటి నాగులపాడు శాసనం యీ ప్రాంతంలో లభించిన శాసనాలలో యిదే మొదటి శాసనంగా చెప్పుకోవచ్చు. ఇది దానశాసనం అందులో

దీని తరువాత పేర్కొనదగినది పండరంగని తరువోజ పద్యశాసనం. దీనిని అద్దంకి పండరంగని పద్యశాసనం అని కూడా అంటారు. ఇది కూడ దానశాసనవే. ఆంధ్రసాహిత్య చరిత్రలో తొలిపద్యశాసనంగా కీర్తింపబడినది. గణగ విజయాదిత్యుని సేనానియైన పండరంగడు ధర్మవరంలోనున్న తన గురువు ఆదిత్య భట్టారకునకు ఎనుబొది పుట్ల అడ్డపట్టనేల శా॥శ 770లో దానం గా యిచ్చాడు. యీ శాసనంలో తొలిపద్యం పూర్తిగా పోయినది. రెండవ పద్యం తరువాత గద్యం లభించింది. యిందులో

ఆ తరువాత లభించిన శాసనం బాణారాజుల శాసనం. ఇది క్రీ॥శ 10వ శతాబ్దం నాటిది బాణ సింధూరి బృత్యుండువు ఆ తరువాత 12 వ శతాబ్దం నాటి నగరేశ్వర దేవాలయంలో నున్న చోళుల శాసనాలు ప్రముఖంగా చెప్పవచ్చును. ఆ తరువాత 14, 15, 16 శతాబ్దాల నాటి శాసనాలు అనేకం లభించాయి. యిన్ని ఆధారాలను బట్టి అద్దంకి అతిపురాతన నగరంగా పేర్కొనుట జరిగింది.

ప్రతాపరుద్రుని కుమారుడైన హరిపాలుడు మొదట అద్దంకి మట్టికోటను నిర్మించినట్లుగా తెలియుచున్నది. తరువాత రెడ్డి రాజుల రాజధాని అఖండకీర్తిని పొందినది. ప్రస్తుతం కోటగోడలు నామరూపాలు లేకుండ పోయాయి. ఆనాటి ఆలయాలు కొన్ని మాత్రం మిగిలాయి. ప్రోలయవేమారెడ్డి కుమారుడు రాజధానిని అద్దంకి నుండి కొండవీటికి మార్చి రాజప్రతినిధిని యిచ్చట ఏర్పాటు చేసారు.

రాయల కాలంలో కోటకొంత దెబ్బతిన్నది. ఆ తరువాత రాజప్రతినిధులు యిక్కడ పాలకులుగా వుండిపాలన సాగించారు.

రెడ్డి రాజులు ఆస్థానకవి ఎఱ్ఱనామాత్యుడు రామాయణం, హరివంశాలు రచించి ప్రోలయవేమారెడ్డికి అంకితమిచ్చాడు. భారతారణ్య పర్వశేషాన్ని పూరించి భారతాన్ని పూర్తి చేసి కవిత్రయం లో ఒకరైనారు. నృసింహ పురాణం రచించి ఆహోబిల నృసింహునికి అంకితమిచ్చారు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానకవి విద్యాధికారియైన శ్రీనాథుడు అద్దంకిలో తిరిగినట్లుగా వారి చాటువులు తెలుపుతున్నాయి. అద్దంకి గంగాధర కవి తపతీ సంవరోపాఖ్యానం కొటికలపూడి సోమనాథకవి విష్ణు మిత్రోపాఖ్యానము, నారాయణ తీర్థులవారు కృష్ణలీలా తరంగిణి రచించారు. నారాయణ తీర్థులవారు యీ ప్రాంతంలో నివశించి ప్రజలలో తన తరంగాల ద్వారా భక్తితత్త్వాన్ని వ్యాప్తి చేసారు.

ఆధునిక కాలానికి వచ్చినట్లైతే స్వాతంత్ర్యోద్యమంలో యెందరో పాల్గొన్నారు. అట్టివారిలో కోటసుందరమ్మ గారొకరు. సహాయనిరాకరణ ఉద్యమ సందర్భంగా ఆనాటి తహశీల్దారు పన్నులు కట్టని వారిని బలత్కారంగా నిర్భంధించే సమయంలో సుందరమ్మ గారు తన మెడలోని పుస్తెలతాడును తీసి విసిరి తహశీల్దార్ ముఖాన కొట్టిన దేశభక్తురాలు. రావినూతల వేంకటేశ్వర్లుగారు బాంబుల వేంకటేశ్వర్లుగా ప్రసిద్ధులు అనేక ఉద్యమాలలో పాల్గొని జైలుకెళ్ళిన స్వాతంత్ర్య సమరయోధులు.

విద్యారంగంలో యీ ప్రాంతం మొదట నుండి వెనుకబడినదిగా చెప్పుకోవచ్చు. 1860 ప్రాంతంలో టంగుటూరి ప్రకాశం పంతులుగారి బావగారు పోరూరి నరసింహారావుగారు వీధిబడిని స్థాపించారు. యిందులో ప్రకాశం గారు 3,4 తరగతులు చదువుకున్నారు. ఆ తరువాత 1920లో అద్దంకి వెంకన్నగారు పాఠశాలను స్థాపించారు. దానిని 1933లో లక్కరాజు రామయ్యగారు కొన్నట్లుగా తెలియుచున్నది. ఆనాటి నుండి యీనాటి వరకు లక్కరాజు రామయ్య పంతులు పాఠశాలగా పిలువబడుచున్నది. పోతూరి నరసింహారావు గారిచే ప్రారంభించబడిన పాఠశాల 1905 హైయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలగాను, 1946లో బోర్డు హైస్కూలుగాను మార్పు చెందింది. ప్రకాశం గారి శతజయంతి సందర్భంగా 1974లో ప్రకాశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మార్పు చేశారు. 1992లో జూనియర్ కళాశాలను విడగొట్టి ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలుగా విడగొట్టి మూడు విద్యాసంస్థలయినది.

1984లో ప్రభుత్వ డిగ్రీ కాలేజి యేర్పాటు చేశారు. 1994 లో భారత్ జూనియర్ కళాశాల, 1995లో యన్.టి.ఆర్. డిగ్రీ కళాశాల, 2002లో గోవిందాంబిక జూనియర్ కళాశాల స్థాపించారు. తరువాత విశ్వభారతి జూనియర్ కళాశాల స్థాపన జరిగింది. ప్రస్తుతం అద్దంకిలో 4 జూనియర్ కళాశాలలు, 2 డిగ్రీ కళాశాలలు, 2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 1 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలలు – 11, ప్రాథమికోన్నత పాఠశాలలు – 4, ప్రాథమిక పాఠశాలలు – 10, గుర్తింపు లేని పాఠశాలలు చాలా వున్నవి. ప్రస్తుతం అద్దంకి విద్యాకేంద్రంగా విరాజిల్లుతుంది.

అద్దంకి ప్రాంతం 1904 వరకు నెల్లూరు జిల్లాలో భాగంగా ఉన్నది. 1850లో చందలూరు తాలుకా పేరుతో అద్దంకిలో తాలుకా కేంద్రం యేర్పాటు చేశారు. 1904 నుండి గుంటూరు జిల్లాలో భాగమైంది. యిక్కడ డిప్యూటీ తహశీల్దారు ఉండేవారు. మొదటిలో వీరి ఆధీనంలో పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేవి. తరువాత వీటిని వేరుచేశారు. 1933లో పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాలు జరిగాయి. 1970లో ప్రకాశం జిల్లా ఏర్పడిన తరువాత అద్దంకి మరలా తాలుకా కేంద్రమైంది. 1987 మండల వ్యవస్థ యేర్పడిన తరువాత మండల కార్యాలయమైంది. మొదటిలో అద్దంకి రెండు రెవిన్యూ గ్రామాలు, రెండు పంచాయతీలు ఉండేవి. రక్షణ అద్దంకి రెవిన్యూ క్రింద వెంకటాపురం, వేలమూరిపాడు, కొంగపాడు, విప్పర్లవారిపాలెం, చెరువు కొమ్ముపాలెం, జార్లపాలెం, నాగులపాడు గ్రామాలు ఉండేవి. తరువాత కొన్ని ప్రత్యేక రెవిన్యూ గ్రామాలయ్యాయి. రెండు పంచాయతీలుగా ఉన్న అద్దంకి 1970లో ఒకే పంచాయతీగా యేర్పాటైనను రెండు రెవిన్యూలు కొనసాగుచున్నవి. 2012లో అద్దంకి పంచాయతీ నగర పంచాయతీగా మార్పు చెందింది.

పోలీసు వ్యవస్థ కూడా 1850లో యిక్కడ ప్రారంభమైనట్లు గా తెలియుచున్నది. అయితే చాలా కాలం వరకు డిప్యూటి తహశీల్దారు వారి అనుబంధంగా వుండేది. ప్రత్యేకతలు ప్రతి యేర్పడిన తరువాత 1933లో పోలీస్ స్టేషన్ నిర్మించారు. దీనికి అనుబంధంగా సబ్ జైలు కూడా వుండేది. 1970 లో ప్రకాశం జిల్లా యేర్పడిన తరువాత అద్దంకిలో సర్కిల్ కార్యాలయం యేర్పాటు చేశారు. మొదట నెల్లూరు జిల్లాలోను తరువాత గుంటూరు జిల్లాలోను ప్రస్తుతం ఒంగోలు జిల్లాలో కొనసాగుతుంది.

ఇన్ని రీతులుగా అద్దంకి పట్టణం ఖ్యాతి పొందినదనుటలో యెట్టి ఆశ్చర్యం లేదు. అయితే ప్రాచీన సంపదను, కట్టడాలను కాపాడుకొనుటలో మాత్రం వెనుకబడి పోయింది. నిర్లక్ష్యానికి గురియైనది. పాలకులు గాని, అధికారులు గాని, యెటువంటి శ్రద్ధ చూపుట లేదు. మిగిలిన కొద్దిపాటి ప్రాచీన సంపాదన కాపాడాలనెడి భావం కూడా కనబడుట లేదు. యిట్లే కొనసాగినచో చరిత్రలో అద్దంకిని గూర్చి చదువుకొనుటేగాని దర్శకులకు అవకాశముండదు. ఉండకపోవచ్చు. యిప్పటికైన పురవాసులు అద్దంకి యొక్క ఘనచరిత్రను కాపాడుటలో ముందుటారని ఆశిద్దాం

**కోట గోడలు కూలిపోయెను**
**శిల్ప సంపద పరులపాలై**
**కోట మట్టితో యిల్లు వెలిసెను**
**ఆలయాలు అదృశ్యమాయె**
**నాటి గుర్తులు నేటికేల.**

❄ ❄ ❄ ❄ ❄

# అద్దంకి మండలంలోని జానపద కళలు, కళాకారులు

- జ్యోతి చంద్రమౌళి

**కవులకు కన్నతల్లి కళాకారులకు కల్పవల్లి అద్దంకి నగరం 'అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ అన్నట్లు యిక్కడపుట్టిన ప్రతి వ్యక్తియేదో వొక కళలో రాణించే వారే. యెందరో కళాకారులు జన్మించి తమ జన్మ సార్ధకంచేసుకొన్నారు. ఇక్కడ అనేక జానపద కళలు ఒకనాడు దేదీప్య మానం గా వెలుగొంది ప్రస్తుతం కొడిగట్టిన దీపాలా కునారిల్లుతున్నాయి. కొన్ని కనుమరుగయ్యే ప్రమాదం యేర్పడింది. ఆయా జానపద కళలను గూర్చి తెలుసుకుందాం.**

ఈ ప్రాంతంలో తరతరాలనుండి వంశపారంపర్యంగా విరాజిల్లిన జానపదకళలు వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, ఆరెబుడబుక్కల వారు, బుడిగిజంగాలవారు, పాములవాళ్లు, కాటిపాపలు, బయనీడివారు, కొమ్ముువారు, కడెంవారు ఉన్నారు. వీరే గాక ప్రత్యేక జనాకర్షణ గల కోలాటాలు, చెక్కభజనలు కూడా కలవు.

వీధి నాటకాల గురించి చెప్పుకోవాలంటే 19వ శతాబ్దం నుండి యీ ప్రాంతంలో విరివిగా ప్రదర్శింపబడినాకర్షణ గల కళారూపంగా వెలుగొందింది. ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించింది పాతతరంలో యీ వీధినాటక కళలలో చెప్పుకోదగిన కళాకారులు బండారు సుబ్బయ్య, మేకా అంజయ్య, చింతా కోటయ్య, విస్తాలి హనుమయ్య, కనపర్తి వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి సంగీతరావు, ప్రత్తిపాటి రామదాసు, మెలికా అంకులు, దాసు, రామకోటి మున్నగువారు. ప్రస్తుత తరంలో చింతా భూషణం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శింగరకొండ చెన్నకేశవులు మున్నగువారున్నారు. ప్రస్తుతం యీ కళాకారులు సరియైన ఆదరణ లేక కుటుంబాలు గడవక జీవన్మరణ సమస్యలో వున్నారు. ప్రభుత్వం వారు యీ కళాకరులకు చేయూత నిచ్చి కళను పోషించవలసియున్నది.

ఇదే పరిస్థితిలో తోలుబొమ్మలాట కళాకారులు వున్నారు. సినిమాలకు మూలమైన యీ కళారూపం రాబోయే తరాల వారికి తెలియకపోవచ్చు. యిటువంటి కళ ఒకటి వుందా అనే అనుమానాలు రాకమానవు. యీ తోలుబొమ్మలాట కళాకారులు అద్దంకిలో 5 కుటుంబాలవారున్నారు. రేకనార హనుమంతరావు, రేకనార కోటిలింగం, రేకనార శివశంకర్, వనపర్తి రమణయ్య మున్నగువారున్నారు. ప్రేక్షకులను యెంతో అలరింపజేసే యీ కళారూపం యీనాటి యువతకు తెలియక సరియైన ఆదరణ లేకపోయినది. వీరు దుర్భర జీవితం



సాగించుచున్నారు. సోపాలు, తాళాలు బాగుచేసుకుంటూ జీవిస్తున్నారు.

ఆరెబుడబుక్కల వారు కూడా యింటింటికి తిరిగినా జోలె నిండని పరిస్థితి. మీరాశి గ్రామాలలో కూడా ఆదరణ తగ్గిపోయింది. ఒకనాడు వారి అలంకారానికే



ప్రజలముగ్ధులయ్యేవారు. ప్రస్తుతం జీవనం గడవకపాత బొంతు కుట్టుకొని జీవించుచున్నారు. అద్దంకి లో 15 కుటుంబాలవారున్నారు. లక్కా రామయ్య వెంకటేశ్వర్లు, గురవయ్య, లక్ష్మణుడు మున్నగువారు యిదే జీవనం సాగించుచున్నారు.

గ్రామదేవతల కొలుపులు వస్తే ముందు కనిపించేవారు బయినీడివారు. గ్రామాలలో కొలుపులు సమయాలలోనేగా యితర కార్యక్రమాలకు కూడ వీరిని పిలిపించి కథలు చెప్పించేవారు. అటువంటిది యీనాడు ఆదరణ తగ్గిపోయింది. యీ ప్రాంతంలో విప్పర్ల గురవయ్య. ఆయన కుమారులు కోటేశ్వరరావులు యీ కథలను యెక్కువ ప్రచారంలోకి తెచ్చారు. వారి మరణానంతరం విప్పర్ల హనుమంతరావు కొనసాగించుచున్నాడు.

కాటిపాపలుగూడ 20 కుటుంబాల వారున్నారు. ఒకనాడు యింటి ముందుకు కాటిపాపడు వస్తే యెంతో ఆదరించి ధాన్యం పెట్టేవారు. యీనాడు యింటింటికి తిరిగినా రోజు గడవని పరిస్థితి. బ్రతుకు దెరువు లేక వ్యవసాయ కూలీలుగా మారుచున్నారు. జీవనపోరాటం చేయుచున్నారు. అద్దంకిలో గోవిందు, అంకయ్య, రామరాజు, సీతారాముడు మున్నగువారున్నారు.

బుడిగి జంగాల పరిస్థితి కూడా అదే విధంగా వున్నది. 4 కుటుంబాల వారున్నారు. ఎన్టీఆర్‌కాలనీలో నివసించుచున్న ఒకనాడు గ్రామాలలో కథలు చెప్పి మెప్పించిన యీ కళాకారులు ఆదరించే వారులేక ఆడవారు పగటి పూట యింటింటికి తిరిగి గుమ్మెట వాయిస్తూ భిక్షాటన చేస్తున్నారు. చిరుపాటి నారాయణమ్మ, చిరుపాటి జయమ్మ, కూర్మయ్య, వేళ్ల ముత్యాలు, సీతారాములు మున్నగువారున్నారు. పాములవాళ్లు యీ ప్రాంతాలలో 10 కుటుంబాలవారున్నారు. జీవనం లేక యితర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోయారు. ఒక్క కుటుంబం మాత్రమే ఉన్నది. కాటెంవారు, కొమ్మువారి పరిస్థితి కూడా యిదే విధంగా వున్నది. కటెంవారు 4 కుటుంబాల వారు, కొమ్మువారు ఒక్క కుటుంబంవారున్నారు.

ప్రస్తుతం గ్రామాలలో సజీవంగా బ్రతుకుతున్న కళారూపం కోలాటం. యీ కోలాటాన్ని అన్ని వర్గాల వారు నేర్చుకొని గ్రామాలలో ప్రదర్శనలు యిచ్చుచున్నారు. ఒకనాడు పలు గ్రామాలలోను యీ కోలాట బృందాలు వుండేవి. యీ వ్యాసరచయిత కూడా కొన్ని బృందాలకు కోలాటాలు నేర్పి ప్రదర్శనలు యిప్పించియున్నాడు. ప్రస్తుతం యీ కళారూపాన్ని పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ నేర్చుకొనుచున్నారు. అద్దంకి గ్రామంలో స్వర్ణ సుబ్బారావు గారు చెన్నుపల్లి నాగేశ్వరరావుగారలు అనేక బృందాలకు కోలాటాలు నేర్పి ప్రదర్శనలు యిప్పించుచున్నారు. అద్దంకిలోనే 3 బృందాలు వున్నాయి. చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో వీరు కోలాటం నేర్పుచున్నారు. మొదట వీరు శ్రీలక్ష్మి నరసింహస్వామి కోలాట భజన సమాజం స్థాపించి తిరుమలతిరుపతి దేవస్థానం దాస సాహిత్యం వారిచే అనేక ప్రదర్శనలు యిచ్చుచున్నారు. ప్రతి సంవత్సరం తిరుమలలో వీరి ప్రదర్శన ఉంటుంది. జడకోపు వేయుట వీరి ప్రత్యేకత. కళ్ళకు గంతలు కట్టి ఈ కోపు ప్రదర్శిస్తారు. యింకా కోట అంజలి బృందం, కోటేశ్వరమ్మ బృందాలు వున్నాయి. స్వర్ణ సుబ్బారావు గారు అధ్యక్షులుగా, చెన్నుపల్లి నాగేశ్వరరావు కార్యదర్శిగా, ఎట్టిన భారతీయ కోలాటకళాక్షేత్రం స్థాపించి యువతకు శిక్షణ యిచ్చుచున్నారు. యీ కళాక్షేత్ర స్థాపన యీ ప్రాంతానికే తలమానికం.

తరువాత పేర్కొన తగిన కళారూపం చెక్కభజన, ఒకనాడు ప్రతి గ్రామంలోను ఎంతో ఉత్సాహంగా నేర్చుకొని ఉగాది, సంక్రాంతి, దసరా, అట్లతద్దె, శ్రీరామనవమి మున్నగు పండుగ దినాలలో యీ కళాప్రదర్శన యిచ్చే వారు. బొమ్మనంపాడు, జార్లపాలెం, అద్దంకి, తిమ్మాయపాలెం మొదలగు గ్రామాలలో యీ బృందాలు వుండేవి. ప్రస్తుతం తగ్గిపోయింది. షేక్‌జాన్‌సాహేబ్ గారు చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రస్తుతం సమాజాలు ఏర్పాటు చేసి శిక్షణ యిచ్చుచున్నారు.

కొంతకాలానికి కొన్ని కళలు కనుమరుగైపోయే పరిస్థితి ఉంది. చూచేవారు తగ్గిపోయారు. ఉత్సాహవంతులు గ్రామపెద్దలు పూనుకొని యీ కళలను రక్షించనిచో చదువుకొనుటే గాని చూచే అదృష్టం ఉండదు.

మన ప్రాచీన సంపదను, మన కళలను కాపాడుకొనుట మన కర్తవ్యము.

❄ ❄ ❄ ❄ ❄

# ధృవతార ప్రకాశం

**ప్రకాశం జిల్లా అంటే రాష్ట్ర ప్రజలకు టంగుటూరి ప్రకాశం పంతులే గుర్తొస్తారు. ఆయన రాజఠీవి, గంభీరత్వం, రాష్ట్రానికే వన్నెతెచ్చి పెట్టింది. ప్రజాభిమానంతో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఘనత ప్రకాశం పంతులుకే దక్కింది. 1972 వరకు ఒంగోలుగా పిలుస్తున్న జిల్లాకు ప్రకాశం పంతులు స్మృత్యర్థం అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రకాశం జిల్లాగా నామకరణం చేసి రుణం తీర్చుకున్నారు. అప్పటి నుండి రాష్ట్రంలో మన జిల్లాకు ప్రత్యేక ఆదరణ, గౌరవం దక్కాయి. ప్రకాశం పంతులు పేరును సార్ధకం చేయాలన్న పట్టుదల పాతతరం నుంచి కొత్తతరం ప్రజా ప్రతినిధుల వరకూ పెరిగింది. ఈ నేపథ్యంలోనే వెనుకబడిన ప్రాంతాలన్నింటినీ కలిపి ఏర్పాటు చేసిన జిల్లా నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ఈ నేపథ్యంలో అన్నింటికీ స్ఫూర్తి దాత అయిన టంగుటూరి ప్రకాశం పంతులు గురించి ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది.**

1972మే 23న అప్పటి ఒంగోలు తాలూకా లోని కనపర్తి శివారు వినోదరాయుడు పాలెంలో ప్రకాశం పంతులు జన్మించారు. ఆయన తండ్రి గోపాలకృష్ణయ్య, గ్రామాధికారిగా పనిచేసే గోపాలకృష్ణయ్య



ప్రకాశం పంతులు 8వ యేటనే మృతి చెందారు. దీంతో ఆయన తల్లి తన సంతానాన్ని తీసుకొని కుటుంబాన్ని ఒంగోలుకు మార్చింది. ఇక్కడ చిన్న భోజన హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. తన గురువు ఇమ్మానేని హనుమంతనాయుడు రాజమండ్రి బదిలీ కావడంతో ప్రకాశం పంతులు ఆయనతో అక్కడకు వెళ్లారు. అనతికాలంలోనే అంటే 30 సంవత్సరాల వయసులోనే 1901లో రాజమండ్రి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయి చరిత్ర సృష్టించారు. 1903 లో లండన్ వెళ్ళి బారిస్టర్ పూర్తిచేసిన ఆయన మద్రాస్‌లో మంచి క్రిమినల్ లాయర్‌గా పేరు గడించారు. తర్వాత జాతీయోద్యమం ఉధృతమవుతున్న సమయంలో ఆయన చూపిన ధైర్య సాహసాలు చరిత్రలో నిలిచి పోయాయి. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో బ్రిటిష్ తుపాకీ గుళ్ళకు గుండెను ఎదురొడ్డి కాల్చండిరా కాల్చండి అంటూ ఆయన చేసిన గాండ్రింపులు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూ ఉంటాయి.

ఆ తర్వాత రాష్ట్ర చరిత్రలో మరో మలుపు ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నికవడం. 1952లో మద్రాసు ఉభయ శాసనసభల సంయుక్త సమావేశంలో గవర్నరు ప్రసంగాన్ని సవాలు చేయడమే కాక మంత్రి వర్గంపై ఫిర్యాదు చేస్తూ 3 రోజుల పాటు ప్రసంగించి చరిత్ర సృష్టించారు. ఈ నేపథ్యంలోనే 1953లో ఆంధ్రరాష్ట్రానికి ప్రకాశం పంతులును మొట్టమొదటి ముఖ్యమంత్రిగా చేసి జవహర్‌లాల్ నెహ్రూ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన చేసిన ఎనలేని త్యాగాలు, రాజకీయ వ్యక్తిత్వం కారణంగానే ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఇది రాజకీయ చరిత్రలోనే అపూర్వం అని చెప్పవచ్చు. ఎందుకంటే ఏ రాజకీయ పార్టీకి చెందినవాడు కానప్పటికీ, మెజార్టీ పార్టీ నాయకుడు కాకపోయినప్పటికీ ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అన్ని రాజకీయ పార్టీల్లో పనిచేసిన ప్రకాశం పంతులును ఏ ఒక్కదానికీ కట్టుబడని విప్లవవాది అంటూ దివంగత ప్రధాని పివీ నరసింహారావు అభివర్ణించారు. ఆయన రాజకీయ, వ్యక్తిగత చరిత్రలో ఏ వర్గం ఆయన్ను విమర్శించిన సందర్భంలేదు. జాతి,

కుల, మత, వర్గాలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన అతి తక్కువ మందిలో ప్రకాశం పంతులు ఒకరు. అందుకే ఆయన ధ్రువతారగా ఇప్పటికీ ప్రకాశిస్తూనే ఉన్నారు.



## ప్రకాశం నోట ... అద్దంకి మాటలు...

**(నాజీవితయాత్ర - టంగుటూరి ప్రకాశం గ్రంథం నుంచి స్వీకృతం)**

మా రెండో మేనత్తగారైన నరసమ్మగారికి అప్పట్లో అద్దంకి పరగణా ఉత్తరఖండంలో చేరిన కోరెసపాడు గ్రామంలో వివాహం చేశారు.

నా వీధిబడి చదువు వల్లూరులో కొంతవరకు అయిన తరువాత కుటుంబం నిర్వహణం కోసం మా నాయనగారు వేరొక గ్రామానికి మారదలుచుకుని నన్ను అద్దంకి గ్రామంలో మా పెద్దబావగారైన పోరూరి నరసింహంగారి వద్ద అప్పజెప్పారు.

ఆయన ఆ గ్రామంలో వీధిబడి నడుపుకుంటూ, గౌరవంగా కాలక్షేపం చేస్తూ ఉండేవారు. ఆ బ్రాహ్మడు నాకు పునాది కట్టుదిట్టంగా చదువుచెప్పాడు. కాని, ఆ చదువుకోసం ఆయన నాతో పడ్డ బాధ నాకు తెలియాలి; ఆ పరమేశ్వరుడికి తెలియాలి; అలా నన్ను పెద్ద అల్లుడి దగ్గర చదువుకి అప్పజెప్పి మా నాయనగారు వెంకటగిరి సంస్థానంలో ఉద్యోగసంపాదన కోసం వెళ్ళారు... రెండు సంవత్సరాలు అయిన తరువాత కుటుంబం నాయుడుపేట పంపించారు. అప్పటికే అద్దంకిలో నా వీధిబడి చదువైపోయి ఇంగ్లీషు చదువు ప్రారంభానికి నాయుడుపేట చేరాను.

...మిడిల్ స్కూలుకి 3 రూపాయలు దరఖాస్తు కట్టవలసి వచ్చింది. నేను ఒంగోలుకి 25 మైళ్ళదూరంలో వున్న మా బావగారి యింటికి నడిచివెళ్ళాను.

తీరా నడచి వెళ్ళాక మా బావగారు సాయం చెయ్యలేక పోయారు. కాని నడక అనేది మనకు కొత్త కాకపోవడం వల్ల ఆట్టే ఆశాభంగం కలగలేదు. నాకు-ఒంగోలుకి 10 మైళ్ళలో ఉన్న మా చిన్నక్కగారి ఊరు కొత్తపట్నానికీ, మా మేనమామల ఊరు వినోదరాయుడిపాలానికీ, ఇంకా ఆ దగ్గర గ్రామాలకీ - నడిచి వెళ్ళడంఅనే అలవాటు ఉంటూనే ఉండేది. ఆనాటి నడక సత్తువే ఇప్పటికీ నన్ను బలిష్టంగా ఉంచిందని నా నమ్మకము. మా బావగారి దగ్గిర ఆశాభంగం అయ్యాక - పాపం మా అమ్మగారే తను కట్టుగునే పట్టుబట్ట తాకట్టు పెట్టి ఆ మూడు రూపాయలూ తెచ్చి యిచ్చింది. ఆ గండంతో నా మిడిల్‌స్కూల్ పరీక్ష పూర్తి అయింది. (ఒంగోలుకి 25 మైళ్ళ దూరంలో వున్న ప్రకాశం బావగారి ఊరు అద్దంకి)

.... మా అమ్మగారు అద్దంకిలో వివాహం చెయ్యడానికి నిశ్చయించి ముహూర్తం పెట్టించి, కబురు పంపించింది. నేను మా అమ్మమ్మగారిని ముందు పంపించి 1890 ఫిబ్రవరిలోనో, మార్చిలోనో అద్దంకి చేరాను. రాజమహేంద్రవరం నుంచి బెజవాడదాకా కాలవమీద వచ్చి, అక్కడినించి గుంటూరు మీదుగా అంచెబళ్ళమీద అద్దంకి చేరుకున్నాను. వివాహం చాలా సామాన్యంగా జరిగింది. కావలసిన బంధువులు నలుగురూ వచ్చి ఐదురోజులూ పెళ్ళి సులువుగా తేల్చారు. మా అమ్మగారు నా పెళ్ళితోబాటు మా చెల్లెలు అన్నపూర్ణ పెళ్ళి కూడా చేసింది. అప్పటికి అన్నపూర్ణకు సుమారు 8 సంవత్సరాల వయస్సు ఉంటుంది. మా అమ్మగారు పెద్ద అప్పగారు చనిపోయింది కనక అన్నపూర్ణని మా బావగారికే ఇచ్చి వివాహం చేసింది. నేను పెళ్ళికి వచ్చేసరికే మా అమ్మగారు కార్యక్రమం యావత్తూ నిర్ణయించింది. మొత్తం మీద నా అభిప్రాలెల్లా వున్నా పెళ్ళి జరిగిపోయింది.

1946లో ఉమ్మడి మదరాసు రాష్ట్ర ప్రధానమంత్రి హోదాలో (ఆ కాలంలో ముఖ్యమంత్రిని ప్రధానమంత్రి అనేవారు) అద్దంకి రహదారి బంగళాకు విచ్చేశారు. ఆనాడు జరిగిన బహిరంగ సభలో చిన్ననాటి మిత్రుడైన దేవరసెట్టి వెంకట్రామయ్య బంధువులెవరన్నా అద్దంకిలో ఉన్నారా అని వాకబు చేశాను. అద్దంకిలో దేవరసెట్టి ఇంటిపేరున్న వైశ్యులెవరూ ఉన్న దాఖలాలేదని తెలిసింది. శ్రీ చిన్ని వెంకట సుబ్బారావు గారు 'చిన్న గాంధీబొమ్మ సెంటరు' పక్కసందులో కొత్తమాసు వెంకటరామయ్యగారు ఉండేవారనీ, వారింటికి ప్రకాశం పంతులుగారు వచ్చారని విన్నానని అన్నారు. కీ.శే. కొత్తమాసు వెంకటరామయ్య గారిని గురించి శ్రీ కొత్తమాసు వెంకటేశ్వర్లుగారు (రమేష్ ఫ్యాన్సీ) చెబుతారని అన్నారు. శ్రీ కొత్తమాసు వెంకటేశ్వర్లు గారు వయోవృద్ధులు. వారి పెద్దనాన్నగారే కొత్తమాసు వెంకటరామయ్యగారట. వెంకట రామయ్య గారిని చూడటానికి ప్రకాశం గారు వచ్చిన విషయం తనకు తెలుసునన్నారు. వెంకటరాయ్య గారు గుళ్ళకమ్మ రోడ్డులోని చిన్ని కృష్ణగారి ఇంటి దగ్గరే ప్రకాశం బావగారి ఇల్లు ఉండేదని చెప్పేవారని శ్రీ కొత్తమాసు వెంకటేశ్వర్లుగారన్నారు. 99 ఏళ్ళ వయసున్న అద్దంకి భీష్మాచార్యులు శ్రీ మిన్నికంటి కోటేశ్వరరావు పంతులుగారు ఆనాటి విషయాలని గుర్తుచేసుకొని వెంకటరామయ్య, ప్రకాశం బాల్య స్నేహితులని, ప్రకాశం బావగారి ఇల్లు (వీధిబడి) గుళ్ళకమ్మరోడ్డులోని చిన్ని కృష్ణగారి ఇంటివద్దేనని ధృవపరిచారు. ఈ విధంగా ప్రకాశం వీధిబడి ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి చాలా శ్రమించవలసి వచ్చింది. మనం మన దేశనాయకులు నివసించిన ఇళ్ళను, వారు చదువుకున్న బళ్ళను వేటినీ పరిరక్షించుకోలేక పోతున్నాము. మహనీయుల స్మృతిచిహ్నాలను పదిలంగా రక్షించుకొనే రాజమహేంద్రవరం నుంచి యావదాంధ్రులు స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

❋ ❋ ❋ ❋ ❋

# విదేశీ పక్షులకు ఆశ్రయమిస్తున్న వెలమవారిపాలెం

విదేశి పక్షులు ప్రతి ఏడాది బల్లికురవ మండలంలోని వెలమవారిపాలెంలో 6 నెలలపాటు ఉంటాయి. శతాబ్దాల నుంచి విదేశీ పక్షులు జంటగా వచ్చి పిల్లా పాపలతో తరలి వెళ్తుంటాయి. బల్లికురవ మండలం వెలమవారిపాలెం, అద్దంకి మండలం, ఏలేశ్వరవారిపాలెంలలో ఉన్న చిల్ల చెట్లనే స్థావరాలుగా చేసుకొని 6 నెలల పాటు గడుపుతాయి. గతంలో గ్రామంలో ఉన్న చింత తోపు స్థావరంగా ఉండేది. అయితే స్థానికుల స్వార్థానికి చింతతోపు బలైపోయింది. దీంతో చిల్ల చెట్లే స్థావరాలు అయ్యాయి. నైజీరియా దేశం నుంచి వేల కిలోమీటర్ల దూరం నుంచి ప్రయాణించి వచ్చి చిల్ల చెట్లపై 6 నెలలపాటు గడిపి వెళ్తున్నాయి. గ్రామస్థులు పక్షులను ప్రేమిస్తున్నా పక్షుల స్థావరాలను సంరక్షించటంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వం కూడా పక్షుల స్థావరాలను సంరక్షించటంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ఇప్పుడు పక్షుల రాక కూడా క్రమేపి తగ్గుతుంది. జిల్లాలో విదేశీపక్షులు వచ్చే ప్రాంతాలలో వెలమవారిపాలెం ప్రాంతం ఒకటి. సమీపంలో భవనాని చెరువు, గుండ్లకమ్మ నది ఉండడంతో సమీపంలో పదుల సంఖ్యలో చెరువులు ఉండడంతో విదేశీ పక్షులకు ఆహారం ఇబ్బంది లేకుండా దొరుకుతుంది. ప్రతి ఏడాది జనవరి 1వ తేదీ నాటికి వెలమవారిపాలెం చేరుకొని జూన్ నెల వరకు ఉంటాయి. ఆ సమయంలో వావరణం కూడా ఆహ్లాదకరంగా ఉండటంతో పక్షుల కిల కిల రావాలు స్థానికులను మరింత ఉత్సాహ పరుస్తాయి. పాఠశాల సమీపంలోని చిల్లచెట్లపై పక్షుల స్థావరాలు కావడంతో చిన్నారులు సైతం పక్షుల చెలిమితో ఆడుకుంటుంటారు. వెలమవారిపాలెం ప్రాంతంలో మరిన్ని చెట్ల పెంపకం చేపడితే విదేశీ పక్షుల రాక మరలా



పెరిగే అకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇటు వైపుగా ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# పాండిత్యంలో ప్రసిద్ధులు – అద్దంకి వంశస్థులు

**పంగులూరు మండలం తూర్పు తక్కెళ్ళపాడు అయ్యంవార్లు గారి కుటుంబం తరతరాలుగా పండిత కుటుంబం.**

**ఒకనాటి అద్దంకి చరిత్ర ప్రసిద్ధికెక్కిన రాచగడ్డ. క్రీస్తుశకం 850 నుంచి కూడా అద్దంకి రాజుల పాలనలో ఉన్నట్లు శాసనాలు చాటి చెబుతున్నాయి. అద్దంకి ప్రాంతంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామం ఒకప్పటి అగ్రహారం. ఆ గ్రామానికి చెందిన 'అద్దంకి' వారు జగమెరిగిన బ్రాహ్మణులుగా వాశికెక్కారు. వారినే నేటికీ తక్కెళ్ళపాటి అయ్యవార్లుగా ప్రజలు వ్యవహరిస్తున్నారు.**



అద్దంకి తిరుమల తాతాచార్యులు

నియమ నిష్ఠలతోను, పాండిత్యంతోను సమయస్ఫూర్తితోను, సమయోచిత హాస్య సంభాషణలతోను, రాజులను మెప్పించడంలో వీరికి వీరేసాటి. వీరి ప్రజ్ఞాపాటవాలకు మెచ్చిన నాటి అద్దంకి ప్రభువులు తక్కెళ్ళపాడు గ్రామాన్ని అద్దంకి వంశస్థులకు అగ్రహారంగా దానం చేసినట్లు శాసనాలున్నాయి. ఈ అగ్రహారం విస్తీర్ణం 1632 ఎకరాలు. తక్కెళ్లపాడు అయ్యవార్ల వంశీకులలో ప్రస్తుతం దొరుకుతున్న సమాచారం బట్టి అద్దంకి తాతాచార్యులు వంశానికి మూలపురుషుడుగా తెలుస్తోంది. ఆనాడు 'కేరళ' దేశం నుంచి తెలుగు గడ్డకు వచ్చిన 'కేరళ వర్మ' అనే మహాకవి చేత 'తాతాచార్యులు' 'కవి భూషణ' బిరుదు పొందినట్లు గ్రంథాల ఆధారాలున్నాయి. తాతాచార్యులు ఆశుకవిత్వం చెప్పడంలో దిట్ట. వీరి పద్మాలనేకం ఇప్పటికీ ఈ ప్రాంతం వయోవృద్ధుల నోట వినిపిస్తుంటాయి. ఆయన ఆనాడు అనుసరించిన సంస్కృతి, సంప్రదాయాలే నేటి తరానికి ప్రామాణికంగా ఉండటం గమనార్హం. అద్దంకి వంశానికి చెందిన మరోకవి కుమార తాతాచార్యులు. ఆయన సంస్కృతాంధ్రాలలో 25 గ్రంథాలు రచించారు. వీటిలో ఎక్కువగా అముద్రితాలే. వీరి వంశస్థుడే అద్దంకి తిరుమలాచార్యులు. ఈయన అష్టాక్షరీ మంత్రాన్ని ద్రవిడ భాష నుంచి తెలుగులోకి అనువదించిన పండిత ప్రకాండుడు. వీరి తరువాత అద్దంకి తిరుమలదేశికాచార్యులు భక్తి రచనల్లో మేటి. ఈయన అచ్చుతానంద గోవింద శతకాన్ని రచించారు. అద్దంకి తిరుమల శింగరాచార్యులు రచనల్లో 'పార్వతీలహరి' 'ఆశీలహరి' 'గాయత్రీలహరి' అనే కావ్యాలు పలువురి పండితుల ప్రశంసలు పొందాయి. ఈయన సంస్కృత, ప్రాకృత, తెలుగు భాషల్లో కమ్మని కవితలు అల్లారు. కవిసామ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణ తను రాసిన 'భ్రమరగీత' అనే గ్రంథానికి తిరుమల శింగరాచార్యులు చేత పీఠిక రాయించుకోవడం గొప్ప విషయంగా ఈ సందర్భంలో పేర్కొనవచ్చు. ఈ వంశానికే చెందిన అద్దంకి తాతాచార్యులు, వెంకటాచార్యులు వ్యాకరణ తర్కాలలో ఉద్దండ పండితులు అద్దంకి వెంకట దేశికాచార్యులు మంచి కవిగా గుర్తింపు పొందారు. ఈ తరంలో అద్దంకి తిరుమల శ్రీశైలనాధన్ అయ్యాంగార్ వాస్తు శాస్త్ర ప్రవీణులుగా వాశికెక్కారు. తరతరాలుగా కవి పండిత వంశంగా వాసికెక్కిన అద్దంకి వారి వంశీకులు విద్యాదాతలుగా, అన్నదాతలుగా, ఉచిత వైద్య ప్రదాతలుగా ఈ ప్రాంత ప్రజలు నేటికీ కీర్తించడం కద్దు. ఈ వంశీయులు కోటిమంది కన్యలకు వివాహ సందర్భాలలో మంగళసూత్రాలు, మధుపర్కాలు ఉచితంగా అందించడం తరతరాలుగా ఆచరిస్తూ వచ్చారు. అలాగే వీరు గ్రామాలలో తిరుగుతూ రామానుజాచార్యుల విశిష్ట ద్వైతాన్ని విస్తృతప్రచారం గావించారు. అందులో భాగంగానే గ్రామాలలో మంచి నీటి చెరువులు, కుంటలు, బావులు తవ్వించడం వంశాచారంగా భావించేవారు. వీరి కుటుంబానికి పూర్వపు రాజుల నుంచి సంక్రమించిన అగ్రహారపు భూములలో ఎక్కువభాగం దానధర్మాలకు హరించుకుపోయింది. అయినా ప్రస్తుత తరం అయ్యవార్లు శ్రీశైలనాధన్ అయ్యంగార్ తన వద్దకు వచ్చే పేదలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించడం వారి దానగుణాన్ని చెప్పకనే చెబుతోంది. 'అయ్యంగార్ ఇంటికి వెళ్లిన వారికి అన్నానికి కరవుండదు' అనే సామెత నేటికీ ఈ ప్రాంతంలో వాడుకలో ఉంది.

❄ ❄ ❄ ❄ ❄

# ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చీమకుర్తి 'గెలాక్సీ'

ఒకప్పుడు చీమకుర్తి అత్యంత సాదాసీదా గ్రామం. మరి ఇపుడో గెలాక్సీ ధగధగలతో అంతర్జాతీయంగా వెలిగిపోతోంది. గ్రానైట్ క్వారీ నిక్షేపాలు వెలుగు చూడడంతో ప్రజలు జీవితాలలో కాంతులీనాయి. మధ్య తరగతి ప్రజల జీవనస్థితి గతులు ఉన్నతంగా మారాయి. ఇక్కడి ప్రజల రూపురేఖలే మారిపోయాయి. 1980కి మునుపు ఇక్కడి భూములలో తొండలు గడ్డు పెట్టేవి. ఎవరయినా బాకీ కింద ఒక ఎకరం తీసుకోమంటే ఆయనకు పిచ్చిపట్టినట్టుగా చేసేవారు. ఒక వ్యాపారి ధైర్యంచేసి అప్పట్లో తీసుకుని, ప్రస్తుతం గెలాక్సీ గ్రానైట్ లభ్యమయ్యే ఒకే ఒక ప్రాంతం చీమకుర్తి కావడంతో ఈ రాయికి అంతర్జాతీయంగా గిరాకీ దొరికింది. సామాన్యులు అసమాన్యులయ్యారు. అవుతున్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌ను ఏటా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతోంది. మట్టి రోడ్లలో అవస్థలు పడ్డ జనం ప్రస్తుతం సిమెంట్ రోడ్లపై ఝామ్మని దూసుకుపోతున్నారు.

**రాజకీయాల్లో గెలాక్సీ నేతలు :**

వ్యాపారంతో ఉపాధి కల్పించిన గ్రానైట్ యజమానులు సేవా భావంతో అనేకులను ఆదుకున్నారు. ఇది చాలదన్నట్లుగా సదరన్ మినరల్స్ అధినేత పోతుల రామారావు కూడా ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆనంద్ గ్రానైట్స్ అధినేత ప్రజారాజ్యంలో ఉంటూ ఒంగోలులో పోటీ చేశారు. ఇలా పదిమందికి ఉపయోగపడటానికి కూడా గెలాక్సీ సమర్థులయిన నాయకులను అందించింది. పారిశ్రామిక వాడగా కంకర మిల్లులు ఇళ్ళు కట్టాలన్నా, రోడ్డు వేయాలన్నా ఖచ్చితంగా కంకర కావాల్సిందే. ఇది తయారయ్యే ప్రాంతం జిల్లాలో చీమకుర్తి ప్రాంతమే. బూదవాడ, చీమకుర్తి, ఆర్ఎల్‌పురం, పల్లామల్లి గ్రామాల పరిధిలో నల్లరాయి కొండలు, గ్రానైట్ క్వారీలుండటంతో కంకర వ్యాపారం జోరు



అపరకుబేరునిగా మారాడు. చీమకుర్తి, ఆర్ఎల్ పురం ప్రాంతంలో ఎకరా విలువ కనీసం కోటిరూపాయలకు పై మాటే. 1990 నుంచి ఇక్కడ గ్రానైట్ వ్యాపారం ఊపందుకుంది. 2000 సంవత్సరానికి వ్యాపారం చుక్కలు తాకింది. ప్రజల ఆదాయం, భూములు రేట్లు, ఇతర వ్యాపారాలు పెరిగిపోయాయి. చీమకుర్తి అంటే గెలాక్సీ టౌన్, ప్రపంచంలో ఒక తరహా గ్రానైట్ అనేక ప్రాంతాలలో లభిస్తుంది. అయితే ఎంతోమంది రాజకీయాలలో సైతం అడుగిడి ఉన్నతంగా ఎదిగిపోయారు. చీమకుర్తి ప్రాంతంలో వాసవీ గ్రానైట్ భాగస్వామిగా అడుగిడిన శిద్దా రాఘవరావు శిద్దా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి అంచలంచెలుగా ఎమ్మెల్సీ, టిడిపి పొలిట్‌బ్యూరో స్థాయికి చేరారు. సూర్యా గ్రానైట్స్ అధినేత బూచేపల్లి సుబ్బారెడ్డి ఒక విడత ఎమ్మెల్యేగాను, ఆయన కుమారుడు శివప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్యేగాను ఉన్నారు. పెరిగింది. పదిహేనేళ్ల క్రితం పదిగా ఉన్న ఈమిల్లులు ప్రస్తుతం 70కి చేరుకున్నాయి. దీనిపై కనీసం మూడు వేల మంది ప్రత్యక్షంగాను, మరో మూడు వేల మంది కార్మికులు పరోక్షంగాను జీవిస్తున్నారు. ఒకటిన్నర, ముప్పాతిక, అర, బేబి, డస్ట్‌వంటి ఉత్పత్తులను ఈ మిల్లులు తయారు చేస్తుంటాయి. 1998 నుండి 2009 ఏప్రిల్ వరకూ ఈ వ్యాపారం ఇరగదీసింది.

# ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ప్రకాశం పొగాకు

**జిల్లాలో సాగవుతున్న ప్రధాన వాణిజ్య పంటల్లో పొగాకుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ పంటసాగు గత మూడున్నర దశాబ్ధాల క్రితం ప్రారంభమైంది. అంతకుముందు అక్కడక్కడ మోతుబరి రైతులు, వ్యాపార వర్గాల వారికే పరిమితమైన ఈ పంటను 1975 తరువాత సన్న, చిన్నకారు రైతులు సైతం సాగు చేస్తున్నారు. పాతకాలం నాడు గ్రామీణ ప్రాంతాల వారు అత్యధికంగా సజ్జ, జొన్న, కంది, వేరుశెనగ, పత్తి, ఆముదం వంటి సాధారణ పంటలను సాగుచేసేవారు. అడవి పందుల బెడద, స్థానికంగా ఆయాపంటల సాగులో ఏర్పడిన సమస్యల దృష్ట్యా ఎక్కువమంది రైతులు పొగాకుసాగుపై మక్కువచూపారు.**



ఈ పంటసాగుకు అధిక పెట్టుబడులతో కూడుకుని ఉన్నప్పటికీ బ్యాంకులు ఇస్తున్న సహకారంతో ఈ పంటను అధికంగా సాగుచేస్తున్నారు. పొగాకు బ్యారన్ నిర్మించేది మొదలు దానికి లైసెన్సు పెట్టించుకోవడం, సాగు సమయంలో అధికపెట్టుబడులు పెట్టడం వీటన్నింటిని అధిగమించి జిల్లాలోని అధికశాతం రైతాంగం ఈ పంటను సాగుచేసేందుకు అలవాటు పడ్డారు. జిల్లాలోని 10 వేలంకేంద్రాలు ద్వారా ప్రతిఏటా ఆ పొగాకు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. ఈ పంట సాగుద్వారా వేలాది రైతు, కూలీ కుటుంబాలకు ఉపాధి దొరకడమే కాక ఈ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అభివృద్ధికి ఈ పంట మూలమైంది. అలాగే ఈ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు కూడా ఎక్సైజ్, సుంకం రూపంలో విదేశీ మారక ద్రవ్యం కోట్లాది రూపాయలు ప్రతి ఏడాది జమఅవుతున్నాయి. ఈ పంటయొక్క ప్రాధాన్యతను గుర్తించి 1975లో పార్లమెంట్ చట్టం ద్వారా గుంటూరు కేంద్రంగా పొగాకు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఈ పంట ఉత్పత్తులను ఖరారు చేయడం, వేలం కేంద్రాల ద్వారా క్రయ విక్రయాలు నిర్వహించడం ప్రతిరైతుకు పరిమితిని విధించి ప్రతిఏటా లైసెన్సు ను రెన్యువల్ చేయడం, వ్యాపారులకు రైతులకు మధ్య వారధిగా ఉంటూ కొనుగోళ్ళను జరిపించడం, వ్యాపారుల నుంచి సొమ్మును రైతులకు చేర్చడం తదితర ప్రధానాంశాలను ఈ బోర్డు నిర్వహిస్తుంది. జిల్లాలో వెల్లంపల్లి 1,2 ఒంగోలు 1,2 టంగులూరు, కొండేపి, పొదిలి 1,2 కందుకూరు 1,2, మొత్తం 10 వేలం కేంద్రాల ద్వారా ఈ పొగాకు కొనుగోళ్ళు ప్రతిఏటా జరుగుతున్నాయి. పొగనాట్లు మొదలుకుని క్యూరింగ్ చేయడం, గ్రేడింగ్ చేయడం క్రయ, విక్రయాల సమయాల్లో వేలం కేంద్రాలలో పనులు తదితర ప్రక్రియల ద్వారా వేలాది మంది కూలీ కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. అలాగే రైతుల వద్ద నుండి వ్యాపారులు కొనుగోళ్ళు చేసిన ఉత్పత్తులను వారికి సంబంధించి కంపెనీల్లో చేయించడం ద్వారా త్రోవగుంట, మద్దిపాడు, టంగుటూరు, సింగరాయకొండ, వెల్లంపల్లి, తదితర ప్రాంతాల్లో అత్యధికంగా మహిళా కూలీలకు ఉపాధి లభిస్తుంది. పొగాకు బోర్డు ఏర్పాటు చేయకముందు రైతులు వ్యాపారుల వద్దకు వెళ్ళి ఉత్పత్తులను విక్రయించుకుని వారు ఇచ్చిన కాడికి సొమ్ము

తెచ్చుకోవడం రాష్ట్రంలో 21 వేలం కేంద్రాలు ఉండగా అత్యధికంగా మన జిల్లాలోనే 10 వేలం కేంద్రాలు ఉండడం విశేషం. అలాగే 20 వేలకు పైగా బ్యారన్లు 20 వేలకు పైగా ఉత్పత్తిదారులు, 60వేల హెక్టార్లుకు పైగా ప్రతిఏడాది సాగవుతున్న పొగాకు పంటను 50 శాతం పైగా మనజిల్లాలోనే పండించడం మరో విశేషం. అలాగే ఈ ఉత్పత్తుల కొనుగోళ్ళు చేసే ప్రధాన వ్యాపారులు కూడా మన జిల్లాకు చెందిన వారు కావడం ఈ పంటసాగు మరింతగా పెరగడానికి కారణమైంది. ఏది ఏమైనప్పటికీ ఈ పంటసాగులో రైతాంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ ఈ పంటను సాగుచేస్తున్న రైతుల్లో దాదాపు 50 శాతం రైతులు ఆర్థికంగా స్థిరపడ్డారనే చెప్పవచ్చు. మిగిలిన 50 శాతం రైతులు మాత్రం ఆర్థికంగా కొంత బలహీనపడడానికి



కూడా ఈ పంటే కారణమైంది. అలాగే ఏడాదిలో దాదాపు 9 నెలల పాటు వేలాది మంది కూలీ కుటుంబాలకు ఈ పంట ఉపాధి కల్పిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత గల పంట పండించడానికి 3 నెలలు పడితే విక్రయించేందుకు మాత్రం 6 నెలలకు పైగా పడుతుంది. ఈ పంటను నమ్ముకుని జీవిస్తున్న వారికి రానున్న పదేళ్ళలో ప్రత్యామ్నాయ మార్గాలు చూపేందుకు ప్రభుత్వం కృషిచేయాల్సి ఉంది.

❄ ❄ ❄ ❄ ❄


"గుండ్లకమ్మ" పత్రిక దశమ వార్షికోత్సవం సందర్భంగా
ఎడిటర్ సందిరెడ్డి కొండలరావు గారికి శుభాభినందనలు....

**కల్లూరి లింగమహేశ్వరరావు**

తాశీల్దార్,

జె.పంగులూరు

మరియు

**మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్**




# సినీవికాసంలో జిల్లా వాసులు

**జిల్లాకు చెందిన అనేకమంది వినీలాకాశంలో ఆణిముత్యాలుగా ప్రకాశి స్తున్నారు. నిర్మాతలుగా, దర్శకులుగా, నటులుగా, రచయితలుగా, గాయకులుగా, సంగీత దర్శకులుగా, ప్రొడక్షన్ మేనేజర్లుగా, ఫైట్ మాష్టర్లుగా, ఇంకా చిత్రపరిశ్రమలోని అనేక విభాగాలలో జిల్లా వాసులు ప్రముఖస్థానంలో ఉన్నారు.**

కారంచేడుకు చెందిన ప్రధానంగా దగ్గుబాటి రామానాయుడు నిర్మాతగా హ్యాట్రిక్ సాధించడంతో పాటు గిన్నిస్‌బుక్‌లో రికార్డు సాధించారు. అంతేగాకుండా తాను నటుడిగా అనేక చిత్రాలలో పాత్రలు పోషించారు. తన కుటుంబాన్ని చిత్రం యూనిట్‌గా ఏర్పాటు చేసుకోగలిగారు. తన పెద్దకుమారుడు దగ్గుబాటి సురేష్, సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాతగా అనేక చిత్రాలు నిర్మించాడు. రెండవ కుమారుడు దగ్గుబాటి వెంకటేష్ హీరోగా అనేక చిత్రాలలో నటించాడు. ఈ మధ్యకాలంలో మనుమడు రానా హీరోగా సినీ అరంగేట్రం చేశాడు. రామానాయుడు చిత్రపరిశ్రమలో ఉన్నతస్థానాన్ని సంపాదించడంతోపాటు బాపట్ల పార్లమెంట్ సభ్యులుగా గెలుపొంది ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన భానుమతి



రామకృష్ణ స్వర్గసీమ చిత్రంతో పరిశ్రమలో అడుగుపెట్టి అనేక పాత్రలు పోషించి మంచి నటిగా గుర్తింపు పొందారు. అంతేగాకుండా గాయనిగా, దర్శకురాలిగా, సంగీత దర్శకురాలిగా, నిర్మాతగా, కథారచయితగా చిత్ర పరిశ్రమలో మంచి స్థానాన్ని పొందారు. మైనంపాడులో నవతరం గ్రామంలో జన్మించిన మాదాల రంగారావు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి స్ఫూర్తితో 'అన్న' నల్లూరి



వెంకటేశ్వర్లు శిష్యునిగా కళాకారునిగా చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు. 1979లో



నవతరం పిక్చర్స్‌ని స్థాపించి నిర్మాతగా, నటుడుగా 'యువతరం కదిలింది' సినిమాని నిర్మించి ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర పరిశ్రమలో అభ్యుదయ సినిమాల రూపకల్పనకు నాంది పలికారు. తర్వాత ఎర్రమల్లెలు, విప్లవ శంఖం, ప్రజాశక్తి తదితర చిత్రాలను నిర్మించి ప్రత్యేకతను చాటగలిగాడు. ఆయన



సహకారంతో సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన టంగుటూరు మండలం, కావుటూరి పాలెం గ్రామానికి చెందిన టి. కృష్ణ నటునిగా రాణిస్తూనే స్నేహితులు, ప్రజానాట్యమండలి సహచరులైన పోకూరి బాబూరావు,

వెంకటేశ్వరరావుల సహకారంతో ఈతరం ఫిలిమ్స్‌ని స్థాపించి మొదటిగా 'నేటిభారతం' సినిమా నిర్మించి అభ్యుదయ చిత్రాల వరవడిని పెంచారు. తర్వాత దేశంలో దొంగలుపడ్డారు, దేవాలయం, వందేమాతరం, ప్రతిఘటన, రేపటి పౌరులు చిత్రాలకు దర్శకత్వం వహించి సినీ



ప్రపంచంలో అరుణతారగా పేరొందారు. టి. కృష్ణ మరణానంతరం ఆయన కుమారుడు గోపీచంద్ అనేక మంచి చిత్రాలలో హీరోగా నటించి మంచి పేరు గడించారు. టంగుటూరు మండలం, ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన బి.గోపాల్ ప్రతిధ్వని చిత్రానికి ప్రధానంగా దర్శకత్వం వహించడంతోపాటు ఇంకా అనేక మంది ప్రముఖ నిర్మాణ సంస్థలలో ప్రముఖ హీరోల చిత్రాలకు దర్శకత్వం



వహించారు.

రావినూతల గ్రామానికి చెందిన



గిరిబాబు దేవతలారా దీవించండి, సింహబలుడు తదితర చిత్రాలను నిర్మించడంతోపాటు అనేక చిత్రాలలో హీరోగా, విలన్‌గా, క్యారక్టర్ నటుడుగా మంచి పేరు గడించారు. ఆ తర్వాత ఆయన కుమారుడు రఘుబాబు క్యారక్టర్ నటుడుగా, హాస్యనటుడుగా, అద్దంకి సమీపంలోని కొమ్మినేనివారిపాలెంకు చెందిన ధర్మవరపు సుబ్రమణ్యం మొదట టి.విలో నటించి తర్వాత చిత్ర పరిశ్రమలో అవకాశాలు రావడంతో అనేక చిత్రాలలో నటించి చిత్ర పరిశ్రమలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మద్దిపాడు మండలం, నరసాయపాలెంలో జన్మించి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకునిగా ఎదగడంతోపాటు నవతరం ఫిలిమ్స్, ఈతరం ఫిలిమ్స్, టి. కృష్ణ



మెమోరియల్ పిక్చర్స్ చిత్రాలలో నటించి మంచి నటునిగా గుర్తింపు పొందారు. అంతేగాకుండా ఎందరినో చిత్ర పరిశ్రమకి పరిచయం చేశారు. అందులో ప్రధానంగా వందేమాతరం శ్రీనివాసరావు ఒకరు. మాదాల రంగారావు చిత్రాలలో గాయకునిగా, చిత్ర పరిశ్రమకు పరిచయమైన వందేమాతరం శ్రీనివాసరావు, నారాయణ మూర్తి చిత్రాలలో సంగీత దర్శకునిగా మంచిపేరు సాధించి ప్రస్తుతం చిత్ర దర్శకత్వ బాధ్యతను చేపట్టారు.

వందేమాతర గీతాన్ని ఆలపించిన శ్రీనివాసరావు ఇంటి పేరు పాటపేరు అయ్యింది. ఇంకొల్లుకు చెందిన రాజాచంద్ర



అనేక కుటుంబ చిత్రాలకు దర్శకత్వం వహించి మంచి పేరు సాధించుకున్నారు. చిత్ర పరిశ్రమలో అగ్రతారగా వెలుగొందిన కాంచనది ఒంగోలు మండలం కరవది గ్రామం. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన వాసంతి సినీ హీరోయిన్‌లు అనేక చిత్రాలలో నటించి అగ్రనటిగా వెలుగొందారు. కొండేపి గ్రామానికి చెందిన తొట్టెంపూడి వేణు సినీ హీరోగా ప్రముఖస్థానాన్ని సాధించగలిగారు. జరుగుమల్లి మండలం, టి. అగ్రహారానికి చెందిన నర్రా వెంకటేశ్వరరావు చిత్ర పరిశ్రమలో క్యారెక్టర్ నటుడుగా, విలన్‌గా మంచిపేరు గడించడంతోపాటు టి.వి.ఆర్టిస్ట్‌గా

ప్రముఖ స్థానాన్ని సంపాదించారు.

ఒంగోలుకు చెందిన ఎంవిఎస్ హరనాథరావు నాటక, సినిమా రచయితగా,



మాటల రచయితగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచిపేరు సంపాదించుకున్నారు. ఒంగోలు వాస్తవ్యుడు మరుధూరి రాజా సినిమా కథారచయితగా, మాటల రచయితగా మంచి స్థానాన్ని పొందాడు. ఒంగోలు నివాసులు ఇసుకపల్లి మోహనరావు, కామేశ్వరరావులు, కథారచయితగా, మాటల రచయితగా మంచిస్థానాన్ని పొందారు. దర్శకత్వంలో ప్రముఖంగా కనిగిరికి చెందిన ఈదర శ్రీను, యర్రగొండపాలెంకు చెందిన హరిబాబులు, పెందేపికి చెందిన మద్దినేని రమేష్ మంచి స్థానాన్ని పొందారు. నిర్మాతలుగా ఒంగోలుకు చెందిన దండే శ్రీనివాసరావు, ఈసా ప్రకాశరావు, చీమకుర్తికి చెందిన బూచేపల్లి సుబ్బారెడ్డిలు పలు చిత్రాలు నిర్మించారు. నటులుగా ఒంగోలుకు చెందిన ఎంబి



కోటేశ్వరరావు, తూమగుంట వెంకటేశ్వర్లు, ఫాబ్‌జాన్, చీమకుర్తికి చెందిన బూచేపల్లి కమలాకర్, ఒంగోలుకు చెందిన ఈసా మధుబాబు, సిఎన్ఆర్ ఆంజనేయులు (మాయాబజార్), దగ్గుబాటి రాజా మంచి పేరు సంపాదించారు. వేటపాలెంకు చెందిన జె.వి. రాఘవులు, రామ్, లక్ష్మణ్, రాజులు ఫైట్‌మాస్టర్లుగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా గాలిపింజల నరసింహారావు (సీతారాముల




కళ్యాణం చూతము రారండి పాటకు) ఎన్నో సినిమాలకు పనిచేశారు.

ప్రధానంగా జాతీయస్థాయిలో హిందీ హాస్యనటునిగా గుర్తింపు పొందిన జానీలీవర్‌ది హనుమంతునిపాడే. వీరేకాక ఇంకా ఎందరో సినీనటులుగా, నిర్మాతలుగా, దర్శకులుగా అసోసియేట్ దర్శకులుగా, అసిస్టెంట్ దర్శకులుగా రచయితలుగా పేరు గడించి జిల్లాకి చలన చిత్ర పరిశ్రమలో ప్రముఖస్థానం కల్పించారు. ❄ ❄ ❄ ❄ ❄


**"గుండ్లకమ్మ"**

పత్రిక దశమ వార్షికోత్సవం సందర్భంగా

ఎడిటర్ **సందిరెడ్డి కొండలరావు** గారికి శుభాభినందనలు....

**పి.ఎ. అరుణ్‌ప్రసాద్**

సినీ డైరెక్టర్, హైదరాబాద్



# ప్రకృతి ప్రసాదితమైన నల్లమల

ప్రకృతి ప్రసాదంగా చెప్పుకుంటున్న ఈ నల్లమల ప్రకాశం, కడప, కర్నూలు, జిల్లాల్లో 5.75 లక్షల హెక్టారుల్లో నల్లమల వ్యాపించగా నాలుగు లక్షల హెక్టారులకు పైగా ప్రకాశం జిల్లాలోనే వుంది. మావోయిస్టుల మాటున అటవీ స్మగ్లర్ల విచ్చలవిడితనం, అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యవైఖరి వల్ల వేటగాళ్ళ ధాటికి వృక్ష, ప్రాణి సంపద నానాటికి కనుమరుగవుతోంది. ప్రకృతి వర ప్రసాదానికి ప్రతీకగా నిలిచిన నల్లమల అడవుల్లోని వృక్షసంపద, వన్యప్రాణులు, పక్షులు, జీవనదులు దక్షిణాదిలోనే ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దట్టమైన చెట్ల సమూహాలతో, నీటి ప్రవాహాలతో, అసంఖ్యాకమైన జంతు జాలాలలో కళకళలాడే నల్లమల అడవులు క్రమంగా పలుచబడి పోతుండటంతో ప్రకృతి సమతుల్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.

జీవనదులకు పుట్టినిల్లు నల్లమల అడవులు. ఎనమలేరు, నగిలేరు, గుండ్లకమ్మ నదులకు పుట్టుక ఇది. కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు అటవీ డివిజన్ ప్రాంతాలకు ఆగ్నేయ ఋతుపవనాలు, ప్రకాశం జిల్లా గిద్దలూరు, మార్కాపురం అటవీ డివిజన్ ప్రాంతాలకు నైరుతి ఋతుపవనాలు వ్యాపించడంవల్ల భారీ వర్షాలు కురుస్తాయి. నల్లమల అడవుల్లో సాధారణ వర్షపాతం 1000 మిల్లీమీటర్లు. ఇక్కడి గరిష్ట వర్షపాతం 1100 మిల్లీమీటర్లు. అడవుల్లో విపరీతంగా వర్షాలు పడటంతో నల్లమల అడవులు చాలా నదులకు జీవస్థానాలుగా ఉన్నాయి. ఈ నదుల వల్ల వేలాది ఎకరాలు పంటభూములకు సాగునీరు సరఫరా అవుతోంది. నల్లమల అడవుల్లో గుండ్ల బ్రహ్మేశ్వరం వద్ద పుట్టిన గుండ్లకమ్మనది జిల్లాలో రాచర్ల మండలంలోని జె.పుల్లలచెరువు, చోళ్ళవీడు గ్రామాలగుండా పంటచెరువులకు అక్కడి నుండి కంభం మండలంలోని తురిమెళ్ళ చెరువుకు, కంభం చెరువుకు అక్కడి నుండి మార్కాపురం చెరువుకు కూడా నీరందిస్తుంది.

గతకొన్నేళ్ళగా మావోయిస్టులు ఈ ప్రాంత అడవుల్లో సంచరిస్తుండడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఇదే తడవుగా స్మగ్లర్లు అడవులను నరికి అక్రమ రవాణా సాగిస్తున్నారు. మావోలు సంచరిస్తున్నారనే నెపంతో అటవీ శాఖాధికారులు అడవికెళ్ళి విధులు నిర్వహించడానికి జంకుతున్నారు. దీనితో స్మగ్లర్ల కార్యకలాపాలు అడవులలో విచ్చలవిడిగా కొనసాగుతూనే వున్నాయి. నల్లమల అడవుల్లో వెదురు విస్తారంగా పెరుగుతుంది. వేలాది ఎకరాల్లో వెదురు విస్తరించి ఉంది. ఈ వెదురు (గ్రీన్‌గోల్డ్) పచ్చ బంగారంగా పిలుస్తారు. జయంట్ గ్రాస్ అని కూడా పిలుస్తారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 80 శాతం ఈ వెదురువల్లే. ఈ వెదురు మానవునికి ఎంతగానో ఉపయోగపడుతున్నందున లక్షలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. దీనితో వెదురు సైజును బట్టి స్పెషల్ క్లాస్, ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాస్, థర్డ్‌క్లాస్ వెదురు (చిట్టెలు) గాను విభజించారు. రకాలనుబట్టి ధరలు నిర్ణయించి విక్రయిస్తారు. అనేక కుటీర పరిశ్రమలు (ఉ దా: అగరబత్తులు) నెలకొల్పేందుకు అటవీశాఖ శిక్షణకూడా ఇస్తుంది.



నల్లమల అడవుల్లో అంతరించి పోతున్న వన్యప్రాణులను సంరక్షించుకొనేందుకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా వన్యప్రాణుల వధను అటవీశాఖ అధికారులు అరికట్టలేక పోతున్నారు. వేటగాడి వలలకు, బాణం దెబ్బకు, షికారులైటు వెలుతురుకు చిక్కి వన్యప్రాణులు విలవిలలాడుతున్నాయి. ప్రాణాలు కోల్పోతున్నాయి. దోర్నాల మండలం, గాజులపల్లె మండలం అర్ధవీడు మండలంలోని నల్లమల ప్రాంతంలో కుందేళ్ళు, జింకలు, దుప్పులు, నెమళ్ళు, కముజులతోపాటు, పులులను కూడా చంపిన సంఘటనలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి.

దోర్నాల ప్రాంతం నల్లమల అడవుల్లో పశు గ్రాసానికి పెట్టింది పేరు. అడవుల్లో వివిధ రకాల కొండగడ్డి, విస్తారంగా పెరుగుతుంది. ఈ పశు గ్రాసమే కరువు కాలంలో రైతులను ఆదుకొన్నది. బండెడుగడ్డి, సేంద్రియ గడ్డి, గోగడ్డి, పుల్లకాసి, తియ్యసేంద్రియ జానాకు, నేంద్రడ కాసి తదితర గడ్డి ఆగస్టు మాసం నుండి జనవరి నెల వరకు ఎక్కువగా లభిస్తుంది. ఎందరో రైతులు కరువు కాలంలో రైళ్ళల్లో నల్లమల ప్రాంతానికి వెళ్ళి మోపులు, మోపులు గడ్డి తెచ్చుకుంటుంటారు.

నల్లమలే సకల సంపద : నల్లమల అడవులు ప్రకాశం, కడప, కర్నూలు జిల్లాల్లో 5.75 లక్షల హెక్టారులో విస్తీర్ణంలో వున్నాయి. ఇందులో నాలుగు లక్షల ఎకరాలు మన ప్రకాశం జిల్లాలోనే విస్తరించి వుంది.

ఈ అడవుల్లో లక్షలాది హెక్టారుల్లో వివిధ జాతులకు చెందిన కలపచెట్లు విస్తారంగా వున్నాయి. సుందరమైన వెదురు గుజుళ్ళతో, ఆకాశాన్నంటుతున్న చెట్లు, ఔషద మూలికలు, నల్లమల అటవీ ప్రాంతమంతా పచ్చదనంతో పరవశిస్తున్నది.

ఈ అడవులలో ప్రధానంగా విలువైన టేకు, జిట్టేకు, జిట్టేగి, నల్లమద్ది, బుట్టగెనుపు, రుద్రగెనుపు, ఏగిస, చిరుమాను, చిందుగ, తెల్లపొలికి, ఎర్రపొలికి తదితర వందల ఎకరాల చెట్లు విస్తారంగా పెరుగుతూ ప్రకృతి శోభను తెచ్చి పెడుతున్నాయి. ప్రభుత్వానికి పరోక్షంగా ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి.



❄❄❄❄❄

# సమైఖ్యతకూ, సంఘీభావానికి ప్రతీకలు విద్యుత్ ప్రభలు

**ఆ పదిరోజులు ఆ గ్రామంలో ఎవ్వరూ వ్యవసాయపనులకు వెళ్ళరాదని గ్రామ పెద్ద ఆజ్ఞ. పందెపుటెద్దులు ఉలవలు తింటూ చెండ్లు విదుల్చుతున్నాయి. రైతులు ఎడ్లను పెండ్లికూతురులాగా ముస్తాబు చేస్తున్నారు. దాదాపు 200 మంది యువకులు గ్రామ కూడలిలో ఏదో చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నారు. కొందరు రథం బండికి ఉపయోగించే రాతి చక్రాలను చెక్కుతున్నారు. ఒక అతను ఏవో సూచనలిస్తూ ద్దగా అరుస్తున్నాడు. దిక్కులు పిక్కటిల్లేలాగా ఒక్కసారిగా 'హరహరో' అనే హాహాకార శబ్దాలువినిపిస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధుల్లో సహితం దాని గురించే చర్చ, పట్టలేని ఆనందం. దూరప్రాంతాల నుండి వచ్చిన బంధువులతో ఆ గ్రామంలో అందరి ఇండ్లలో ఒక్కసారిగా పెళ్లిల్లు జరుగుతున్నంత సంబరం. ఇంతకీ అక్కడ ఏమి జరుగుతుందోనని ఆతృతపడుతున్నారా!**

అద్దంకి మండలం శింగరకొండ తిరునాళ్ళ సందర్భంగా అద్దంకి కాకానిపాలెం ప్రజలు విద్యుత్ ప్రభలను నిర్మించే దృశ్యాలు ఎంతో వ్య ప్రయాసలకు ఓర్చి ప్రమాదభరితమైన ప్రభల నిర్మాణం ఆ గ్రామస్తుల సమైఖ్యతకు సంఘీభావానికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. పురాతనం నుండి వస్తున్న సాంప్రదాయాలకు అనుగుణంగా గ్రామంలో సుఖశాంతులకు, శాంతి సౌభాగ్యాలకు, పాడిపంటలకు ప్రతీకగా ప్రభల నిర్మాణాన్ని ప్రజలు భావిస్తారు. దాదాపు 90 అడుగుల ఎత్తుతో కనులుమిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో చూచువారికి చూడముచ్చట గొలిపే ప్రభల నిర్మాణం వెనుక ఎంతో కృషి దాగి వుంది.

ప్రభను కట్టడానికి దాదాపు 5 లక్షల రూపాయల వరకూ ఖర్చు అవుతుంది. ఆ వ్యయాన్ని గ్రామస్థులందరూ భరిస్తారు. గ్రామకూడలిలో విశాలమైన ప్రదేశంలో వారం రోజులు శ్రమించి దూలాలతో 90 అడుగుల



ఎత్తు గల ప్రభను నిర్మిస్తారు. దానిని భూమిపై సమాంతరంగా నిలబెట్టడం ఒక ముఖ్యమైన ఘట్టం. తరువాత ఇరవై టన్నుల బరువు గల ఆ ప్రభను రాతిచక్రాల రథంపై అమర్చడంతో సగభాగం పని విజయవంతం అవుతుంది. అందుకుగ్రామస్థులు ఆనందోత్సాహాలతో ఆ రోజు రాత్రి ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు. మరుసటి రోజు ప్రభను తిరునాళ్లలోని ఆంజనేయస్వామి సన్నిధికి తోలుకెళ్ళడం మరొక ముఖ్యమైన ఘట్టం. రథానికి పది జతల పందెపుటెద్దులు కట్టి దాదాపు నాలుగువందల మంది యువకులు పగ్గాలు పట్టుకొని, హరహరో అంటూ సాగే ప్రభ ప్రయాణం చూడముచ్చట గొలుపుతుంది.

కానీ ఈ ప్రయాణంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ప్రభ నేలకొరిగి ప్రాణ నష్టం కలిగే ప్రమాదం ఉంది. ఒక్కొక్కసారి రథచక్రాలు వంగిపోతాయి. ప్రభలు వాలిపోతాయి. వీటిని సరిచూసుకుంటూ ఎంతో జాగ్రత్తగా ప్రభను తిరునాళ్ళకు తోలుకెళతారు. తిరునాళ్ళలలో ప్రభకు కనులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ బల్బులు అమర్చి చుట్టూ అలంకరణ ద్వారాలను అందంగా ఏర్పాటు చేస్తారు. ఆ రోజు రాత్రి ప్రభలపై డాన్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శింపచేస్తారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం డాన్సలను నిషేదించడంతో ప్రభల సంఖ్యతగ్గి తిరునాళ్ల ప్రాధాన్యత తగ్గిపోతుంది. ప్రభలు లేనిదే తిరునాళ్ల లేదు అనే స్థాయి నేడు నెలకొంది. ఇటీవల కాలంలో గ్రామాలలో రాజకీయాలు చోటుచేసుకొని ప్రభలపై పార్టీ జండాలను కట్టుకొనిచీలిపోవడం దురదృష్టకరం.

❄ ❄ ❄ ❄ ❄

# ప్రకాశం జిల్లా పర్యాటక రంగం

## రామాయపట్నం



సాగరతీరంలో ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకర్షిస్తూ విహారకేంద్రంగా రామాయపట్నం భాసిల్లుతుంది. జాతీయ రహదారిపై గుడ్లూరు మండలం తెట్టుకు తూర్పుగా 6 కిలోమీటర్లు దూరంలో రామాయపట్నం సాగరతీరాన అందాలన్నీ కొలువుతీరి వున్నాయి. బ్రిటీషు వారి కాలంలోనే దీన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి అధికారులు, పర్యాటకులు సేద తీర్చుకోవడానికి వీలుగా విశ్రాంతి మందిరాన్ని నిర్మించారు. ఆనాటి లైట్‌హౌస్ ఇప్పటికీ పర్యాటకుల్ని ఆకర్షిస్తూనే వుంది. 1874లో ఇక్కడ నిర్మించిన బైబిల్ శిక్షణా కళాశాల ఇప్పటికీ నడుస్తూనే వుంది ఆ ఆవరణలోని చర్చి, కట్టడాలు ఎంతో ఆకర్షిస్తూ ఉంటాయి.


## శ్రీ దత్తాత్రేయ స్వామి వారి క్షేత్రం - మొగిలిచర్ల

ప్రకాశం జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దివ్యక్షేత్రం వెలుగొందుతున్నది. ఈ క్షేత్రం కందుకూరు పట్టణానికి 50 కి.మీ. దూరంలో వున్న మొగిలిచర్ల గ్రామంలో వున్నది. మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రానికి దక్షిణంగా సుమారు 5 కి.మీ. దూరంలో మొగిలిచర్ల గ్రామం ఉంది. దత్తాత్రేయస్వామి అసలు పేరు వేణుగోపాలస్వామి ఆయన కడపజిల్లా ఇసుకపల్లి నివాసులైన తుమ్మల వేమయ్య నాయుడు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన కలవాడు. ఆయన చిన్నతనంలో తిరుపతి సమీపంలోని రేణిగుంట వద్ద నున్న 'ఏర్పాటు' వ్యాసాశ్రమానికి వెళ్ళిపోయారు. తరువాత మాలకొండకు వచ్చితీవ్ర తపస్సు ఆచరించారు. ముప్ఫైయేళ్ళ లోపే సిద్ధపురుషుడయ్యాడు. 1974లో ఆయన కోరిన ప్రకారం శ్రీపవని శ్రీధరరావు, నిర్మలా ప్రభావతి అను దంపతులు ఆశ్రమం నిర్మించారు. 1976మే 6వ తేదీన ఇకనుంచి తన నామధేయం దత్తాత్రేయస్వామి అని వ్రాసిపెట్టి కపాలమోక్షం ద్వారా తనువు చాలించారు. అప్పటి నుండి మొగిలిచర్ల దివ్యక్షేత్రంగా మారింది. ఈ క్షేత్రంలో భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించబడినవి.

## దొనకొండ విమానాశ్రయం

బ్రిటీష్ కాల ప్రాభవానికి చిహ్నంగా మిగిలిన దొనకొండలోని విమానాశ్రయం నేటికీ చెక్కుచెదరకుండా వుంది. బ్రిటీష్ పాలకులు తమ రాకపోకల కోసం ఏడు దశాబ్దాల క్రితం 154 ఎకరాల విస్తీర్ణంలో దొనకొండలలో విమానాశ్రయాన్ని నిర్మించారు. రాష్ట్రంలో మొట్టమొదటి విమానాశ్రయం. సుదూర ప్రాంతాల నుండి వచ్చే విమానాలు ఇంధనం నింపుకునేందుకు దొనకొండ విమానాశ్రయంలో దిగుతుండేవి. బ్రిటీష్ అధికారులు దొనకొండ విమానాశ్రయంలో విమానాలు దిగి ఇక్కడి నుండి రైలులో ప్రయాణం చేస్తుండేవారు. ప్రస్తుతం నిరుపయోగంగా వున్నా ఆనాటి కట్టడాలు, ఏరో డ్రమ్, మాత్రం చెక్కుచెదరలేదు. పచ్చని ప్రకృతి మధ్య ఉండే ఈ విమానాశ్రయం సందర్శనాస్థలం.

## శ్రీశ్రీశ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారి దేవస్థానం - నెమలిగుండం




ప్రకాశం జిల్లాలో ప్రసిద్దిచెందిన నది గుండ్లకమ్మ, ఆ నదీ జన్మస్థానమే గుండ్లకబ్రహ్మేశ్వరం. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని ఎత్తయిన కొండల నడుమ గుండ్లబ్రహ్మేశ్వర గుడి వుంది. ప్రాచీనమైన నల్లని బండల నడుమ అనేక నీటిగుండాలు వుంటాయి. అందుకే ఆ ప్రాంతానికి గుండ్ల బ్రహ్మేశ్వరమనీ, అక్కడ పుట్టిన నదికి గుండ్లకమ్మ అనే పేరు వచ్చిందని చెబుతారు. అక్కడ ప్రాచీనమైన శివలింగం ఉంది. ఆ ప్రాంతానికి ఎటువంటి ప్రయాణ సౌకర్యం లేదు. దట్టమైన అడవుల్లో కాలినడకన ప్రయాణం చేయవలసిందే.

ప్రతీ సంవత్సరం శివరాత్రి నాడు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. ఎక్కువగా నల్లమల అటవీప్రాంతంలో నివసించే చెంచులే వస్తుంటారు.

అక్కడ సన్నగా ప్రవహించే నీరు, కొండల మీద నుండి జలపాతంలా క్రిందికి ప్రవహిస్తుంది. ఆ ప్రవాహానికి దిగువగా నెమలి గుండం వుంటుంది. అక్కడ కొండమీద రంగస్వామి ఆలయం వుంటుంది. పూర్వం మయూర మహర్షి ఈ ప్రదేశంలో తపస్సు చేయడం వల్ల దీనికి నెమలిగుండం అనే పేరు వచ్చిందట. రంగస్వామి ఆలయానికి కూడా వందల ఏళ్ళ చరిత్ర వుంది. శిథిలమైపోయిన గుడిని 1946లో స్థానికులు పునరుద్ధరించారు. ఇక్కడ యేటా ఉత్సవాలు జరుగుతాయి. జె.పుల్లలచెరువు నుండి 4 కిలోమీటర్లు కాలిబాటన అడవిలోకి నడిస్తే ఈ ప్రదేశం చేరుకోవచ్చు. ఎత్తయిన కొండలు, పచ్చటి అడవి, పురాతన దేవాలయం, కొండల నుండి ఉరికే జలపాతంతో కూడిన అక్కడి వాతావరణం సందర్శకుల్ని కట్టిపడేస్తుంది.

## శ్రీ మోక్షరామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం - రామతీర్థము

శ్రీ మోక్షరామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం కేంద్రానికి 7 కి.మీ. దూరంలో ఉంది. ఈ ఆలయం కొండలు, కోనేర్లు మధ్య ప్రకృతి రమణీయత వుట్టిపడుతూ ఉంటుంది. ఆలయంలో పార్వతీదేవి విగ్రహమే కాక గంగ గుడి కూడా ఉండటం చాలా అపూర్వం. అందుకే ఇక్కడి స్వామిని గంగాపార్వతీ సమేత మోక్ష రామలింగేశ్వరస్వామి అని పిలుస్తారు. చైత్రశుద్ధ పౌర్ణమి నాడు గుడిలో ఉత్సవం జరుగుతుంది. కార్తీక మాసంలో భక్తులు విరివిగా వస్తారు. శివరాత్రి సందర్భమున శ్రీ స్వామి వారికి కళ్యాణం జరుగుతుంది.

## అందాలకోన - భైరవకోన

ప్రకాశం-నెల్లూరు జిల్లాల సరిహద్దులో తూర్పు కనుమల నడుమ సి.యస్.పురం మండలం కొత్తపల్లి గ్రామానికి తూర్పున అయిదు కిలోమీటర్ల దూరాన అటవీప్రాంతములో చూడగానే విశేషంగా ఆకర్షిస్తుంది భైరవకోన. ఎవరినైనా సరే కట్టిపడేసే అత్యద్భుతమైన ప్రకృతి సౌందర్యం, రాతిగుండెలను సైతం పులకింపజేసే పచ్చదనం భైరవకోన ప్రత్యేకతలు. అలాగే కుడివైపుకు తొండం వున్న వినాయక విగ్రహాలు, దుర్గాదేవి, సరస్వతి లక్ష్మీ, పార్వతీదేవి ముఖాలు కలిగిన అమ్మవారి విగ్రహాలు ఇక్కడి ప్రత్యక్ష దైవాలు.

ఈ భైరవకోన పుణ్యక్షేత్రానికి ఉత్తరం వైపున పూర్వపు రాజుల కోట ఒకటి ఉంది. అభేద్యంగా నిర్మించబడ్డ ఈ కోట లోపలి నుంచి శత్రువుల ఉనికిని కనిపెట్టేందుకు వీలుగా రాళ్ళకు రంధ్రాలు తొలిచి అక్కడక్కడ కోటగోడల్లో ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడా కోట పూర్తి శిథిలమైపోయింది. ఈ కోట గోడ వద్ద ఓ పెద్ద సొరంగం



వుంది. ఈ సొరంగం పామూరు మండలంలోని 'అనుమలగిరి' వరకు ఉందని స్థానికుల నమ్మకం.

భైరవకోన దక్షిణం వైపు పర్వత శిఖరాల పై ఓ విశాలమైన ప్రదేశం ఉంది. దీన్ని పంచలింగాల ఘట్టం అంటారు. ఇక్కడ పరశు రాముడు శివలింగాన్ని ప్రతిష్టించి తపస్సు చేశాడని భక్తుల నమ్మకం. ఈ క్షేత్రానికి తూర్పువైపున ఉన్న పర్వత శిఖరం నుండి జలపాతం క్రిందికి దూకుతుంటుంది. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజు రాత్రి 7-9 గంటల మధ్య చంద్రుని కాంతి కిరణాలు దుర్గాదేవి ఆలయంలోనికి ప్రసరిస్తాయి. ఆ ఒక్కరోజున ఆ దృశ్యాన్ని చూడటం కోసం భక్తులు తండోపతండాలుగా వస్తారు.

మహాబలిపురంలోని శిల్పాలకు, ఇక్కడ శిల్పాలకు విశేషమైన పోలికలున్నాయి. ఈ క్షేత్రం 6,7 శతాబ్దాల నాటి పల్లవ, చోళ రాజుల కాలంలో నిర్మించబడి ఉండవచ్చని 'ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' వారు నిర్ధారించారు.

శివరాత్రి పర్వదినాన ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండే గాక రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది భక్తులు, సందర్శకులు ఈ క్షేత్రానికి

# చందవరం - బౌద్ధస్థూపం



నేడు ప్రపంచంలో అనేక దేశాలు అవలంభిస్తున్న బౌద్ధమతం మన దేశంలోనే పుట్టి విదేశీయులకు సంస్కృతిని నేర్పింది. నాడు భారతదేశంలో బౌద్ధానికి ఎంత ప్రాముఖ్యత ఉందో తెలియడానికి అనేక తార్కాణాలు బయలుపడ్డాయి. వాటిల్లో ఒకటి ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలోని జగన్నాథపురంలోని బౌద్ధారామం ఎంతో పేరు గాంచింది. కర్నూలు - గుంటూరు రాష్ట్ర రహదారిలో త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరాన "గుండ్లకమ్మ" నది ఒడ్డున వెలసిన ఈ బౌద్ధారామం అతి పురాతనమైనది. దీనిని చందవరం బౌద్ధస్థూపం అని పిలుస్తూంటారు.

1965లో గ్రామస్తులు ఇళ్ళ నిర్మాణం కోసం మట్టి త్రవ్వుతుండగా ఇటుకలు, కొన్ని శిల్పాలు బయటపడ్డాయి. తరువాత పురావస్తు శాఖ వారు జరిపిన త్రవ్వకాల్లో ఆరు అరుదైన శిలాఫలకాలు, మూడు బంగారు పుష్పాలు దొరికాయి.

1972లో రాష్ట్ర పురావస్తుశాఖ ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని నాలుగు దఫాలుగా త్రవ్వకాలు జరుపగా అనేకవందల చిన్న స్థూపాలు, 15 పెద్ద స్థూపాలు బయల్పడ్డాయి. ఈ బౌద్ధస్థూపం 200 అడుగుల ఎత్తు గల కొండై ఉంది. స్థూపం చుట్టుకొలత దాదాపు 120 అడుగులు వుంది సుమారు 30 అడుగుల ఎత్తు ఉంది.

బౌద్ధస్థూపం ఉత్తరద్వారంలో ధ్యాన నిమగ్నుడైన బుద్ధుని పాలరాతి శిల్పం ఉంది. బౌద్ధ శ్రవణకులు విశ్రాంతి తీసుకునే మందిరాల పునాదులు ఈ ప్రాంతంలో వున్నాయి. బౌద్ధ స్థంభాలను నాటికాలంలోనే పాలరాతితో నిర్మించారు. ఆరామాలలో వినియోగించిన నీరు బయటకు వెళ్ళేందుకు కాల్వలు కూడా వున్నాయి.

ఈబౌద్ధస్థూపం రాష్ట్రంలోని ఇతర బౌద్ధస్థూపాల కంటే భిన్నంగా ఉంది. ఈ శిల్పాలలో బుద్ధుడిని పూజిస్తున్న ఒక శిల్పం కూడా బయల్పడినందున ఇది హీనాయాన బౌద్ధ స్థూపమనే అభిప్రాయం కూడా వుంది.

స్థూపం అభివృద్ధి దశలవారీగా జరిగినట్లు తెలుస్తోంది. మొదటిదశలో అశోకుని పూర్వకాలం, రెండవ దశ శాతవాహనకాలం, మూడవ దశ విష్ణుకుండినుల కాలమునకు సంబంధించిన చాయలు కన్పిస్తున్నాయి.

# కొత్తపట్నం



ఏదైనా సెలవుదినాన్ని ఆహ్లాదంగా గడపాలనుకొనే ఒంగోలు పట్టణవాసులకు టక్కున గుర్చొచ్చే పేరు కొత్తపట్నం. ఒంగోలు పట్టణానికి 16 కి.మీల దూరంలో ఉన్న కొత్తపట్నం బీచ్ పట్టణానికి ఏకైక విహార కేంద్రంగా మారింది.

విశాలమైన సముద్రతీరం, పసిడివర్ణంలో మెరిసిపోయే ఇసుక తిన్నెలు, సముద్రం మీద ఎగసిపడే కెరటాలు పర్యాటకుల్ని సమ్మోహితుల్ని చేస్తాయి.

కొత్తపట్నం పూర్వ చరిత్రను పరిశీలిస్తే కొత్తపట్నం సమీపంలోని చిన్న గ్రామమైన పాదర్తిలో వందల సంవత్సరాల క్రితం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గం ఊరువదిలి ఇచ్చి ఇప్పుడు కొత్తపట్నం వున్నచోట నివాసాలు ఏర్పరచుకొన్నారని, అందుకే అప్పుడు దాన్ని కొత్తపట్నం అని పిలిచేవారు. కాలక్రమేణా ఊరు పాతబడినా, పేరు మాత్రం కొత్తపట్నంగానే ఉండిపోయంది.

మొత్తం 8.5 ఎకరాల స్థలంలో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. తీరప్రాంతం వెంట 1600 మీటర్లు పొడవునా ఇనుప పైపులతో డివైదర్‌ను అనుకొని ఫైబర్ చెంబీలను ఏర్పాటుచేస్తారు. సింగిల్ ఛైర్స్, స్విమ్మింగ్ అనంతరం సేద తీర్చుకొనేందుకు ఫైబర్ వాలు కుర్చీలు, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, జారుడు బల్లలు, ఉయ్యాలలు ఏర్పాటు చేస్తారు. ఐరన్ డివైడర్స్ కోసం 1200 మీటర్లు పొడవున లాన్, ఉద్యానవనాన్ని పెంచుతారు. చెన్నైలోని గోల్డెన్ బీచ్ తరహాలో కొత్తపట్నం తీరప్రాంతం త్వరలో రూపొందనున్నది.

## మోటుపల్లి



ఈ గ్రామానికి పూర్వం ముకులపురం, మూసలపురం అనే పేర్లు ఉండేవట. హిస్టారిస్ అనే గ్రీకు నావికుడు తన రచనలో 'మెసోలియా' పట్టణమే నేటి మోటుపల్లి గ్రామమై ఉండవచ్చని పరిశోధకులు విశ్వసిస్తారు.

## కంభం చెరువు



పచ్చని ప్రకృతి రమణీయత మధ్య, నల్లమల కొండల దిగువ విస్తారంగా పర్చుకొని, నిర్మలత్వంతో కన్నుల పండుగ చేసే దర్శనీయ స్థలం కంభం చెరువు. ఒకప్పుడు ఆసియాలోకెల్లా అతి పెద్ద చెరువుగా పేరుగాంచిన ఈ కంభం చెరువు 15వ శతాబ్దం నాటిది. అంతకుముందే మయూర మహర్షి గుండ్లకమ్మ నదిని కొండల దిగువన నిలిపి తటాకాన్ని నిర్మింపచేశాడని ప్రజల నమ్మకం. 15వ శతాబ్దంలో కాకతాయుల పాలనలో ఈ ప్రాతం వుండేది. గజపతుల ప్రతినిధి అయిన గోపన్న వడయార్ శిధిలావస్థలో వున్న చెరువును పునర్నిర్మించాడు. బలమైన చెరువుకట్టను ఏనుగులతో తొక్కించి నిర్మింపచేశాడు. ఖజానాలో ధనాన్ని యావత్తూ చెరువుకై ఖర్చుపెట్టడంతో గజపతులు ఆగ్రహించి నడయార్‌ని బంధించి తెమ్మని సేనానిని పంపాడు. ఆ విషయం తెలుసుకున్న వడయార్ చెరువు మధ్యలో నున్న కొండగుహలో దాక్కున్నాడు. సేనాని నరేంద్రుడు చెరువు కట్టని తెగ నరకించి చెరువు నీరు ఖాళీ అయ్యాక వడయార్‌ని బంధీగా పట్టుకెళ్ళాడు. అప్పట్నుంచీ ఓ 50 ఏళ్ళపాడు చెరువు నిరుపయోగంగా పడివుంది. శ్రీకృష్ణదేవరాయల సతీమణి వరదరాజమ్మ ఆ చెరువు కట్టను తిరిగి నిర్మింపచేసింది. అంతేకాక ఆ ప్రాంతంలో శిధిలమైన దేవాలయాలను బాగుచేయించి, వాటికి మాన్యాలను ఏర్పాటుచేసినట్లు ఇక్కడ శాసనాలున్నాయి. ఈ చరిత్రను అలనాడు ఇండి చీఫ్ సర్వేయర్‌గా వున్న మెకంజీదొర, టైలర్ దొరలు గ్రంథస్థం చేశారు. కంభం చెరువు కట్టమీద ఇప్పటికీ వరదరాజమ్మ గుడి వుంది.

## త్రిపురాంతకం



ప్రకాశంజిల్లా, మార్కాపురానికి 40 కి.మీ. కర్నూలు-గుంటూరు రహదారిలోని వినుకొండకు 35 కి.మీ., దూరంలో వుంది త్రిపురాంతకం. బాలాత్రిపుర సుందరీదేవి, పార్వతీ సహిత త్రిపురాంతకేశ్వరుల నివాసభూమి త్రిపురాంతకం పరమశివుడు శ్రీశైలం వెళుతూ ఇచ్చట నడయాడినాడు. అందుకే త్రిపురాంతకం శ్రీశైలానికి ప్రధాన ద్వారం అయింది.

స్వామి వారి గర్భాలయం, పంచముఖ స్వయంభూజలలింగం, మేరుచక్ర, భూచక్ర, పాతాళచక్ర పీఠ త్రయ మనుగుణ వాస్తుశిల్పంతో నిర్మాణం చేయబడింది. మేరు చక్రం మధ్య గల జలలింగంపై, అభిషేకం చేయబడ్డ జలం, భూచక్ర పీఠగుండా క్రిందకు జారి పాతాళ చక్రం మధ్య రసలింగంపై పడడం ఒక అద్భుత దృశ్యం ఇది చూసితీరాలి.

గర్భాలయానికి ఆగ్నేయదిశలో నగరేశ్వరస్వామి, దక్షిణభాగంలో అపరాధేశ్వర స్వామి ఉన్నారు. నైరుతి దిశలో అగస్త్య మహర్షిచే నిర్మించబడిన ఒక బిలమార్గం వుంది. ఈ బిలం గుండా మునులు, తాపసులు, కాశీ, రామేశ్వరం, శ్రీశైలంకు ప్రయాణించే వారని ప్రతీతి. కానీ అది ప్రస్తుతం రాళ్ళతో, విరిగిపోయిన దూలములతో మూసుకుపోయి ఉంది. ఆలయానికి చుట్టూ కోటికిపైగా శివలింగాలు, శతాధిక జలాశయాలు ఉన్నాయని పూర్వీకులు చెబుతారు.

❄ ❄ ❄ ❄ ❄

# అక్షరమై ప్రవహిస్తున్న "గుండ్లకమ్మ"



– డాక్టర్ **బీరం సుందరరావు**
ఇంకొల్లు, సెల్ : 98480 39080

**"మళ్ళీ జన్మంటూ వుంటే కవిగానే పుడతాను. గుండ్లకమ్మ నీళ్ళతోనే గుక్క తడుపుకుంటాను" అంటారు సుప్రసిద్ధ కవి, మా గురుదేవులు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావుగారు. ప్రకాశం జిల్లాలో ప్రవహించే గుండ్లకమ్మ తీరాన ఉన్న ప్రాంతాన్ని అద్దంకి సీమ అంటారు. అద్దంకి సీమ కళలకు పుట్టిల్లు. సుకవులకు సన్నిధి. కళాకారులకు పెన్నిధి. కమ్మని కలకండ వంటి గుండ్లకమ్మ నీళ్ళు తాగినవాళ్ళంతా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విఖ్యాతిని పొందారు.**

**ఆనాడే కాదు, ఈనాడూ గుండ్లకమ్మ అక్షరమై ప్రవహిస్తూనే ఉంది. ఆనాడు ఎర్రాప్రెగ్గడ నుండి ఈనాటి సందిరెడ్డి కొండలరావు గారి వరకు కలమెత్తి రాసేవారి పక్షాన నిలబడి, గళమెత్తి తరతరాల తన సాహితీ వారసత్వాన్ని గానం చేస్తూనే ఉంది గుండ్లకమ్మ.**

ప్రకాశం జిల్లా 1971 ఫిబ్రవరి 2న ఆవిర్భవించింది. జిల్లాలోని ప్రముఖ కవులు, రచయితలంతా కలసి డాక్టర్ నాగభైరవ గారి నేతృత్వంలో ఒంగోలు జిల్లా రచయితల సంఘం ప్రథమ మహాసభలు 1971 జూన్‌లో జరిపారు. ఈ సభల్లో అప్పుడే కవిత్వం రాస్తున్న కొత్తకలాలు, గళాలు ఎన్నో వేదికపైన పరిచయమయ్యాయి. కవులు, రచయితల సమాచారంతో ముద్రించిన ప్రత్యేక సంచిక ఓహస్తభూషణంగా అందరి కరకమలాలను అలంకరించింది. డాక్టర్ నాగభైరవ సంపాదకత్వంలో పొద్దుపొడుపు కవితా సంకలనం కూడా ప్రచురితమైంది. అనంతరం 1974 జనవరి 12, 13,14 తేదీల్లో అభ్యుదయ రచయితల సంఘం మహాసభలు ఒంగోలులో అత్యంత వైభవంగా జరిగాయి. డాక్టర్ సి. నారాయణరెడ్డి డాక్టర్ దాశరథి, డాక్టర్ గజ్జెల మల్లారెడ్డి, డాక్టర్ ఆరుద్ర, అనిసెట్టి, చా.సో వంటి అతిరథ మహారథులెందరో సభల్లో పాల్గొన్నారు. స్థానిక కవులు ఈమని దయానంద, మల్లవరపు జాన్, యం.వి.యస్.శర్మ, డాక్టర్ దారా, బి.సి. నారాయణరావు వంటి కవులు, రచయితలు సభల విజయానికి విశేషకృషి చేశారు.

14 సం॥ల సుదీర్ఘ విరామం అనంతరం 1985 సెప్టెంబరు 14, 15 తేదీల్లో చీరాల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం ద్వితీయ మహాసభలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక సంచికను ప్రచురించారు.

మళ్ళీ 14 సం॥ల విరామం తరువాత ఒంగోల్లో 1999 జనవరి 8,9,10 తేదీల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం రజతోత్సవ మహాసభలు కన్నులపండువగా జరిగాయి. బి. హనుమారెడ్డి గారి సారథ్యంలో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు గారికి కనకాభిషేక సత్కారం జరిగింది. డాక్టర్ సి. నారాయణ రెడ్డి అమృత హస్తాల మీదుగా జరిగిన ఈ సత్కార సభలో ప్రఖ్యాత కవులు, రచయితలు, రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాల పెద్దలు, అధికారులు హాజరై నిండుదనం చేకూర్చారు. సభల అనంతరం హనుమారెడ్డి గారు అధ్యక్షులుగా డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శిగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. రజతోత్సవ సభలతో ప్ర.ర.సలో కొత్త ఉత్సాహం ఉరకలెత్తింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కవులు, రచయితలు చైతన్యవంతులై ప్ర.ర.సం. ఆధ్వర్యంలో సభలునిర్వహించారు. గత దశాబ్దకాలంగా హనుమారెడ్డి గారు కవులు, రచయితలు, దాతల సహకారంతో రెండేళ్ళకోసారి రాష్ట్రస్థాయి సదస్సులు, మహాసభలు నిర్వహిస్తూనే వున్నారు. ప్ర.ర.సం. ఆధ్వర్యంలో ''పద్యప్రకాశం, కవన ప్రకాశం-2000, 2001'' ప్రచురితమయ్యాయి. అద్దంకి పట్టణంలో "ప్రథమ తెలుగు పద్యశాసనం" పునఃప్రతిష్ఠ కార్యక్రమం 2005లో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హనుమా రెడ్డి గారి

సంపాదకత్వంలో "తరువోజ" పద్య సంపుటి ఆవిష్కృతమైంది. అద్దంకి పట్టణ కవులు, రచయితలు 'సృజన' ఆధ్వర్యంలో 'అద్దంకి కళాసాగర్' సహకారంతో 'పద్యశాసన' ప్రతిష్ఠ జరిగింది. 'సృజన' ఆధ్వర్యంలోనే అద్దంకి ప్రాంతంలోని కవి 'ఎర్రన' విగ్రహ ప్రతిష్ఠ కూడా ఘనంగా జరిగింది.

అద్దంకి కేంద్రంగా 1981లో 'ఎర్రాప్రెగడ సాహితీ సమితి' ప్రారంభమై ఎన్నో సభలు సమావేశాలు నిర్వహించింది. అద్దంకికి చెందిన మాజీ మున్సిఫ్, గ్రామ పెద్ద కాకాని పావయ్యగారు అధ్యక్షులుగా, బీరం సుందరరావు కార్యదర్శిగా ప్రారంభమైన సమితి 1981లో అద్దంకి ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రఖ్యాత కవి డాక్టర్ నాగభైరవ ను ఘనంగా సన్మానించింది. 1985లో నాగభైరవ గారు రచించిన 'గుండ్లకమ్మ చెప్పిన కథ' కావ్యావిష్కరణ సభ వైభవంగా జరిగింది. శ్రీ కాకాని పావయ్య గారికి ఈ కావ్యం అంకితమివ్వబడింది. ఈ సందర్భంగా నాగభైరవ గారు రచించిన 'కవనవిజయం' సాహితీ రూపకం ప్రదర్శింపబడింది. ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. శ్రీ పావయ్యగారి నేతృత్వంలో ప్రస్తుతం 'భవానీ థియేటర్' ప్రక్కన 'రీడింగ్ రూం' ప్రాంగణం అన్యాక్రాంతం కాకుండా సమితి కృషి చేసింది. శ్రీ గుంటూరు హనుమంతరావు, పిట్టల ఆదినారాయణ, లక్కరాజు నరసింహదాసు పంతులు వంటివారు ఈ కృషికి మూలస్తంభాలు. 'రీడింగ్ రూం' స్థలంలో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించి, సభలు, సమావేశాలకు శాశ్వత వేదికగా రూపొందించవలసి వుంది.

అద్దంకి ప్రాంత సాహిత్య, సాంస్కృత వికాసానికి కృషి చేస్తున్న సంస్థల్లో 'సృజన' అద్దంకి సాహితీ సమితి, జానపద కళాపీఠం, అద్దంకి కళా సాగర్‌లను ప్రముఖంగా ప్రస్తావించాలి. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రారంభమైన సృజన గత దశాబ్దకాలంలో ఎన్నో సభలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ కవులకు, సాహితీ వేత్తలకు పురస్కారాలు ప్రదానం చేసింది. అవార్డులు అందచేసింది. అద్దంకి ప్రాంత కవులను రచయితలను ప్రోత్సహించింది. ఎన్నో రచనలను ప్రచురించింది. అద్దంకి కళాసాగర్ రాష్ట్రస్థాయి 'కళాపరిషత్తుల' నిర్వహణతో నాటక రంగానికి కొత్త ఊపిరిపోసింది. అలాగే జాషువా కళాపీఠం కూడ మహాకవి జాషువా జయంతి, వర్ధంతులను నిర్వహిస్తుంది. జాషువా విగ్రహ ప్రతిష్టకు కృషి చేస్తుంది.

అద్దంకి సీమకు ఆభరణమైన కవులు, కళాకారెలెందరో వున్నారు. ప్రాచీనకవుల్లో ఎర్రన అద్దంకిని రాజధానిగా పాలించిన (1350) ప్రోలయవేమారెడ్డి ఆస్థానకవికాగా, మహాకవి శ్రీనాథుడు అద్దంకి గంగాధర కవి, రంగాజమ్మ, లింగంగుంట తిమ్మకవి, అయ్యలరాజు రామభద్రుడు, కందుకూరి రుద్రకవి, వెన్నెలకంటి సూరన వెంకటాచలం, జన్నయమంత్రి, కొటికలపూడి సోమనాథకవి, కోటయార్యుడు, చదలవాడ మల్లన, మోచర్ల వెంకన, పైడిపాటి నృసింహకవి, చింతలపూడి ఎల్లనార్యుడు, అద్దంకి పెద తాతాచార్యులు, చిన తాతాచార్యులు, కుమారతాతాచార్యులు, దేశికాచార్యుడు, వేంకటాచార్యులు వగైరాలను స్మరించుకోవాలి.

ఆధునిక కవులలో కార్యంపూడి నాగభూషణంగారు, కోట సోదరకవులు, బృందావనం రంగాచార్యులుగారు, మహావధాని గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు, గౌరిబోయిన పోలయ్యగారు చెరుకూరి కోటయ్య చౌదరి గారు, జవంగుల యల్లమంద భాగవతార్, రావి హరిచౌదరి భాగవతార్, పింజల సోమశేఖర రావుగారు, బండ్ల సుబ్రహ్మణ్య కవిగారు, నల్లూరి వెంకట్రాయుడు గారు, పరవస్తు వెంకయసూరిగారు, డా॥ కన్నెగంటి రాజమల్లాచారిగారు, డాక్టర్ నారపురాజు శ్రీధరరావుగారు, భానుమతిరామకృష్ణగారు, వంగవోలు ఆదిశేష శాస్త్రి, మల్లవరపు జాన్‌కవి వంటి ప్రముఖులెందరో తెలుగు భారతి సేవలో తరించారు.

వర్తమాన తరం పద్యకవుల్లో అద్దంకి సీమకు వన్నెతెచ్చిన గాడేపల్లి సీతారామమూర్తి గారు ప్రథమ గణ్యులు. మోహముద్గరం, శ్రీ వెంకటాద్రీశ్వర శతకం, అశ్వత్థామ, రామాయణాది కావ్యాలను రచించి 'అభినవ సూరన'గా కీర్తిగడించారు. ఇలపావులూరి సుబ్బారావు గారు బుడుగు - 1, బుడుగు - 2, నవ్వులు-పువ్వులు, నవ్వండి-నవ్వించండి వంటి హాస్యరచనలతో పాటు హనుమాశతకం, కలకూరి రామలింగశతకం, హరివిల్లు, మధుకోణ, రసత్రయం, సృజన చరిత, అవధానాంశ సుధార్ణవం వంటి రచనలు చేసి 'హాస్య కవితా ప్రవీణ' గా ఖ్యాతిగడించారు.

అసంఖ్యాతకంగా పద్యరచనలతో పాటు, చారిత్రక పరిశోధనా రంగంలో విశేషకృషిచేస్తున్న జ్యోతి చంద్రమౌళిగారు 'సూక్తి కిరణాలు' ప్రసరింపచేశారు. 'సూక్తి రత్నాల'ను కుప్పలుపోశారు.

నీలంరాజు నరసింహారావు గారు 'నా పల్లెటూరు' పద్య సంపుటిని ప్రచురించారు. శ్రీ కాకాని పాపయ్య గారు 'హనుమచ్ఛతకం' తో పాటు ఖూనీ, సింగరకొండ చరిత్ర వంటి రచనలు చేశారు. అద్దంకి ప్రాంతీయులు కాకపోయిన జిల్లా సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేసిన వారిలో ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రిగారు, భాషా శాస్త్ర నిపుణులు డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి గారు, డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ గారు, సాహితీ వేత్త, విమర్శకులు ఆచార్య కేతవరపు రామకోటిశాస్త్రి గారు, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు, ఎన్నదగినవారు. సాహితీరంగంలో అద్దంకి సీమకు సమున్నత గౌరవం తెచ్చినవాడు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు, 1962లో 'రంగాజమ్మ కావ్యరచనతో కవితా రంగంలో అడుగు పెట్టిన నాగభైరవ గారు కాలానుగుణంగా కవిత్వంలో వచ్చిన మార్పులన్నింటికీ నిలువుటద్దంగా నిలిచారు. 'అద్దంకి' పట్టణ నామ ప్రాశస్త్యాన్ని చరిత్రలో చాటి చెప్పేందుకు గుండ్లకమ్మ చెప్పిన కథ పద్యకావ్యం రాశారు. ఈ కావ్యాన్ని శ్రీ కాకాని పాపయ్యగారికి అంకిమిచ్చారు.

**"నిరాడంబర జీవనమ్మున**
**నిలుచు సాత్త్విక దీపమతడు**
**నిరాఘాటమ్ము గుచు చరితకు**
**నిలువుటద్దపు రూపమాతడు"**

అని పాపయ్య గారి
వ్యక్తిత్వాన్ని నాగభైరవ
కొనియాడారు.

"ధరణి నా జన్మభూమి
అద్దంకి సీమ
అందు తిరుగాడ చరితల
కందరాని
యేపురాణ గాథలో
ముట్టడించి, గుండె

గుబులుపుట్టించి, నన్ను లోగొను జయించి' అంటూ అద్దంకి చరిత్రకు అక్షరాభిషేకం చేశారు.

**'తరలెనెన్నో యుగమ్ములద్దదును లేదు**
**అరిగెనెన్నో శతాబ్దాలు అంకిలేదు**
**వారి ప్రేమయు కాలగర్భాన కలసె**
**దాని గుర్తుగ నేటి "అద్దంకి" నిలిచె –**

అని కావ్యం ముగించారు. అద్దదు, అంకి అనే ప్రేమికుల జంట జ్ఞాపకార్థం 'అద్దంకి' పేరు చరిత్రలో నిలిచిందని నాగభైరవ సరికొత్త ఊహచేశారు .కొత్త సత్యాన్ని లోకానికి చాటారు.

అద్దంకి సీమకు చెందిన బి. హనుమారెడ్డి గారు న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ, సాహిత్యలోకంలో ప్రసిద్ధులయ్యారు. నాగభైరవ అనంతరం ప్రకాశం జిల్లా రచయితల సంఘం సారధ్య బాధ్యతలు నిర్వహిస్తూనే వెన్నెలపువ్వు, గుజ్జనగూళ్ళు వంటి కవితా సంపుటాలను, మావూరు మొలకెత్తింది, పల్లెకు దండం పెడతా, వీక్షణం, వెన్నెలగీతం వంటి దీర్ఘకావ్యాలను రచించారు.

అద్దంకి పరిసర గ్రామాల నుండి వచ్చి అద్దంకి కేంద్రంగా సాహితీ కృషి చేస్తున్న వారిలో డాక్టర్ యు. దేవపాలన ఒకరు. వీరు 'ప్రకాశం జిల్లా శ్రామిక గీతాలు' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 'విత్తనం శిరసెత్తాలి', 'వేటకొడవలి' వంటి కవితా సంపుటాలు ప్రచురించారు. 'సృజన' అధ్యక్షులుగా పనిచేశారు. అద్దంకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డా॥ గాలి గుణశేఖర్ తెలుగు, తమిళం ఆంగ్లభాషలలో 50పైగా రచనలు చేసి అనేక ప్రశంసలు పొందారు. ఉషా పరిణయం, కవితాస్రవంతి, భారతం, రామాయణం, భాగవతం, భగవద్గీత, వేమన మతం – సర్వజన హితం వంటి అనేక రచనలు ప్రచురించారు.

డి.వి.యం. సత్యనారాయణ గారు 'భజగోవిందం' పద్యానువాదం, 'కలభాషిణి, ఆంధ్ర శతకం, కల్పతల పద్యకావ్యాలు రచించారు. గాడేపల్లి దివాకరదత్తు గారు 'అమ్మా క్షమించు' కవితా సంపుటిని ప్రచురించగా వీరి శ్రీమతి జ్యోతిష్మతి 'కాకిగోల' కవితా సంపుటిని ప్రకటించారు. ప్రముఖ అవధాని గా కీర్తి గడించిన నారాయణం బాలసుబ్రహ్మణ్యంగారు 'అవధానసుధాకరం' తో పాటు పలు శతకాలు రచించారు. ప్రస్తుతం రాయకపోయినా పాటిబండ్ల శ్రీమన్నారాయణగారు 'దేశం కాలిపోతోంది' కవితా సంపుటి ప్రచురించారు. ఆర్. రాఘవరెడ్డి గారు మంచి కథారచయితగా, ఆర్.వి. రాఘవరావు గారు, సాహితీ విశ్లేషకులుగా, చందలూరు నారాయణ గారు, కాకర్ల వెంకటేశ్వర్లు గారు, అన్నమనేని వేంకట్రావు గారు, కళాసాగర్ పంతంగి సీతారామాం జనేయులుగారు కళా,సాహిత్య రంగాల వికాసానికి కృషి చేశారు. కె. అనిల కుమారనూరి గారు, ఇలపావులూరి శేషతల్పసాయి, మురళీధరరావు గార్లు, డాక్టర్ జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, పొత్తూరి వేంకటేశ్వరరావు గారు రచయితలుగా వాసికెక్కారు. మొలకలపల్లి కోటేశ్వరరావుగారు సమకాలీన సమస్యలపై సంఘటనలపై కథలు రాస్తూ ఉత్తమ కథకులుగా వాసికెక్కారు. 'నవజీవన్' పత్రిక వ్యవస్థాపకులుగా సంపాదకులుగా, కవిగా కీర్తి గడించిన చాట్ల రవీంద్రసాగర్ గారు 'కోయిలా! ఓ కోయిలా!!" మరో గెర్నికా కవితా సంపుటాలను ప్రచురించారు. కొండ్రగుంట సుబ్బారావు గారు సభల్లో ఆశువుగా పద్యాలు గానం చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ధర్మవరపు శ్రావణకుమార్, రావూరి రంగయ్య గారు, వీరవల్లి సుబ్బారావు గారు, కొల్లా సీతారామాంజనేయులు గారు, మన్నం త్రిమూర్తులుగారు, మట్టుపల్లి ప్రభాకర్‌రావుగారు సాహితీ పోషకులుగా వాసికెక్కారు. పరిశోధనా రంగంలో డాక్టర్ తగిరస లక్ష్మీరాజ్యం గారు, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ గారు, డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు గారు, డాక్టర్ చిటిబోయిన కోటేశ్వరరావు గారు తదితరులు విశేష కృషి చేశారు. ఇక గజల్స్ రచయితగా, కవిగా గుర్తింపు పొందిన పుట్టంరాజు శ్రీరామచం ద్రమూర్తి గారు విద్యార్థులకు పయోగపడే పలు పద్య రచనలు చేశారు.

కళారంగంలో అద్దంకి ప్రాంత కీర్తిని దశదిశలు చాటిన వారిలో ప్రఖ్యాత రంగస్థల నటులు అద్దంకి శ్రీరామమూర్తిగారు 'హరిశ్చంద్ర' పాత్రలో జీవించి కలియుగ హరిశ్చంద్ర గా కీర్తిగడించిన బండారు రామారావు గారు, విశ్వామిత్ర, దుర్యోధన, కాలకౌశిక, వీరబాహు వంటి పాత్రలకు వన్నె తెచ్చిన మహానటుడు అద్దంకి మాణిక్యాలరావు గారు. వీధినాటకాల ప్రదర్శనతో పాటు, పగటి వేషధారణతో హాస్యాన్ని పండించిన యర్రగుంట్ల అక్కయ్యగారు, బెజవాడ కోటయ్యగారు, ఉపాధ్యాయుడిగా ఒక తరానికి, జ్ఞానదానం చేసి, కళాకారుడిగా, పోషకుడిగా మన్నలందుకున్న లక్కరాజు రామయ్య పంతులుగారు, హరిశ్చంద్ర, బిళ్వమంగళ, భవానీ శంకర పాత్రల్లో రాణించిన అద్దంకి ఆంజనేయ రాజుగారు, సుబ్బిశెట్టి పాత్రధారి ఆలకుంట శ్రీనివాసరావు, నాటక రంగ వికాసానికి కృషిచేసిన చినమద్దులేటి, వారణాసి

రఘురామశర్మ, తంగెళ్ళ నరసింగరావు, అద్దంకి హేమలతతోపాటు 'భీముడు' పాత్రధారణలో తనకు తానే సాటి అనిపించుకున్న పుట్టంరాజు శంకరరావు గారు, వీరి సోదరులు హరిబాబు గారు ప్రశంసనీయులు.

అద్దంకి ప్రాంతం వారు కాకపోయినా, కవులుగా రచయితలుగా, కళాకారులుగా జిల్లాకు విశేషమైన ఖ్యాతిని తీసుకొచ్చిన వారిలో 'నాట్యావధాన స్రష్ట' డాక్టర్ ధారా రామనాథశాస్త్రిగారు, 'నేత్రావధాని' డాక్టర్ ఆ కొండి విశ్వనాథం గారు, 'ధారణావధాని' డాక్టర్ ఒలుకుల శివశంకర్రావు గారు, గణితావధాన్లు ఏలియా, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిగార్లు, ప్రఖ్యాత నవలా రచయిత విరసం నాయకులు జి. కళ్యాణరావు గారు, ప్రఖ్యాత కవి, హిందీ పండితులు ఈమని దయానందంగారు, ప్రజానాట్యమండలి సారధిగా ఎందరో కళాకారులకు స్ఫూర్తిప్రదాతగా నిలిచిన 'అన్న' నల్లూరి వెంకటేశ్వర్లు గారు, డోలు విద్వాంసులు ఈమని రాఘవయ్యగారు, భూసురపల్లి ఆదిశేషయ్య గారు, డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు గారు, ప్రపంచ నాదస్వర చక్రవర్తి షేక్ చినమైలానా సాహెబ్ గారు, ఒంగోలు రంగయ్య గారు, పీరుసాహేబ్‌గారు, దాళిపర్తి పిచ్చాహరిగారు, సినిమా రంగంలో పద్మశ్రీ భానుమతి, టి.కృష్ణ, మాదాల రంగారావు, డాక్టర్ గిరిబాబు, గోపీచంద్, పోకూరి సోదరులు, నర్రా వెంకటేశ్వరరావు, జి. వరలక్ష్మి గార్లు నాటకరంగంలో పాటిబండ్ల ఆనందరావు, డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, ఇసుకపల్లి మోహనరావు, వి.యస్. కామేశ్వరరావు, యం.వి.యస్. హరినాధరావు, బీనీడి కృష్ణయ్య గారు రచయితలుగా వాసికెక్కారు. చిత్రలేఖనంలో ఉల్చి అంతర్జాతీయ ఖ్యాతి గడించారు.

అద్దంకి కేంద్రంగా తొలిసారిగ 'హెచ్చరిక' పత్రికను ప్రారంభించిన గుడిపూడి నరసింహారావు గారు, ప్రస్తుతం గుండ్లకమ్మ (అద్దంకి సీమ) పత్రికను దశాబ్దకాలంగా విజయవంతంగా నడుపుతూ అందరి మన్ననలందుకున్న సందిరెడ్డి కొండలరావు గారు అభినందనీయులు.

❄❄❄❄❄


"గుండ్లకమ్మ" పత్రిక దశమ వార్షికోత్సవం సందర్భంగా ఎడిటర్ సందిరెడ్డి కొండలరావు గారికి శుభాభినందనలు....

**మారుతి పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్**

**ఆథరైజ్డ్ పొల్యూషన్**

**వెలనాటి శ్రీనివాసరావు**, బి.కాం.,


సెల్ : 9440449336, 9505822334

కాటూరి ఆటోమొబైల్స్ ప్రక్కన, మొదటి అంతస్తు, పెట్రోల్ బంకు ఎదురు,


అద్దంకి, ప్రకాశం జిల్లా. సెల్ : 08593-223194

# తెలుగువెలుగు - ఘనాపాటీ తుర్లపాటి

పుస్తక సమీక్ష



**- వలేటి వెంకటేశ్వర్లు,**
రాష్ట్రపతి అవార్డు గ్రహీత




140 పేజీల తుర్లపాటి నా కలం – గళం ఆత్మ కథనం 1400 రీళ్ళు, 140 సీన్స్‌ను, స్క్రీన్ మీద చూపించే విధంగా వ్రాసే స్క్రిప్టు గాదు సుమా! క్రీస్తు పూర్వం వేలాది సంవత్సరాల నుండి క్రీస్తు శకం 2012 వరకు నడుస్తూ వున్న చరిత్ర. ఒక కూచిపూడి తన నాట్యరాణి కాలిగజ్జెల, సవ్వడి. ఆనాడు ఫోర్త్ ఫారంలో, తన దురుసు, దుందుడుకు మాటలకు కలత చెంది తన సోదరిలాంటి ఒక స్వరూపరాణి వార్చిన, కన్నీటితో, పశ్చాత్తాపం – ప్రవర్తనలో – ఒక సరిక్రొత్త – పరివర్తన రూపు రేఖలతో – ఒక పాత్రికేయుని, నీతి, నిజాయితీ, స్థైర్య ధైర్యాలు, ఆత్మాబిమానం, త్యాగం, వితరణ, అదనుజూసి కలానికి పదును, గళానికి సరికొత్త బలంతో, ఉద్రేకం, ఉక్రోషం, వుత్సాహం, వువ్వెత్తున ఎగసిపడే కెరటాల మాదిరిగా, సరికొత్త వుపన్యాస ధోరణి నిలువుటద్దంలో నిటారుగా ఇక్కడే కనిపిస్తాడు సుమా! తుర్లపాటి.

గురువు, భగవంతుడు ఎదురుగా ప్రత్యక్షమయితే ముందుగా గురువుకే నమస్కరిస్తాననే కబీర్ సూక్తిని, తుర్లపాటి తన పాత్రికేయ గురువు కీ॥శే॥ నార్లకు నిండు మనస్సుతో ఆనాడు ప్రత్యక్షంగా నమస్కృతులు, ఈనాడు నివాళులర్పిస్తాడు. జర్నలిస్ట్ కావాలని గాని, కాగలనని గూడా కలలో అనుకోలేదు. ఆనాటి ఆంధ్రప్రభ సంపాదకీయాలు, ఆయన శైలి, ప్రతివాక్యం, వచనకవితారీతి – నాపై సమ్మోహనాస్త్రాలుగా పనిచేశాయి. నార్లవారి మాదిరిగా సంపాదకీయాలు వ్రాయాలి. ఆయన శైలి నా కలంలో, నా గళంలో వినిపించాలనే తపనతో, జర్నలిజంలో అడుగిడి తుర్లపాటి ఒక సందర్భంలో 'తనకలాన్ని వాడి కత్తివాడి ప్రజలలో నవ చైతన్యాన్ని రగిలించిన రచయితలు, ముప్వురే ముప్వురు. వారిలో మొదటి వారు కందుకూరి వీరేశలింగం కాగా, రెండవవారు ముట్నూరి కృష్ణారావు. మూడవవారు యీనాడు మధ్యనే వున్నారు. ఆయన పేరు చెబితే హర్షించరన్న వుద్దేశ్యంతో యీ వ్యాసరచయిత, ఆయన ఏరువుదహరించలేదని నార్లనీ దృష్టిలో పెట్టుకొని ఆనాడు ఆంధ్రజ్యోతిలో తుర్లపాటి వ్రాస్తే – తుర్లపాటి వ్రాసిన 'జాతి నిర్మాతలకు 1968-3-01న నార్ల తొలిపలుకులు వ్రాస్తూ మావాడు ఆంధ్రజ్యోతిలో భగత్‌సింగ్ వ్యాసం వ్రాస్తే గుంటూరు పేరులో ఉత్తేజంతో, సరిక్రొత్త వుద్రేకంతో 'భగత్‌సింగ్' విగ్రహాన్ని స్థాపిస్తే ఇంకా నన్నేమి వ్రాయమంటారు? శిష్యుణి రుణాన్ని యీ విధంగా మనసారా ఆశీర్వదించాడు సుమానార్ల.

తుర్లపాటి నా కలం గళం – ఆత్మకథనం – మధసం చేయబోయే ముందు తుర్లపాటి చుట్టూ ''మూడు 'పి' లు పెనవేసుకున్నాయనే సంగతి, మనం మనం మరపురాని మరుపుగూడని మాటసుమా. పి-ప్రెస్, పి-పిక్చర్, పి-ప్లాట్‌ఫారం. ఇవి తుర్లపాటి చేతిలో పదునైన ఆయుధాలు. పద్మభూషణ్ శివాజీగణేశన్ అన్నట్లు సినిమా తారలకే అసూయ కలిగించేగ్లామరుంది ఆయనకు. (బ్యాక్ బోన్ వున్న

ప్రతివాదు, తుర్లపాటి నిజజీవితం బ్యాక్ గ్రౌండ్ తెలుసుకుంటేనే ఈ ఆత్మకథనం పఠనానికి న్యాయం చేసినవార మవుతాం.

ప్రకాశం నా పెద్ద గురువు. ఆయన దగ్గర స్థైర్య ధైర్యాలు, ముఖ్యంగా ఆయన ఆత్మాభిమానాన్ని ఆలింగనం చేసుకున్నా, రంగాజీ నా చిన్న గురువు. ఎదుటి వారిని, ముఖ్యంగా మహిళలు, భార్యఎడల, మన ప్రవర్తనా తీరుతెన్నులను, తేనెలొలికే మాటలతో తీయగా చెప్పిన మహోన్నత మహామనిషి ఆయన. తుర్లపాటి గళం నుండి వెలువడే వాక్కు ఇది.

గాంధీజిని తుర్లపాటి ప్రత్యక్షంగా కలసి ఆటోగ్రాఫ్ సేకరించాడు. 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రదాత వాషింగ్‌టన్ స్మృతి 2 1/2 శతాబ్దలైనా, ఇప్పటికి ఆమెరికన్ల జాతీయ జీవితంలో గాఢంగా హత్తుకొని వుంది. కాని గాంధీజీ మరణించిన రెండు దశాబ్దాలకే మనం మరచిపోతున్నామంటే భవిష్యత్తులో ఆయునను మన జాతి ఎంతవరకు గుర్తుపెట్టుకుంటుందో మరి? ఇక్కడే తుర్లపాటి కుమిలిపోయాడు.

1957డిసెంబర్ 27న నెహ్రూను విజయువాడలో కలసి, ఆనాటి రాష్ట్ర రాజకీయాలు చర్చించిన తుర్లపాటి ఆయన వ్యక్తిత్వంపై ఆకర్షితుడై తన పుత్రునికి జవహర్‌లాల్ నెహ్రూ అని పూర్తి పేరు పెట్టిన తొలి ఆంధ్రుడు, తొలిభారతీయుడుగా చరిత్రపుటలకెక్కాడు. అయితే 'విశాలాంధ్ర'కు పూర్తి వ్యతిరేకంగా వున్న నెహ్రూ, ఆజాద్‌ను, ముఖ్యంగా తొలి కేంద్రమంత్రి వర్గంలో ఆంధ్రులకు స్థానం లేకపోవడం పట్ల పత్రికలలో తీవ్రంగా దుయ్యబట్టాడు. 1957లో ఆనాటి ముఖ్యమంత్రి సంజీవరెడ్డి – నెహ్రూ వుపన్యాసానికి తన ట్రాన్స్‌లేషన్‌లో 'కోల్డ్‌వార్' అనే ఇంగ్లీషు పదానికి శీతల యుద్ధం అని చెప్పగానే 'తప్పు తప్పు' ప్రత్యక్షయుద్ధం అంటూ ప్రెస్ గ్యాలరీ నుండి గావు కేకలు పెట్టిన వ్యక్తి తుర్లపాటి. 1951 లో ఆంధ్రపత్రిక విలేకరిగా వుండి గన్నవరంలో డా।। అంబేద్కర్‌ను ఇంటర్వ్యూ చేసిన తొలి పాత్రికేయుడు తుర్లపాటి.

1955 డిసెంబర్ 16న ప్రజాసేవ ప్రారంభోత్సవ సభలో తుర్లపాటి చేసిన ప్రసంగానికి మహానాయకుడు జయప్రకాష్ నారాయణ జేజేలు పలికాడు. ఆనాటి అమెరికా ప్రెసిడెంట్ బిల్ క్లింటన్‌ను, గుజరాత్ భూకంపబాధితుల పరామర్శ నిమిత్తం రప్పించడంలో, కీలకపాత్ర వహించాడు తుర్లపాటి. చంద్రబాబు హయాంలో స్విస్ ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్‌లో వ్యవహరించిన దురుసు ప్రవర్తనకు క్షమాపణ చెప్పించాడు తుర్లపాటి.

రాజాజీ ఆంధ్రరాష్ట్రానికి ఆంధ్ర ప్రాజెక్టు వ్యతిరేకంగా వున్నప్పుడు ప్రత్యక్షంగా కలసి తన తీవ్ర నిరసనను తెలియజేశాడు. "తిరు" అనే శబ్దం తమిళులది. ఆ పేర్లతో వున్న గ్రామాలు మావి అని కామరాజు కొంటె ప్రశ్నకు – కృష్ణాజిల్లా మధ్యలో వున్న 'తిరువూరు' గూడా మీదేనా? నాటిగా ప్రశ్నించిన తొలి పాత్రికేయుడు తుర్లపాటి.

1990 లో నోబుల్ ప్రయిజ్ శాంతి కమిటీ – మరణించిన వారికి నోబుల్ బహుమానం యిచ్చే సంప్రదాయం మాకు లేదు గదా? తత్ఫలితంగా గాంధీజికి ఇవ్వలేదని ప్రకటన జేసినపుడు 1981లో మరణించిన ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ హామర్ షీల్డ్‌కు ఎట్లా యిచ్చారనే తుర్లపాటి ప్రశ్నకు అవాక్కు అయ్యారట.

ఒక రాష్ట్రపతి దగ్గర పద్మశ్రీ అందుకున్న తుర్లపాటి, అదే రాష్ట్రపతి – జాతీయ పతాక నిర్మాత ఎవరని – విజయవాడలో ఒక ప్రముఖ వ్యక్తిని వుత్తరం వ్రాసినప్పుడు – యీ జాతికి ఎంత దౌర్భాగ్యం యీ సంఘటన అని తీవ్రంగా ఆక్షేపణ తెలియజేస్తూ పత్రికా ప్రకటన జేసిన తొలి తెలుగు పాత్రికేయుడు తుర్లపాటి. అయితే ఇదే రాష్ట్రపతి ఫ్రాన్స్ పర్యటనకెళ్ళినప్పుడు 100 సం।। చరిత్ర కలిగిన "ఫ్రాన్స్‌కు చెందిన లెమాండ్" పత్రిక భారత దళిత అధ్యక్షుడు ఫ్రాన్స్ రాక శీర్షికతో వార్త వ్రాసినందుకు పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పించిన తొలి పాత్రికేయుడు తుర్లపాటి. అక్కినేనికి లక్షలాది ప్రేక్షకుల బహిరంగ సభలో నటసామ్రాట్ బిరుదు ప్రకటించి "జీవితంలో మరపురాని నీవు, మరువలేను నిన్ను అంటూ అక్కినేని ఆలింగనం చేసుకున్నాడట.

1960 నుండి 1991 వరకు ఆంధ్రజ్యోతి లో తదుపరి "వార్త" లో "వార్తలలోని వ్యక్తి" శీర్షిక అర్ధ శతాబ్ది వరకు నిర్వహించి సరిక్రొత్త చరిత్ర సృష్టించిన పాత్రికేయుడు తుర్లపాటి.

1993 నాటికి 10 వేల బహిరంగ సభలకు అధ్యక్షత వహించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కెక్కిన తుర్లపాటికి ఆ కమిటి అధ్యక్షులు ఆల్మండ్ బ్రూక్ నా ఆలింగన లివిగో అంటూ ఉత్తరం వ్రాశాడట. ఆనాటి ఆంధ్రకేసరి సెక్రటరీ, ఈనాడు దశసహస్ర సభా కేసరి బిరుదుతో ఆయన స్వంత జిల్లాకు రావడం ఆనందం, పరమానందం. నా కలం, గళం (ఆత్మకథనం) అనే ఆకాశాన్ని అరచేతిలో ఎలా చూపించగలను? ఆ విశ్వాన్ని అశ్వంపై ఎట్లా వూరేగించగలను? స్థలాభావం వలన చివరికొసమెరుపు.

1952 మద్రాసు శాసనసభకు జరిగిన ఎన్నికలలో 'గుడివాడ' నియోజక వర్గానికి ప్రకాశం పంతులు – తుర్లపాటి అభ్యర్థిగా 'సై' అన్నాడు. ఎన్నికల కమీషన్ వయస్సు చాలదని 'నై' అన్నదట. అదే జరిగితే యీ తెలుగు–వెలుగు, శాశ్వతంగా కనుమరుగయ్యేదే మరి. అందుకే – అందుకో – ఆంధ్రకేసరి – మా జోహార్లు – ఘనాపాటి తుర్లపాటి మీ కలం – గళం – మీ ఆత్మ కథనం – మీరు 2001లో నాకిచ్చిన ఉపాధ్యాయ సామ్రాట్ రూపంలో వున్న ఈ వలేటి – జేజేలివిగో!

❄ ❄ ❄ ❄ ❄

# సంగీత సరస్వతికి నీరాజనాలందిస్తున్న నాగరత్తమ్మ సంగీత విద్యాలయం

కర్నాటక శాస్త్రీయ సంగీతంలో త్రిమూర్తులుగా వెలుగొందినవారిలో ఇద్దరు ప్రకాశం జిల్లాకు చెందినవారు కావడం మనకు గర్వకారణం. వారిలో త్యాగరాజుది కాకర్ల, శ్యామశాస్త్రి గారిది కంభం. ఈ కోవలో శాస్త్రీయ సంగీతాన్ని కొనసాగించేందుకు ప్రకాశం జిల్లాలోని అద్దంకి పట్టణంలో శ్రీ నాగరత్తమ్మ సంగీత విద్యాలయం విశేష కృషిచేస్తుంది.

పాశ్చాత్య సంస్కృతి మోజులో అంతరించిపోతున్న ప్రాచీన భారతీయ సంస్కృతిలో భాగమైన కర్నాటక శాస్త్రీయ సంగీతాన్ని పునరుజ్జీవింపజేయాలనే ఉద్దేశ్యంతో అద్దంకిలో మొట్టమొదటి సారిగా జగద్గురు శంకరాచార్య శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో 'మట్టుపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీనాగరత్తమ్మ సంగీత విద్యాలయంను ప్రారంభించారు. ఎనిమిదేళ్ళ క్రితం అద్దంకి పట్టణంలోని డాక్టర్ గోపాలరావు గారి వీధిలో ప్రముఖ నాదసుధార్ణవ, నాధనిధి, హంస అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, ప్రముఖ వాగ్గేయకారులు యం.యన్.బాలసుబ్రహ్మణ్యం అమృతహస్తాలతో ప్రారంభమైన ఈ విద్యాలయానికి కరస్పాండెంట్‌గా అద్దంకి కళాసాగర్ వ్యవస్థాపక అధ్యక్షులు మట్టుపల్లి ప్రభాకర్ వ్యవహరిస్తున్నారు. శాస్త్రీయ, లలిత సంగీతాన్ని అద్దంకి ప్రాంతవాసులకు అందించాలనే తన తల్లి చిరకాల వాంఛ మేరకు ఈ సంగీత విద్యాలయాన్ని ప్రారంభించినట్లు మట్టుపల్లి తెలిపారు. పదిమంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ విద్యాలయం అనతికాలంలోనే వందల మందిని సంగీత కళాకారులగా రూపుదిద్దింది. ప్రసుత్తం 200 మంది విద్యార్థులతో విరాజిల్లుతుంది.

విద్యాలయ నిర్వహణ ట్రస్టు ఆధ్వర్యంలో నెలకు సుమారు పదివేల రూపాయల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర స్థాయిలో విద్యాలయ వార్షికోత్సవం సందర్భంగా శాస్త్రీయ, లలిత, గాత్ర సంగీత పోటీలను నిర్వహించడమే గాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంగీత మేధావులను ఆహ్వానిస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అనంతరం విద్యాలయం కొరకు వెచ్చిస్తున్న నిధులతో ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు మట్టుపల్లి తెలిపారు.

ఈ విద్యాలయంలో కర్నాటక, శాస్త్రీయ సంగీతం (గాత్రం) వయోలిన్, ఫ్లూట్, వీణతో పాటు లలితసంగీతం, శాస్త్రీయ, భక్తి సంగీతం, జానపద సంగీతం నేర్పుతారు. రాష్ట్రస్థాయి సంగీత పోటీల్లో ఈ విద్యాలయానికి చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొంది విద్యాలయం దినదినప్రవర్ధమానం చెందుతున్నది.


**"గుండ్లకమ్మ"**

పత్రిక దశమ వార్షికోత్సవం సందర్భంగా

ఎడిటర్ **సందిరెడ్డి కొండలరావు** గారికి శుభాభినందనలు....



**జి. ఆదిత్య** – యు.యస్.ఏ.

**దివి రమేష్** – ఒంగోలు

**బి. రమేష్** – మీరట్

**యం. శ్రీకుమార్** – అద్దంకి

**వి. గోపిచంద్** – హైదరాబాద్

**యస్. హనుమంతరావు** – హైదరాబాద్

**వి. ప్రేమ్‌చంద్** – ఢిల్లీ

**బి. కిరణ్**– చెన్నై

## ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం....

# ఇంటర్నెట్‌లో గుండ్లకమ్మ

సామాజిక రాజకీయ మాస పత్రిక

"గుండ్లకమ్మ" సామాజిక రాజకీయ మాస పత్రిక
అత్యధిక సర్క్యులేషన్ కలిగి మల్టీకలర్‌తో
గ్రామీణ ప్రాంతం నుండి వెలువడుతూ
పాఠకుల విశేష ఆదరాభిమానాలు పొందుచున్నది.

**www.gundlakamma.com**

క్లిక్ చేయండి.... స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ
వార్తా విశేషాలు ఫోటోలు మీముందు ప్రత్యక్షం.






**సందిరెడ్డి కొండలరావు**

ఎడిటర్ & పబ్లిషర్.....
అఖిల్ పబ్లికేషన్స్,
కాకానిపాలెం, అద్దంకి.
ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 9848559566.
e-mail :
gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com